www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 233 | సోమవారం | 12 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

50/5 లెక్కల్లో లేరు

రాష్ట్రంలోని ప్రభుత్వ హైస్కూల్స్‌లో భాగహారాలు చేయగల విద్యార్థులు 20 శాతం మించి లేరు

ప్రాథమిక విద్యాశాఖ నివేదికలో చేదు నిజం



మన తెలంగాణ/ హైదరాబాద్ : 'ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో భాగహారాలు చేయగలిగిన విద్యార్థులు 20 శాతం మించి లేరు. వాస్తవానికి గణితంలో గుణకార, భాగహారాలతో కూడిన రాత లెక్కలు చేయగలగాలి. కానీ ఎక్కడా రాతలెక్కల గురించి కూడికలతో మొదలుకుని గుణకారాల గురించి అభ్యాసం కల్పించలేదు' రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ జనవరి 3 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడులను తనిఖీ చేసి, విద్యార్థులను పరీక్షించి ఇచ్చిన నివేదిక ఇది. సర్కారు బడుల్లో ప్రాథమిక స్థాయిలో ఎక్కువ పాఠశాలల్లో గణితంలో తీసివేతల వరకు, కొన్ని పాఠశాలల్లో గుణకారాల వరకు అభ్యాసం కల్పించారు. గణితంలో నూతన సమస్యలు రాయడంలో పిల్లలకు ఉపాధ్యాయులు సరైన అవగాహన కల్పించడం లేదు. ఉపాధ్యాయులు గణితంలో సంఖ్యలతో కూడిన లెక్కలను బోర్డుపై రాసి చేయమంటున్నారే కానీ, రాత లెక్కలపై అభ్యాసం కల్పించడం లేదని నివేదించారు. పాఠశాలల్లో గణాంకాలకు వాస్తవ ప్రగతికి మధ్య చాలా వ్యత్యాసం ఉందని తనిఖీల్లో తేలింది. తెలుగు, తరువాయి 6లో



దుబాయ్‌లో వరల్డ్ గవర్నమెంట్ సదస్సులో ప్రసంగిస్తున్న మోడీ, ఆయన శంకుస్థాపన చేసిన అక్కడి మొట్టమొదటి హిందూ ఆలయ నమూనా

విజ్ఞానం విధ్వంసానికి తోడు కావొద్దు

సాంకేతిక విప్లవాలు అభివృద్ధి సాధనాలు కావాలి

ఉగ్రవాదులు, హ్యాకర్లు, సైబర్ జాగాను దుర్వినియోగం చేస్తున్నారు : దుబాయ్ సదస్సులో ప్రధాని మోడీ

దుబాయ్: సైబర్‌స్పేస్‌ను దుర్వినియోగం చేయరాదని ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం హెచ్చరించారు. ర్యాడికలైజేషన్‌కు సైబర్‌స్పేస్ వనరు కాకూడదన్నారు. సాంకేతిక విజ్ఞానాన్ని విధ్వంస సాధనంగా కాకుండా అభివృద్ధి సాధనంగా ఉపయోగించాలని సూచించారు. వరల్డ్ గవర్నమెంట్ ప్లీనరీలో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులు, హ్యాకర్లు సైబర్‌స్పేస్‌ను దుర్వినియోగం చేసే పనిలో ఉన్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అందరికీ సౌభాగ్యం అందించాలని చెప్పారు. కృత్రిమ మేధస్సు, నానో, సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్‌లో భారత్ అగ్రస్థానంలో ఉందని మోడీ పేర్కొన్నారు. ఆయన ఐదు ఇలు, ఆరు ఆర్లు గురించి ప్రస్తావించినప్పుడు ప్రేక్షకుల నుంచి హర్షధ్వానాలు వినిపించాయి. ఎంతగా అభివృద్ధి సాధించినప్పటికీ పేదరికం, పౌష్టికాహార లోపం తొలగలేదన్నారు. 'మరో ప్రక్క క్షిపణులు, బాంబుల తయారీకి పెద్ద ఎత్తున డబ్బు, సమయాన్ని వినియోగిస్తున్నాం. మనం సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధి సాధనంగా వాడాలే తప్ప విధ్వంసానికి కాదు' అని అన్నారు. కొందరు సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించి సైబర్ స్పేస్‌ను ర్యాడికలైజ్ చేస్తున్నారన్నారు. ఆన్‌లైన్‌లో క్యాడర్ రిక్రూట్‌మెంట్ కోసం జిహాదీలు సైబర్‌స్పేస్‌ను ఉపయోగించుకుంటున్నారని ఆయన తెలిపారు. 140 దేశాలు, 4000 మంది ప్రతినిధులు పాల్గొంటున్న వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్ 6వ సమావేశంలో భారత్ 'అతిథి దేశం'గా పాల్గొంటోంది. 'వరల్డ్ గవర్నమెంట్ సదస్సుకు నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడం అన్నది నాకే తరువాయి 6లో

మాస్కోలో విమాన ప్రమాదం



71 మంది దుర్మరణం

మాస్కో : మాస్కో నగర శివారులో ఆదివారం 71 మందితో వెళ్తున్న రష్యన్ విమానం కూలిపోయింది. డెమోడిడోవో విమానాశ్రయం నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ఈ విమానం కుప్పకూలినట్టు రష్యన్ మీడియా తెలిపింది. దేశీయ సరటవ్ ఎయిర్‌లైన్స్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆంటోనోవ్ ఎఎన్–148 విమానం యురాల్స్‌లోని ఒర్స్క్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇందులో 65 ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నట్టు మీడియా పేర్కొంది. ఆకాశం నుంచి కూలిపోయి విమానం మంటల్లో కాలిపోవడాన్ని తాను చూశానని అర్గునోవోకు చెందిన స్థానికుడు ఒకరు తరువాయి 6లో

ఉగ్రవేట


జమ్ము సుంజువాన్ సైనిక శిబిరంపై టెర్రరిస్టుల దాడి

ఐదుగురు సైనికులు, ఒక పౌరుడు మృతి

ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతం

ముగ్గురూ జైషే మహమ్మద్ వర్గం వారే, కొనసాగుతున్న గాలింపు

జమ్ము : జమ్ములోని సుంజ్‌వాన్ సైనిక శిబిరంపై ఉగ్రవాదులు చేసిన దాడిలో ఐదుగురు సైనికులు, ఓ పౌరుడు మృతి చెందారు. సైన్యం జరిపిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. శిబిరంలోకి చొరబడిన ఉగ్రవాదుల కోసం వేట కొనసాగుతున్నట్టు సైన్యం ప్రకటించింది. పోలీసులు, సైన్యం క్వార్టర్స్‌ను ఆధీనంలోకి తీసుకున్నాయి. ముగ్గురు ఉగ్రవాదులను సైనికులు చుట్టుముట్టారు. కాగా, జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జెసిఒ) సహా ముగ్గురు సైనికుల మృతదేహాలను గుర్తించినట్టు లెఫ్ట్‌నెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ తెలిపారు. 'శనివారం ఉదయం వారు ముగ్గురు ఉగ్రవాదుల చేతిలో మృతి చెందారు' అని ఆర్మీ అధికార ప్రతినిధి తెలిపారు. ఓ పౌరుడు, జవాన్ తండ్రి మృతదేహాలు కూడా లభ్యమయ్యాయని ఆయన చెప్పారు. ఈ దాడిలో మొత్తం ఆరుగురు ప్రాణాలు కోల్పోయారన్నారు. అయితే, ప్రతిగా జరిపిన కాల్పుల్లో ముగ్గురు జైషే ఇ



మహ్మద్‌కు చెందిన ఉగ్రవాదులు హతమయ్యారని, అందులో ఓ ఉగ్రవాది భారీ ఆయుధాలు కలిగివున్నాడని, మిగతా ఇద్దరు ఎకె–56, గ్రనేడ్లు ధరించివున్నారని ఆయన తెలిపారు. చనిపోయిన సైనికులంతా జమ్మూకశ్మీర్‌కు చెందిన వారే. కాగా, రెండు రోజులుగా జరుగుతున్న ఈ కాల్పుల్లో ఆరుగురు మహిళలు, ఓ చిన్నారి సహా 10 మందికి గాయాలయ్యాయి. గాయపడిన తరువాయి 6లో

వేగంగా సీతారామ

- ప్రాజెక్టుకు వారం రోజుల్లో రెండో దశ అనుమతులు
- ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ ప్రారంభం సందర్భంగా మంత్రి హరీశ్



మన తెలంగాణ/ ఖమ్మం అర్బన్: గోదావరి జలాల స్వప్నం త్వరలోనే సాకారమవుతుందని, యుద్ధ ప్రాతిపదికన సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి ఊరికి సాగునీరు అందిస్తామని భారీ నీటిపారుదల, గిడ్డంగుల శాఖమంత్రి టి.హరీష్‌రావు పేర్కొన్నారు. మొదటిదశ అటవీ అనుమతులు పూర్తయ్యాయని, రెండవదశ అనుమతులు కూడా వారంలో వస్తాయన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్‌బండ్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంఎల్‌ఎ అజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. తొలుత లకారం చుట్టూ బ్యాటరీ కారులో ప్రయాణించి లకారం అందాలను వీక్షించారు. అనంతరం బోటులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ లకారం సుందరీకరణ, అభివృద్ధికి కృషి చేసిన ఎంఎల్‌ఎ అజయ్, మంత్రి తుమ్మలకు అభినందనలు తెలిపారు. ఖమ్మం ప్రజలు గర్వించే విధంగా లకారాన్ని తీర్చిదిద్దారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 10 ఏళ్ల పాలనలో ఏనాడైనా లకారాన్ని పట్టించుకున్నదా అని ప్రశ్నించారు. ఆక్రమణలకు గురవుతున్న పట్టించుకోలేదని, మురికి కూపంలా తయారు చేశారని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా నుండి గోదావరి నది ప్రవాహిస్తున్నా గత పాలకులు జిల్లాకు సాగునీరు అందించేందుకు ఏనాడూ ప్రయత్నం చేయలేదని, కమిమీషన్ల కోసమే కక్కుర్తి పడ్డారు తప్ప అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. గాంధీ భవన్‌లో కూర్చుని 100 సీట్లు వస్తాయని కలలుకంటున్నారని, వారి కలలు కలలుగా మిగిలిపోతాయన్నారు. జాతీయ పార్టీలను నమ్ముకుంటే బాత్‌రూం కట్టుకోవాలన్నా ఢిల్లీకి పోవాల్సి వస్తుందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టుతో లకారాన్ని నింపుతామన్నారు. మిషన్ కాకతీయ పథకంలో చెరువు అభివృద్ధి చేయడానికి అవకాశం లేకపోయినా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంఎల్‌ఎ అజయ్ కృషితో ప్రత్యేకంగా రాష్ట్రంలో ఎక్కడ లేనివిధంగా రూ.17.5 కోట్లు మంజూరు చేసి లకారాన్ని అభివృద్ధి చేశామని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌కు దీటుగా లకారంను సుందరీకరణ చేశారన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రతి నియోజక వర్గానికి ఒక మినీ ట్యాంక్‌బండ్‌ను నిర్మించాలని తలచారన్నారు. లకారంకు అనుబంధంగా ఐదెకరాల్లో అడ్వయించర్ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి తరువాయి 6లో

కుంచెపోటు



నిత్యావసర ధరలు పైకిపోతే మనకెంతో, షేర్ల ధరలు కిందికొస్తే వాళ్లకంతే..!

మార్చి 11 నుంచి 'ధరణి' వెబ్‌సైట్

- ప్రారంభించనున్న కెసిఆర్?
- ఐఎల్‌ఎఫ్ఎస్‌కు బాధ్యతలు
- నిర్వహణకు రూ.116 కోట్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : భూ రికార్డుల సమగ్ర నిర్వహణ, నిరంతర లావాదేవీల నమోదుకోసం ప్రభుత్వం వినియోగించనున్న 'ధరణి' వెబ్‌సైట్ రూపకల్పనకు రాష్ట్ర మంత్రివర్గం 'షార్ట్ సర్క్యులేషన్' పద్ధతిలో ఆమోదం తెలిపింది. ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థకు ఈ వెబ్‌సైట్ తయారీ, నిర్వహణ బాధ్యతలను అప్పజెప్పడానికి నిర్ణయం జరిగింది. పలు ప్రైవేటు సంస్థల నుంచి టెండర్లను కోరగా అన్నింటికంటే తక్కువ ధరకు ఈ సంస్థ ముందుకు తరువాయి 6లో

హైకోర్టుల్లో 400 జడ్జి పోస్టులు ఖాళీ 10

ఐదేళ్లు శిక్ష పడితే అనర్హత : ఇసి 10

బక్కచిక్కిన భద్రాచల గోదావరి



7లో

అవినీతిలో బిజెపి ప్రపంచ రికార్డు

- ఉత్తర కర్ణాటక ప్రచార సభలో రాహుల్



కొప్పాల్: కర్ణాటక రాష్ట్రంలో సిద్ధ రామయ్య ప్రభుత్వం అవినీతిరహిత పాలన అందిస్తుండగా, ఈ రాష్ట్రంలో బిజెపి ఇప్పటికే ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. ఉత్తర కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో భాగంగా 'జనాశీర్వాద్ యాత్ర' కొనసాగిస్తున్న రాహుల్ రెండవ రోజైన ఆదివారం కొప్పాల్ జిల్లాలో రోడ్‌షోలు నిర్వహించారు. రాష్ట్ర నాయకులతో కలిసి ఓ ప్రత్యేక బస్సులో సాగిన ఈ యాత్రలో బస్సుపై నుంచి, బహిరంగ సభల్లోనూ ఆయన ప్రసంగించారు. ఈ రాష్ట్రంలో బిజెపి అధికారంలో తరువాయి 6లో

రైలు ఢీకొని నాలుగు ఏనుగులు మృతి

గౌహతి: అసోంలోని హబైపుర్ రైల్వే స్టేషన్ సమీపంలో విషాద ఘటన చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో నాలుగు ఏనుగులు అక్కడికక్కడే మృతిచెందాయి. మరో ఏనుగు తీవ్రంగా గాయపడింది. శనివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో గువాహటి సిల్చార్ ప్యాసింజర్ రైలు ఐదు ఏనుగులను వేగంగా ఢీకొట్టింది. ఇదే తరహాలో గత డిసెంబర్‌లో గుహవాటి నాహర్‌లాగున్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంలో అసోంలోని సోనిట్‌పూర్ జిల్లాలో ఐదు ఏనుగులు మృత్యువాతపడిన సంగతి మరువకముందే ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

జగన్‌కు జన నీరాజనం



నెల్లూరు: వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జననేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 84వ రోజు పాదయాత్రను అనంతాపురం శివారులో ముగించారు. ఆదివారం ఉదయం నెల్లూరులోని బోడగుడిపాడు శివారు నుంచి వైఎస్ జగన్ పాదయాత్రను ప్రారంభించారు. జలదంకి మండలం కొత్తపాలెం దగ్గర పాదయాత్ర ఉదయగిరి నియోజకవర్గంలో ప్రవేశించింది. స్థానిక ప్రజలు వైఎస్ జగన్‌కు హారతి పట్టి నియోజక వర్గంలోకి స్వాగతం పలికారు. ఈ రోజు పాదయాత్ర జక్కేపల్లి గుడూరు క్రాస్, కొత్తపాలెం, తుర్పుగుడ్ల దొన క్రాస్, పడమట గుడ్లదొన మీదుగా అనంతాపురంకు చేరుకుంది. ఇవాళ వైఎస్ జగన్ 15.7 కిలోమీటర్లు నడిచారు. దారిపొడవునా ప్రజలు రాజన్న బిడ్డకు పెద్ద ఎత్తునా నీరాజనాలు పలుకుతున్నారు.

ప్రధానితో కెటిఆర్ కుమ్మక్కు



మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ లోఫర్ పార్టీయా లేక తెలంగాణ రాష్ట్రాన్ని నిలువుదోపిడి చేస్తున్న టిఆర్‌ఎస్ నాయకులు లోఫర్లా తేల్చుకునేందుకు గన్ పార్క్ వద్ద బహిరంగ చర్చకు సిద్ధమా అని టిపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి శ్రవణ్ దాసోజు సవాల్ చేశారు. మంత్రి కెటిఆర్ మాట్లాడిన మాటలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని లేదంటే టిఆర్‌ఎస్ పార్టీ వెంట ఉన్న సీనియర్ నేతలు డాక్టర్ కేశవరావు, డి.శ్రీనివాస్ లాంటి నేతలను తీసుకుని గన్ పార్క్‌తో సహా ఏ వేదిక వద్దకైనా బహిరంగ చర్చకు రావాలన్నారు. గాంధీ భవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఇవ్వడమే తప్పంటూ తల్లి నుంచి పిల్లను వేరు చేసినట్లు తలుపులు పెట్టి దేశాన్ని ముక్కలు చేసినట్లు కాంగ్రెస్ పార్టీపై మోడీ దుమ్మెత్తి పోస్తుంటే సందట్లో సడేమియా మాదిరిగా కాంగ్రెస్ పార్టీపై మంత్రి కెటిఆర్ అదే విధమైన విమర్శలు చేయడం వెనుక టిఆర్‌ఎస్‌కు మోడీకి మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందమేంటో బహిర్గతం చేయాలన్నారు. తెలంగాణను సాకారం చేసిన సోనియాపై, కాంగ్రెస్ పార్టీపై మోడీ అర్ధరహితమైన వ్యాఖ్యలతో తన దిగజారుడు రాజకీయాలను ప్రదర్శిస్తూ యావత్ తెలంగాణ సమాజాన్ని అవమానించిన మోడీని ఎందుకు నిలువరించలేదని ఆయన ప్రశ్నించారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణాకు రావాల్సిన ఎయిమ్స్, హైకోర్టు విభజన, ఐటిఐఆర్, ఐఐఎం, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్శిటీ లాంటి వాటిని చివరి బడ్జెట్ వరకు సాధించలేకపోయిందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఏళ్ల తరబడి జైల్లో మగ్గిన దేశభక్తుల కుటుంబం రాహుల్‌ది కాగా, వందలాది మంది ఆత్మత్యాగాలు చేసుకుంటే గౌతికాడి నక్కల్లాగా అధికారం కోసం తాపత్రయ పడి హస్తగతం చేసుకున్న కుటుంబం కెటిఆర్‌దని దాసోజు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని తిడుతూ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పత్రికల క్లిప్పింగ్‌లను కెటిఆర్ ట్విట్ చేస్తూ మోడీ మెప్పు పొందాలనే ప్రయత్నించినట్లుందని శ్రవణ్ ఆరోపించారు. రాజకీయ కుట్రల్లో కెటిఆర్ వయస్సుకు మించిన వ్యవహారం కనబరుస్తున్నారని శ్రవణ్ దాసోజు ఎద్దేవా చేశారు.

పకడ్బందీగా ‘అక్రమ కట్టడాల జరిమానా’

- **అమలు తీరుపై నివేదిక కోరిన మున్సిపల్ శాఖ**

మన తెలంగాణ/హైదరాబాద్: అక్రమ కట్టడాలపై విధిస్తున్న జరిమాన అమలు తీరుపై మున్సిపల్ శాఖ ఆరా తీస్తోంది. ‘జరిమానా’లను పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటోంది. నిర్ణీత కాలపరిమితిలోపు అనుమతులు ఇవ్వడంతో పాటు అక్రమ నిర్మాణాలపై కొరడ ఝుళిపించే చర్యలను మరింత ముమ్మరం చేస్తోంది. ఇప్పటి వరకు స్థానిక పురపాలికలు అక్రమ నిర్మాణాలపై వసూలు చేసిన ‘జరిమానా’ల వివరాలను సేకరిస్తోంది. డిసెంబర్‌లో విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు క్షేత్రస్థాయి పరిస్థితులపై మున్సిపల్ శాఖ ప్రత్యేక నివేదికను తెప్పించు కుంటున్నట్లు తెలిసింది. ఒక వైపు కొత్తగా అక్రమ కట్టడాలను నిర్మించకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు మరో వైపు ఇది వరకే నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన భవన నిర్మాణాలపై చర్యలు తీసుకునే చర్యలను వేగం చేసింది. జరిమానాలతో కూడిన ఆస్తిపన్నుల వసూలు పెరుగుతుందని, తద్వారా పురపాలికలకు ఆదాయం పెరుగుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. అక్రమ కట్టడాలను నాలుగు విభాగాలుగా విభజించి జరిమానాగా ఆస్తిపన్నులో 25 శాతం నుంచి వంద శాతం జరిమానా విధించేలా మార్గదర్శకాలు రూపొందించిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించగా, కొన్ని పురపాలికలలో ‘జరిమానా’ విధానాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని తేలింది.

మున్సిపాల్టీలు తేలితేనే పంచాయతీల లెక్క

- **మరింత జాప్యం అనివార్యం?**

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే మున్సిపాలిటీల వ్యవహారం తేలితేనే కొత్త పంచాయతీల లెక్క కొలిక్కిరానుంది. అప్పటి దాకా కొత్త పంచాయతీలకు తుదిరూపు ఇవ్వలేమని అధికారులు అభిప్రాయపడుతున్నారు. మున్సిపాలిటీల్లో విలీనం చేసే గ్రామాల ఎంపిక అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికారులు ప్రాథమికంగా వాటి జాబితా, కొత్త మున్సిపాల్టీలను ఎంపిక చేశారు. కొత్త మున్సిపాల్టీల ఎంపిక, విలీనంకానున్న గ్రామాల విషయంలో స్థానికులతో పాటు ఆయా ప్రాంతాల, గ్రామాల రాజకీయ నాయకుల నుంచి అభ్యంతరాలు కూడా మొదలయ్యాయి. దీంతో ఇది ఒక కొలిక్కిరాలేకపోతోందని పంచాయతిరాజ్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. మున్సిపాలిటీల్లో విలీనమయ్యే గ్రామాల సమస్య కారణంగానే కొత్త పంచాయతీల కూర్పు, సంఖ్య తేలడంలేదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పంచాయతిరాజ్ అధికారులు ఇప్పటి వరకు సిద్ధం చేసిన జాబితాను పరిశీలిస్తే రాష్ట్రంలో 47 మేజర్ గ్రామ పంచాయతీలు కొత్తగా మున్సిపాల్టీలుగా మారనున్నాయి. నగర పంచాయతీలో చేరడానికి కొన్ని చోట్ల ఆయా గ్రామ పంచాయతీల నుంచి విముఖత ఎదురవుతోంది. కొన్ని మేజర్ గ్రామ పంచాయతీలను విలీనంతో కార్పొరేషన్లను ఏర్పాటు చేసే జాబితాను కూడా మున్సిపల్ శాఖ సిద్ధం చేస్తోంది. మేజర్ గ్రామ పంచాయతీల జనాభా 15000 మించి ఉండడంతో కార్పొరేషన్‌లలో విలీనానికి అక్కడి స్థానిక నేతలు మొగ్గు చూపడం లేదు. కొత్తగా మున్సిపాల్టీలుగా ఏర్పాటుచేయాలన్న డిమాండ్‌ను ముందుకు తెస్తున్నారు. ఆదిలాబాద్‌లో మావాల గ్రామ పంచాయతీ ఇందుకు ఉదాహరణ. నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ ప్రస్తుతం మేజర్‌గ్రామపంచాయతీగా ఉన్నా 2011 జనాభా ప్రకారం నగర పంచాయతీగా మార్చవచ్చు. సమీపంలోని నాలుగైదు గ్రామాలను కలిపి మున్సిపాల్టీగా మార్చవచ్చు. అధికారులు ప్రతిపాదన సిద్ధం చేసినా గ్రామాల నుంచి విముఖత ఎదురైంది. రాజధాని హైదరాబాద్ ఔటర్‌రింగ్ రోడ్ పరిధిలో 167 గ్రామాలు సమీప మేజర్ పంచాయతీల్లో విలీనమవుతాయని నేతలు ప్రకటించారు. ఆ ప్రకారం దాదాపు 80 నుంచి 85గ్రామాలు వాటి సమీప మేజర్ పంచాయతీల్లో విలీనమై 24 కొత్త మున్సిపాల్టీలు ఏర్పడే అవకాశం ఉంది. వీటి విషయంలోనూ స్థానిక నేతల అభ్యంతరాల కారణంగా పంచాయతీ అధికారులు తుది నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. కొత్త మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు వాటిలో విలీనమయ్యే గ్రామాల వ్యవహారం తేలేంతవరకు కొత్త పంచాయతీల వ్యవహారానికి తుది రూపు వచ్చేలా లేదు.

కొనాయపల్లిలో భారీ చోరీ

మేడ్చల్: మేడ్చల్ మండల పరిధిలోని కొనాయపల్లిలో శనివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. ఓ ఇంట్లోకి చొరబడిన దుండగులు రూ.1.30 లక్షల నగదు, 13 తులాల బంగారు నగలు, కిలో వెండిని చోరీ చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలిని పోలీసులు సందర్శించి పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం

తిరుమల: తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శ్రీవారి దర్శనం కోసం తొమ్మిది కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. శ్రీవారి సర్వదర్శనానికి ఐదు గంటలు, కాలినడక భక్తులకు రెండు గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి రెండు గంటల సమయం పడుతోంది. శనివారం శ్రీవారిని 75,925 మంది దర్శించుకున్నారు. 34,869 మంది తలనీలాలు సమర్పించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

యాదాద్రిలో భక్తుల కోలాహలం



మన తెలంగాణ/యాదాద్రి: శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి యాదాద్రి క్షేత్రం కొండపైన గల శ్రీ పర్వత వర్ధిణీ రామలింగేశ్వర స్వామి శివాలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆరు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం బాలాలయంలోని శివాలయంలో ఉత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ, భేరి పూజ మహోత్సవాన్ని వైభవంగా కొనసాగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివాలయంలో ఉదయం నిత్య పారాయణములు, వేద పఠనములు, శాస్త్రోక్త పూజ, శివ పంచాక్షరి జపం నిర్వహించి ధ్వజారోహణ, భేరి పూజ మహోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్థాన సిద్ధాంతి ప్రధాన అర్చకులు, పారాయణికులు, ఆలయ ఇఒ గీత, చైర్మన్ నర్సింహమూర్తి, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దర్శనానికి 3గంటలు..

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనార్థం తరలి వస్తున్న భక్తులతో యాదాద్రి క్షేత్రం కోలహలంగా కనబడింది. స్వామి వారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వస్తున్న భక్తులతో రెండు రోజులుగా రద్దీ పెరిగింది. ఆదివారం సెలవు దినం కావడంతో స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు ఉదయం నుండే తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. యాదాద్రి కొండపై, పట్టణంలో భక్తులు సందడి నెలకొనగా స్వామి దర్శనానికి సుమారు 3 గంటల పైన భక్తులు క్యూలైన్లో వేచి ఉన్నారు.

భారీగా సమకూరిన ఆదాయం..

శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానం స్వామి వారి నిత్యరాబడిలో భాగంగా ఆదివారం రోజున 22 లక్షల 01వేల 072 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి తెలిపారు. ప్రధాన బుకింగ్, శ్రీఘ్రదర్శనం, వ్రతాలు, కల్యాణ కట్ట, ఎంక్వైరీ, ప్రసాదాలు, వాహన పూజల ద్వారా శాఖల వారీగా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు చినజీయర్..

ఈ నెల 17 నుంచి 27 వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీ త్రిదండి చినజీయర్ స్వామిని ఆహ్వానిస్తూ ఆలయ ఇఒ గీత కలిసారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు తీసుకుంటున్న చర్యలు అభివృద్ధి పనులను జీయర్ స్వామికి ఇఒ వివరించారు.




ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కుమార్తె డా. మంద కృష్ణవేణి వివాహం డా. ఇంద్రకంటి పృథ్వీరాజ్‌తో హైదరాబాద్, బండ్లగూడలోని అనంతుల రామిరెడ్డి గార్డెన్స్‌లో ఆదివారం జరిగింది. ఈ వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, ఉప ముఖ్యమంత్రులు మహమూద్ అలీ, కడియం శ్రీహరి, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, పిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, బిజెఎల్‌పి నేత జి.కిషన్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి, ఎపి నాయకులు తదితరులు హాజరయ్యారు.
– మన తెలంగాణ/హైదరాబాద్

ధార్మిక పరిషత్ కార్యారూపం దాల్చేదెన్నడు?

- **చైర్మన్, సభ్యులను నియమించేందుకు ఇంత ఆలస్యమా ?**

మన తెలంగాణ/హైదరాబాద్: దేవాలయాల నిర్వహణకు సంబంధించిన అంశాలను పర్యవేక్షించేందుకు ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి ఐదు నెలలు కావొస్తున్నా ఇంతవరకు అది కార్యారూపం దాల్చలేదు. దీనికి సంబంధించి శాఖపరంగా ప్రక్రియ పూర్తయినప్పటికీ, సిఎం కెసిఆర్ విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ధార్మిక పరిషత్ ఏర్పాటుపై సంబంధిత మంత్రి నుంచే అడ్డంకులు వస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్చకులకు, ఆలయ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి ప్రతి నెలా పే స్కేల్ అమలు చేస్తామని గత ఏడాది సెప్టెంబర్‌లో అర్చకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సిఎం వ్యాఖ్యానించారు. ఆ సందర్భంగానే ధార్మిక పరిషత్ ఏర్పాటుకు సంబంధించి ప్రకటన కూడా చేశారు. శృంగేరి పీఠాధిపతులు, చినజీయర్ స్వామి, కంచి పీఠాధిపతుల సలహాలు, సూచనలు పాటించి ధార్మిక పరిషత్ కార్యక్రమాలను రూపొందిస్తామన్నారు. దేవాలయ ఉద్యోగులు, అర్చకులకు వేతనాలు కూడా ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో ‘ప్రత్యేక వేతన నిధి’ నుంచి చెల్లించాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్పొరేషన్లను, అకాడమీలను ఏర్పాటు చేస్తుండడం, పాలక మండళ్లు లేని వాటికి పాలక మండళ్లను ఏర్పాటు చేస్తూ వస్తున్నప్పటికీ, ధార్మిక పరిషత్ ఏర్పాటు విషయంలో మాత్రం ఆలస్యం చేస్తోంది. వాస్తవానికి ఎండోమెంట్స్ చట్టం ప్రకారం ధార్మిక పరిషత్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. చైర్మన్‌తో పాటు 20 మందిని సభ్యులుగా, మరో ఏడుగురిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించే అధికారం ప్రభుత్వానికి ఉంది. ధార్మిక పరిషత్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వ ఖజానాపైగానీ, దేవాదాయ శాఖపైగానీ ఆర్థికంగా ఎలాంటి భారం ఉండదు. వివిధ రంగాల ప్రముఖులు సభ్యులుగా ఉండడంతో దేవాదాయ శాఖను భక్తులకు ఉపయోగపడేవిధంగా నడిపే అవకాశాలున్నాయి. ఆలయాల నిర్వహణ, వాటి ఆదాయం, అభివృద్ధి తదితర అంశాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు ధార్మిక పరిషత్ ఉపకరిస్తుంది. ఒకసారి ధార్మిక పరిషత్ ఏర్పాటైతే మూడేళ్ల వరకు దాని కాలపరిమితి ఉంటుంది. రోశయ్య ముఖ్యమంత్రిగా ఉండగా 2009 డిసెంబర్‌లో మొదటిసారి ధార్మిక పరిషత్ ఏర్పాటైంది. ఆ తరువాత కిరణ్‌కుమార్‌రెడ్డి సిఎంగా ఉండగా 2014 ఫిబ్రవరిలో రెండో పర్యాయం ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేశారు.

సంక్షోభం నుంచి గట్టెక్కని నిజాం షుగర్స్



మన తెలంగాణ/హైదరాబాద్: నిజామాబాద్ జిల్లాలో చెరకును పండించే రైతుల జీవితాలు ఇప్పటికీ చేదుగానే మిగిలిపోయాయి. అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే కర్మాగారాన్ని తెరిపించి చెరుకు రైతులకు, చక్కెర కర్మాగార కార్మికులకు అండగా నిలుస్తామని టిఆర్‌ఎస్ హామీ ఇచ్చింది. 2015 ఏప్రిల్‌లో ఈ కంపెనీని టేకోవర్ చేసుకునేందుకు ఉత్తర్వులు కూడా జారీ చేసి చెరుకు రైతులకు కంపెనీ పాత బకాయిలు కింద తొలి విడతగా రూ. 7 కోట్లు విడుదల చేసింది. పాత అప్పుల్ని తీర్చుకున్న రైతులు తిరిగి చెరుకు పంటపై దృష్టి పెట్టారు. ఫ్యాక్టరీ తెరుచుకుందని రైతులు భావించారు. కానీ అది అడియాశే అయింది. ఇప్పటివరకూ తెర్చుకోలేదు. ఇంతలోనే రైతులకు ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. బోధన్‌లోని నిజాం కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీని కూడా మూసేస్తున్నట్లు ప్రకటించింది. రైతులు అనివార్యంగా ప్రైవేటు రంగంలోని కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో ఉన్న గాయిత్రీ షుగర్స్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇది ప్రైవేటు ఫ్యాక్టరీ కావడంతో రైతుల నుండి కొనుగోళ్ళు చేయకపోవడం, చేసినా సమయానికి చెల్లింపులు చేయకపోవడం సాధారణమైపోయింది. లే ఆఫ్‌కు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు, అఖిలపక్ష పార్టీల నేతలు, చెరుకు రైతులు, తెలంగాణ జెఎసి చైర్మన్ కోదండరామ్ ఏడాది కిందట పోరుబాట ఉద్యమం సాగించారు. అధికార టిఆర్‌ఎస్ మినహా ఇతర ప్రతిపక్ష పార్టీలు , కార్మిక సంఘాలు ఈ ఆందోళనకు మద్దతుగా నిలిచాయి. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేదు. రాష్ట్రంలో చెరుకు దిగుబడి అత్యధికంగా ఉండే జిల్లాల్లో నిజామాబాద్ ప్రముఖమైనది. 2014లో చెరుకు పంట ఈ జిల్లాలో సుమారు 3.5 లక్షల ఎకరాల్లో సాగయింది. దిగుబడి సుమారు పది లక్షల టన్నులు. రెండేళ్ల క్రితం ఈ ఫ్యాక్టరీ లేఆఫ్ కావడంతో చెరుకు సాగు 10వేల ఎకరాలకే పరిమిత మైంది. దిగుబడి సైతం 30 వేల టన్నులకు పడిపోయింది.

లే ఆఫ్ నిబంధనలు బేఖాతర్..

ఆసియాలోనే అతిపెద్ద చక్కెర కర్మాగారమైన బోధన్ నిజాం దక్కన్ షుగర్స్ కర్మాగారం మూత పడి రెండేళ్లు దాటినా ఇంత వరకు దానిని తెరిపించేందుకు ప్రభుత్వపరంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. 2015 డిసెంబర్ 23న ఈ కర్మాగాన్ని మూసి వేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించిందని, సాధారణంగా ఏదైనా కంపెనీ లే ఆఫ్ ప్రకటిస్తే దానిని తిరిగి ఆరు మాసాల్లోనే తెరవాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదని కార్మికులు గుర్తు చేస్తున్నారు.

వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. లే ఆఫ్ తర్వాత ఈ రెండేళ్లలో నలుగురు కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారని, లే ఆఫ్ కాలానికి కార్మికులకు కనీసం నష్టపరిహారం ఇచ్చినా ఈ ఆత్మహత్యలను నివారించి ఉండవచ్చునని నిజాం షుగర్స్ యూనిట్ మెయింటెనెన్స్ సూపర్‌వైజర్ ఎస్. కుమార స్వామి వ్యాఖ్యానించారు.



ఢిల్లీలో ప్రశంసలు.. హైదరాబాద్‌లో ఆరోపణలు : దత్తాత్రేయ

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం చేస్తున్న సహాయం, బడ్జెట్ కేటాయింపుల అంశంలో టిఆర్ఎస్ ఎంపిలు కవిత, జితేందర్‌రెడ్డి ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని, ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి ప్రశంసిస్తూ, హైదరాబాద్‌లో మాత్రం ఆరోపణలు చేస్తున్నారని ఎంపి బండారు దత్తాత్రేయ వ్యాఖ్యానించారు. కేంద్రం మంజూరు చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంలో వెనుకబడిందని, ఇప్పటి వరకు కేంద్ర ప్రయోజిత కార్యక్రమాల నిమిత్తం మంజూరు చేసిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం బిజెపి నేతలు చింతసాంబమూర్తి, ప్రకాశ్‌రెడ్డి, సుధాకర్‌శర్మతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయని, సాగునీటి పనులపై ప్రభుత్వం చేపడుతున్న ప్రచారానికి, క్షేత్రస్థాయిలోని పనులకు మధ్య వ్యత్యాసం కనిపిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.40వేల కోట్లతో చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వ హించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ రహదారుల్లో భాగంగా ఎకనామిక్ కారిడార్ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ. 3వేల కోట్లను మంజూరు చేసిందన్నారు. రైల్వేలోని డి కేటగిరిలో పెండింగ్ పోస్టులను మార్చిలో భర్తీ చేయనున్నారన్నారు.

ఎంఐఎం ఎంఎల్‌ఎ సోదరుడు అరెస్టు

మన తెలంగాణ/హైదరాబాద్: ఫోర్జరీ పత్రాలతో భూమిని విక్రయించి మోసానికి పాల్పడిన నాంపల్లి ఎంఐఎం ఎంఎల్‌ఎ జాఫర్ హుస్సేన్ సోద రుడు అజ్గర్‌హుస్సేన్‌తో పాటు అతని ముగ్గురు అనుచరులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. బండ్లగూడ హషామాబాద్‌కు చెందిన అజ్గర్ హుస్సేన్ (49), తీగెల కుంటకు చెందిన సయ్యద్ మేరాజ్ (33), వీరితో పాటు డాక్యుమెంట్ రైటర్, మలక్‌పేటకు చెందిన నయీముద్దీన్, ఇర్ఫాన్‌లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరు మైలార్ దేవర్‌పల్లి లోని సర్వేనెంబర్ 94, 95/2లో ఉన్న 1592గజాల స్థలాన్ని వివిధ పేర్లపై ఆరు నకిలీ పత్రాలు సృష్టించారు. ఈ పత్రాలతో మెహదీపట్నంకు చెందిన అస్లం ఇబ్రహీంను నమ్మించి రూ.కోటి తీసుకుని భూమిని విక్రయించారు. తీరా అస్లం ఆరా తీయగా ఆ భూమి మరోకరిదని తేలింది. తనకు ఇచ్చిన పత్రాలు సదరు భూమికి చెందిన ఫోర్జరీ డాక్యుమెంట్లని గుర్తించారు. దీంతో సైబరాబాద్ పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్యాకు ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు మైలార్‌దేవుపల్లి పోలీసులు దర్యాప్తు చేయగా అజ్గర్‌హుస్సేన్ డాక్యుమెంట్లు ఫోర్జరీవని తేల్చారు. దీంతో అజ్గర్‌తో పాటు అతడి ముగ్గురు అనుచరులను పోలీసులు అరెస్టు చేశారు.

ఆర్థిక సంఘానికి 'డబుల్' నిర్మాణాలు చూపించాల్సింది : మల్లు



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణలో మిషన్ భగీరథ కాళేశ్వరం ప్రాజెక్టులు బాగున్నాయని ఆర్థిక సంఘం అధికా రులు చెప్పడం వింతగా ఉందని, రాష్ట్ర సి ఎస్ వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం, దళితులకు భూమి పథకాలను కూడా చూపించి ఉంటే తెలంగాణ పనితీరు బయట పడేదని పిసిసి ఉపాధ్యక్షుడు మ ల్లు రవి అన్నారు. డబుల్ బెడ్ రూమ్‌లు, దళితులకు భూములు ఏమయ్యాయో ఆర్థిక సంఘం అధికారులకు సిఎస్ చెప్పాలని ఆయన అన్నారు. ప్రభుత్వ అధికారులు ఆర్థిక సంఘానికి రాష్ట్రంలో హామీల అమలు తీరును చూపిస్తే వాస్తవాలు బయట పడేవని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమీషన్లు వచ్చే మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులు చూపించి వారిని తప్పుదోవ పట్టించారని, అదే ప్రజల పరిస్థితి చూపిస్తే బాగుండేదని అన్నారు. దళిత, గిరిజన, బిసి, మైనార్టీ నాలుగేళ్లుగా కనీసం ఫీజ్ రీయింబర్స్‌మెంట్ డబ్బులు ఇవ్వకుండా విద్యార్థులను విద్యకు దూరం చేసిన టిఆర్ఎస్ ప్రభుత్వ తీరు వాళ్లకు చూపాల్సిందని ఆయన సిఎస్‌కు సూచించారు. రైతులు మద్దతు ధరలు అడిగితే కేసులు పెట్టి జైలుకు పంపిన టిఆర్ఎస్ పాలకుల తీరు చూపిస్తే ఇంకా బాగుండేదని ఆయన అన్నారు.

నిమ్స్‌లో ఐసియు కేంద్రం ప్రారంభం

మన తెలంగాణ/హైదరాబాద్: నిమ్స్ ఆసుపత్రిలో అగర్వాల్ సమాజ్ సహాయత ట్రస్ట్ నెలకొల్పిన ఐసియు కేంద్రాన్ని రాష్ట్ర మంత్రులు సి. లక్ష్మారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఐసియును ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన సంస్థ నిర్వాహకులను మంత్రులు అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆగర్వాల్ సమాజ్ సహాయత ట్రస్ట్ ఆధ్వర్యంలో నిమ్స్‌లో ఐసియు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం స్వాగతించదగిన విషయమన్నారు. రూ.60 లక్షలకు పైగా వ్యయం చేసి ఈ కేంద్రాన్ని సంస్థ నిర్వాహకులు నిమ్స్‌కు అందజేశారన్నారు. గతంలోనూ రూ.70 లక్షల వ్యయంతో కూడిన డయాలసిస్ కేంద్రాన్ని ఉచితంగా అందించిందన్నారు. ఈ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 8,267 మందికి డయాలసిస్ చేసినట్లు చెప్పారు. ఈ సంస్థ వల్ల నిరుపేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని మరింత సులభంగా అందిస్తున్నామన్నారు. సేవలో ఉన్న తృప్తి మరెక్కడ ఉండదనే అభిప్రాయాన్ని మంత్రి వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పాటు నాటి నుంచి ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చామని, సర్కార్ దవాఖానల రూపురేఖలనే మార్చేశామన్నారు. కార్పొరేట్ కంటే ఎక్కువ సేవలు నిమ్స్‌లో అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ కరోడీమాల్, ప్రోగ్రామ్ కన్వీనర్ గోపాల్‌దాస్, కోశాధికారి కపూర్‌చంద్‌తో పాటు నిమ్స్ డైరెక్టర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అధికార, ప్రతిపక్షాలు ప్రచారానికే పరిమితం: లక్ష్మణ్

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో అధికార (టిఆర్ఎస్), ప్రతిపక్ష (కాంగ్రెస్) పార్టీలు పరస్పరంగా వ్యక్తిగత దూషణలకు, ప్రచార ఆర్భాటాలకు మాత్రమే పరిమితమయ్యాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. ప్రస్తుత రాజకీయాల్లో నైతిక విలువలు పడిపోతున్నాయని, పదవుల కోసం పార్టీలు మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని 'బలిదాన్ దివస్'గా జరుపుకుంటున్న బిజెపి నేతలు ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. కొన్ని రాజకీయ పార్టీలు కేవలం ముస్లింలు, మైనార్టీలకే స్వాతంత్ర్య ఫలాలు అందేలా ప్రయత్నిస్తున్నారని, తమ పార్టీ మాత్రం చిట్టచివర ఉన్న నిరుపేదలకూ ఫలాలు అందేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు. మోడి ప్రభుత్వం పేదలకు అన్ని వసతులను కల్పిస్తున్నదని, దేశాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. ఎంపి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ అవకాశ, అవినీతి, బంధుప్రీతి రాజకీయాలకు కాంగ్రెస్ వేదికగా మారిందని విమర్శించారు. మోడీ నాలుగేళ్ల పాలనలో అవినీతి ఆరోపణలు వచ్చిన దాఖాలాలు లేవన్నారు. టిఆర్ఎస్, టిడిపి, ఎస్‌పి, ఆర్‌జెడి కుటుంబ పార్టీలన్నారు. బిజెఎల్‌పి నేత జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ విదేశీ భావజాలం ఉన్న పార్టీలు బిజెపి పరిపాలనను జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. ప్రస్తుత రాజకీయాలు కులాలు, ప్రాంతాలు, కుటుంబాల చుట్టూ తిరుగుతున్నాయని విమర్శించారు. ధన, కుల బలంతో రాజకీయాలు కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సాంబమూర్తి అధ్యక్షత వహించగా ఎంఎల్‌సి ఎన్.రాంచంద్ర రావు, మాజీ ఎంఎల్‌ఎ బద్దంబాల్‌రెడ్డి, నాయకులు డాక్టర్ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



• మాకేం మిగుల్తది?



విత్తనాలిచ్చిన సీడ్స్ కంపెనీ యాజమానులు సిండికేట్‌గా మారారని నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలానికి చెందిన దాదాపు 3వేల మంది ఎర్రజొన్న, పసుపు రైతులు ఆదివారం జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. 'వ్యాపారులు క్వింటాల్ ఎర్రజొన్నను రూ.1500కే కొంటా మంటున్నారని పేర్కొన్నారు. క్వింటాల్ రూ.1500 ధాన్యాన్ని అమ్మితే పెట్టుబడి కూడా రాదని, మాకేం మిగుల్తదని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లో ఎర్రజొన్న పంట చేతికివస్తుందని, ఈ విషయమై సిఎం కెసిఆర్ స్పందించి ఎర్నజొన్నకు కనీస మద్దతు ధర రూ.4500, పసుపుకు రూ. 10వేలు ప్రకటించి ప్రభుత్వమే కోనుగోలు చేసేలా చూడాలని కోరుతున్నారు. వీరి రాస్తారోకోతో ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ఆర్మూర్ ఎసిపి సుదర్శన్ , తహసీల్దార్ సతీశ్‌రెడ్డి రైతుల డిమాండ్లను ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు.

- మన తెలంగాణ/జక్రాన్‌పల్లి

షరియాను పరిరక్షించుకుంటాం

- ముస్లిం పర్సనల్ లా బోర్డు



మన తెలంగాణ/హైదరాబాద్: ఇస్లామిక్ షరియాను పరిరక్షించుకోవాలని ముస్లిం పర్సనల్ లా బోర్డు నిర్ణయించింది. మూడు రోజుల పాటు జరిగిన అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు 26వ సదస్సు ఆదివారం హైదరాబాద్‌లో ముగిసింది. బోర్డు అధ్యక్షుడు మౌలానా రబ్బే హసని నద్వీ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉలేమాలు, మేధావులు, సామాజిక, రాజకీయ పార్టీలకు చెందిన 400 మంది ప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు. బోర్డు తీర్మానాలను ప్రధాన కార్యదర్శి మౌలనా ఖాలెద్ సైఫుల్లా రహమాని, ఎంపి అసుద్దీన్ ఓవైసీలు మీడియాకు వెల్లడించారు. ఇస్లామిక్ షరియాను కాపాడుకోవాలని, ముస్లిం ప్రజల ప్రగాఢ మత విశ్వాసాల్లో బాబ్రీ మసీదు ఒకటని, దీనిని ధ్వంసం చేసినంత మాత్రాన గుర్తింపును కోల్పోదని, అది ఎప్పుడు మసీదుగానే ఉంటుందని, దాని పునర్నిర్మాణం కోసం పోరాటం కొనసాగుతుందని సదస్సు తీర్మానించింది. ముస్లిం పర్సనల్ లా బోర్డు సంస్కరణల ఉద్యమానికి పూర్తి సహకారాన్ని అందించడంతో పాటు వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తీర్మానించింది. కేంద్రం తెచ్చిన ట్రిపుల్ తలాక్ బిల్లు ముస్లిం మహిళలకు, షరియాకు వ్యతిరేకమని, ఇది మరిన్ని సమస్యలను తెచ్చిపెడుతుందని సదస్సు తీర్మానించింది. దీనిని రాజ్యసభలో అడ్డుకునేందుకు మద్దతును కూడగట్టాలని నిర్ణయించారు. గత కలకత్తా ప్లీనరి తర్వాత మృతి చెందిన బోర్డు సభ్యులకు సంతాపం తెలుపుతూ తీర్మానం ఆమోదించింది. ఇస్లామిక్ చట్టాలు పవిత్ర ఖురాన్ గ్రంథం, ప్రవక్త సూత్రాలపై ఆధారపడి ఉన్నాయని, ముస్లిం షరియాలో సవరణలు, ప్రతిపాదనలను ముస్లింలు ఆమోదించరని స్పష్టం చేసింది. సుప్రీం తీర్పు తమకు అనుకూలంగా వస్తుందన్న విశ్వాసాన్ని ఈ సమావేశం వ్యక్తం చేసింది.

జైళ్ల శాఖ మరో 100 బంకులు

- అధికారుల కసరత్తు
- ఇప్పటికే 13 బంకుల ద్వారా గతేడాది రూ.10 కోట్ల ఆదాయం



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం నడుస్తున్న పెట్రోల్ బంకులు లాభాల బాటలో నడవడంతో ఈ ఏడాది కొత్తగా మరో 100 బంకులు ఏర్పాటు చేయాలని ఆ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు జైళ్ల శాఖ డిజి వినయ్‌కుమార్ సింగ్ ఆదేశాల మేరకు ఇందుకు అవసరమైన కసరత్తును అధికారులు ప్రారంభించినట్లు తెలిసింది. బంకుల ఏర్పాటుకు అవసరమైన స్థలాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఈ విషయంపై త్వరలో తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి బంకులను ఏర్పాటు చేయాలనుకుంటున్న ఆయిల్ కంపెనీలు వీటి నిర్వహణ బాధ్యతలను జైళ్ల శాఖకు అప్పగించాలనే ఆలోచనలో ఉంది. ఒకటి రెండు నెలల్లో ఏడు కొత్త బంకులను ప్రారంభించడానికి కసరత్తు పూర్తయింది. ఇందులో ఆల్ ఉమెన్ పెట్రోల్ బంకులు కూడా ఉంటాయి. కొత్తగా ఏర్పాటు చేయబోయే బంకుల్లో 30శాతం మహిళలకు ప్రాధాన్యతనివ్వాలని చమురు కంపెనీలు స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకున్నాయి. ఇప్పటికే రాష్ట్ర జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న 13బంకుల్లో 150మంది విడుదలైన ఖైదీలు మరో 200 మంది శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు పనిచేస్తున్నారు. వీరి ద్వారా 2016–17లో రూ.10 కోట్లు లాభాలను జైళ్ల శాఖ ఆర్జించింది. ఈ ఏడాది ఆదాయాన్ని రూ.15 కోట్లకు పెంచాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐదేళ్ల క్రితం చంచల్‌గూడ వద్ద మొదటి సారిగా జైళ్ళశాఖ ఆధ్వర్యంలో పెంట్రోల్ బంకును ఏర్పాటు చేశారు. ఇక్కడ నాణ్యమైన పెట్రోల్ లభిస్తుండడంతో వాహన దారుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. దీంతో జైళ్ల శాఖ రెట్టింపు ఉత్సాహంతో ఆయిల్ కంపెనీలతో మాట్లాడి 13 బంకులను ఏర్పాటు చేసింది. ఈ బంకులో పనిచేసే విడుదలైన ఖైదీలకు నెలకు రూ.12 వేలు, శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు రూ.3 వేల చొప్పున జీతాలు చెల్లిస్తున్నారు. జైళ్ల శాఖ అనుకున్నట్లు 100 బంకులు ఏర్పాటైతే అందులో సుమారు 3 వేల మందికి ఉపాధి లభిస్తుంది. ఇందులో విడుదలైన ఖైదీలు రెండు వేల మంది వరకు, మరో వెయ్యి మంది శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ఉండే అవకాశం ఉంది. ఈ బంకులలో ఖైదీలు తయారు చేసిన చేతివృత్తుల వస్తువుల విక్రయ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు.

నీటి సంపులో పడి ఇద్దరు బాలురు మృతి



మన తెలంగాణ / సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మండలం చంద్రంపేట గ్రామంలో విశాదం నెలకొంది. ఇటుక బట్టీలలోపనిచేసే రూప్‌ధర్,మీనా సునా దంపతుల కుమారులు రింకుసునా, బిజూ సునాలు నీటి సంపులో పడి మృతి చెందారు.ఆదివారం కావడంతో పిల్లలిద్దరు ఈత కొట్టడానికి సంపులోకి దిగి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మరణించారు. దాంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

పేద రెడ్ల సంక్షేమానికి కృషి

- కాకతీయ రెడ్డి మహాసభలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి





మన తెలంగాణ/ఎన్‌జిఒస్ కాలనీ: రెడ్డి సంక్షేమానికి కృషి చేస్తానని, వారి సమస్యలపై సిఎం కెసిఆర్‌తో చర్చించి పరిష్కరించేలా చూస్తానని హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో జరిగిన కాకతీయ రెడ్డి మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న పేద రెడ్డి కులస్థుల కోసం వారి అభ్యున్నతికి తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. చట్టబద్ధంగా రెడ్డి సంక్షేమ నిధికి, కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలోని రెడ్డి కులస్థుల స్థితిగతులపై ఒక కమిటీ వేసి అధ్యయనం జరిపిస్తామని చెప్పారు. అలాగే పేద, మధ్యతరగతి రైతులకు గిట్టుబాటు లభించేలా ప్రయత్నిస్తామన్నారు. రెడ్డిలకు రిజర్వేషన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి అధికారం ఉండదని, అది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని తెలిపారు.
ఈ కార్య క్ర మంలో ఎంఎల్‌ఎలు చల్లా ధర్మారెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, సివిల్ సప్లై చైర్మన్ పెద్ది సుదర్శన్ రెడ్డి, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, రెడ్డి సం ఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, రెడ్డి కులస్తులు తది తరులు పాల్గొన్నారు.

హోంమంత్రిపైకి వాటర్ బాటిల్

రిజర్వేషన్లను మార్చలేమని మాట్లాడిన హోం మంత్రిపై కొందరు వాటర్ బాటిల్ విసిరి నిరసన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లపై రాజ్యాం గంలో సవరణ చేయాలని, ఇది కేంద్రం చేతుల్లో ఉందనడంతో ఆగ్రహించిన కొందరు నాయిని మాట్లాడుతుండగా నిరసన తెలిపారు. దీంతో కొద్దిసేపు సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది.

విదేశాల్లో వైద్య విద్యకూ నీట్

న్యూఢిల్లీ : విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఎంబిబిఎస్ చదవాలనుకునే వారు సైతం ఇకపై 'నీట్'లో ఉత్తీర్ణులవడం తప్పనిసరి అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అర్హులు మాత్రమే విదేశాల్లో వైద్యవిద్యను అభ్యసించేలా నీట్‌ను తప్పనిసరి చేయడంపై కేంద్రం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఏటా చైనా, రష్యా వంటి దేశాల్లో వైద్య విద్య అభ్యసించేందుకు దాదాపు 7వేల మంది విద్యార్థులు భారత్ నుంచి వెళ్తున్నారు. వీరు ఎంబీబీఎస్ పూర్తి చేసి తిరిగొచ్చాక భారత్‌లో వైద్యునిగా పనిచేయాలంటే విదేశీ వైద్య గ్రాడ్యుయేట్ల పరీక్ష ఎఫ్ఎంజిఇలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. కానీ విదేశాల్లో వైద్య విద్య చదివి వచ్చిన వారిలో 12 నుంచి 15శాతం మంది మాత్రమే ఎఫ్ఎంజీఈలో ఉత్తీర్ణత సాధిస్తున్నారు. మిగిలిన వారు అక్రమంగా వైద్యసేవలు అందించడం రోగుల ప్రాణులకు ముప్పుగా మారింది.

సాంకేతిక విద్యలో విప్లవాత్మక మార్పులు!

- డిప్లొమాలో ఇంటర్న్‌షిప్ తప్పనిసరి?
- ఎఐసిటిఇ వైస్ చైర్మన్ ప్రొ. ఎం.పి.పునియా



మన తెలంగాణ/హైదరాబాద్: సాంకేతిక విద్యలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి విప్లవాత్మక మార్పులు రానున్నాయని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఎఐసిటిఇ) వైస్ చైర్మన్ ప్రొ. ఎం.పి.పునియా వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పాలిటెక్నిక్ విద్య సిలబస్, కరికులమ్‌ను మార్చనున్నట్లు తెలిపారు. వారం, పది రోజుల్లో నూతన సిలబస్, కరికులమ్ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ పాలిటెక్నిక్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఐఎఫ్‌పిటిఒ) ఆధ్వర్యంలో ఆదివారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్‌లో 'సాంకేతిక విద్య అభివృద్ధిలో పాలిటెక్నిక్ టీచర్ల పాత్ర' అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2018–19 విద్యా సంవత్సరం నుంచి దేశవ్యాప్తంగా అన్ని పాలిటెక్నిక్ కోర్సుల్లో ఒకే కరికులమ్ అమలవుతుందన్నారు. అలాగే అన్ని పాలిటెక్నిక్ కళాశాలలు డిప్లొమా కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేస్తున్నామని పేర్కొన్నారు. 6 వారాల నుంచి 2 నెలల వరకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం ఉంటుందని తెలిపారు. సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా విద్యార్థులను ప్రోత్సహించాలని అధ్యాపకులకు సూచించారు. కొత్తగా నియమితులైన పాలిటెక్నిక్ టీచర్లకు మొదటి ఆరు నెలలు శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే కొత్తగా డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు అధ్యాపకులు, సీనియర్ విద్యార్థులతో కోర్సుపై అవగాహన, కోర్సు పూర్తయిన తర్వాత ఉద్యోగవకాశాలు తదితర అంశాలపై మొదటి మూడు నెలలు ఓరియెంటేషన్ తరగతులు నిర్వహించాలన్నారు. దేశవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో 12 లక్షల సీట్లు అందుబాటులో ఉంటే, అందులో 7 లక్షలు మాత్రమే భర్తీ అవుతున్నాయని, యేటా సుమారు 5 లక్షల సీట్లు ఖాళీగా మిగులుతున్నాయని చెప్పారు. అన్ని సీట్లు భర్తీ అయ్యేలా పాలిటెక్నిక్ విద్యపై ప్రజల్లో అవగాహన కల్పించేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. భారతదేశంలో యువత ఎక్కువగా ఉందని, నాణ్యమైన మానవ వనరుల కోసం ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తుందని తెలిపారు. పాలిటెక్నిక్‌లతో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, ఎఐసిటిఇ కరిక్యులమ్‌కు అనుగుణంగా విద్యలో మార్పులు తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐఎఫ్‌పిటిఒ అధ్యక్షుడు డా. చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎం.ఎల్.రానా తదితరులున్నారు.

ఫలించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రయోగం


- పౌర సరఫరాల శాఖలో సత్ఫలితాలిస్తున్న నిఘా వ్యవస్థ
- ఏడాదిలో రూ.500 కోట్ల మేర అక్రమాల నియంత్రణ
- పౌర సరఫరాల శాఖ కమిషనర్ సి.వి.ఆనంద్

మన తెలంగాణ/హైదరాబాద్: పౌరసరఫరాల శాఖలో జరుగుతున్న అక్రమాలను, రేషన్ బియ్యం దారి మళ్లింపును అరికట్టడానికి ఏర్పాటైన నిఘా వ్యవస్థ సత్ఫలితాలిస్తోందని కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. పౌరసరఫరాల శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా ఆ విభాగం పనితీరును కమిషనర్ సివి ఆనంద్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థలో అవినీతి, అక్రమాలను నిరోధించడానికి, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్ల ఆగడాలను అరికట్టడానికి, నాణ్యతలో రాజీపడకుండా చూడటానికి రిటైర్డ్ పోలీసు అధికారులతో పాటు రెవెన్యూ, కమర్షియల్ ట్యాక్స్ తదితర విభాగాలకు చెందిన 20 మందితో ఐదు బృందాలుగా గత ఏడాది ఫిబ్రవరి 1న ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేశామని, నిర్వహణకు ఏడాదికి రూ.1.25 కోట్లు ఖర్చవుతోందని, దాదాపు రూ.500 కోట్ల మేరకు అక్రమాలను నియంత్రించామని చెప్పారు. నిజాయితీ, నిబద్ధత, పనిసామర్థ్యం కలిగిన అధికారులను కాంట్రాక్ట్ విధానంలో నియమించుకుని రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేసి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్లకు, పౌర సరఫరాల సంస్థకు నివేదికలు అందిస్తున్నామని, జిల్లాల కలెక్టర్లు వాటిపై చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు.

165 మందిపై 6ఎ కేసులు

ఈ ఏడాది కాలంలో నిఘా వ్యవస్థ మండల స్థాయి గోదాములు, రేషన్ దుకాణాలు, సిఎంఆర్ మిల్లులు, మధ్యాహ్న భోజనం కోసం సన్నబియ్యం అందుకునే సంస్థలు, హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, ఎల్‌పిజి గోదాములు, ఇతర రాష్ట్రాలకు రేషన్ బియ్యం రవాణా చేస్తున్న వాహనాలు, రైళ్లు వంటి ప్రదేశాల్లో 843 ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు, తనిఖీలు నిర్వహించి రూ.3.60 కోట్ల విలువ చేసే 12,915 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 2,619 క్వింటాళ్ల సిఎంఆర్ ధాన్యాన్ని, అక్రమంగా నిల్వ చేసిన రూ.3.90 లక్షల విలువగల చక్కెర, ఎల్‌పిజి సిలిండర్లు, కిరోసిన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. 165మందిపై 6ఎ, 71మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. ఆకస్మిక తనిఖీలు, దాడులతో ధాన్యం, సన్నబియ్యం, రేషన్ బియ్యంలో రూ.6.39 కోట్ల మేర అక్రమాలు, తరుగును నివారించగలిగామన్నారు.

మూడు జిల్లాల్లో పిడి కేసులు నమోదు



ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నిఘాతో ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ముగ్గురిపై ఆయా జిల్లా కలెక్టర్లు పిడి చట్టం కింద కేసులు నమోదు చేశాం. బియ్యం అక్రమ రవాణా తగ్గుముఖం పట్టింది. మిల్లర్ల నుంచి రావాల్సిన సిఎంఆర్‌ను కూడా పూర్తిస్థాయిలో రాబట్టగలుగుతున్నాం. మండల స్థాయి గిడ్డంగులు, రేషన్ దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ బృందాల ఆకస్మిక తనిఖీలు, దాడులతో చాలావరకు వాటి పనితీరు కూడా మెరుగు పడింది. బియ్యం అక్రమ రవాణా నియంత్రించడంలో వందకు వంద శాతం సఫలమయ్యాం. తప్పుచేస్తే తప్పించుకోలేరనే పరిస్థితిని తీసుకురాగలిగాం.

– సివి ఆనంద్, కమిషనర్

సంచార గీతం



బాటసారులం మనందరం
వస్తూ పోతుంటాం
దారిలో జ్ఞాపకాలను
నాటుతూ వెళ్తుంటాం.
చేతులు కలుపుతూ
గోరువెచ్చని రక్తప్రసారం గావిస్తాం
హృదయాల గురించే ఆలోచిస్తాం.

ఒక్క చిరునవ్వు
ఉండిపొమ్మనే ఒక చిన్నమాట.
సాగనంపటాల్లో కురిసే
ఓ కన్నీటి చుక్క
తిరిగి వెళ్లటంలో
లగేజీ ఏముంటుంది
తలపోతలు తప్ప

మధ్యలో ఒక ఊరు వస్తుంది
అది మన ఊరులాగే వుంటుంది
ఆ చెరువు మన చెరువుకు
చుట్టంలాగే కనిపిస్తుంది.

ఆ చింత చెట్టు కింద
మన గాలులే వీస్తాయి.
వ్యక్తిగత సంబంధాలు
మానవానుబంధాలౌతాయి
పేర్లు మాయమై
వేర్లు మిగులుతాయి.
నిన్నటిదాకా వేరువేరు ఊర్లే
ఇవాళ సరిహద్దులు చెరిగిపోతాయి

విస్తీర్ణం పెరిగినప్పుడల్లా
అస్తిత్వం స్పష్టమౌతుంది.
మనిషి ఒక విరాట్ స్వరూపమై
కనిపిస్తాడు.
భ్రమణమే జీవితంగా
అర్థమౌతుంది.

ఎన్.గోపి

మేరా భారత్ మహాన్



కవితా సేద్యం చేయ
కాగితం పొలంలో
కలమనే నాగలితో దున్ని
కుల, మతరహిత
విత్తనం నాటాను
నీతి మొక్కై మొలిచి
అక్షరాస్యతా మొగ్గలు తొడిగి
సమానతా పూలు పూచి
సమరస భావపు కాయలు కాచి
రైతుహ్లాదపు ఫలాలు పండాలనుకొన్న.
స్వార్థపు గరిక
దళారి కలుపు మొక్కలు
అనైక్యత చీడ పురుగులు చేరాయి
అయితేనేం?
కలుపును కెలికితీసే కిసాన్
శత్రుతల బంతులేరిన జవాన్
సాంకేతిక శాస్త్రజ్ఞుల మేధలో
పరకాయ ప్రవేశం చేసి
పరిసమాప్తంచేస్త
చీడలను ప్రజల దరిని చేరుస్త
శాంతిని మేరా భారత్ మహాన్
అని చాటుతా!!
(జై జవాన్, జై కిసాన్,
జై విజ్ఞాన్‌కు స్పందిస్తూ...)

డా.ఎస్.విజయ భాస్కర్,
9290826988

కొలకలూరి పురస్కారాలకు ఎంపిక

కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారాలకై అంకం లింగమూర్తి రాసిన (అమ్మ – నాన్న) జీడిగుంట రామచంద్రమూర్తి రాసిన మూడు నాటికలు ఎంపికయ్యాయి. కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారానికి ఈతకోట సుబ్బారావు (కాకి ముద్ద), అడిగోపుల వెంకటరత్నం (ముందడుగు)లు ఎంపిక చేశారు. వీరందరికీ ఈ నెల 26న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో పురస్కారాల నందిస్తారు.

'మునివాహనుడు' నాటక సమీక్ష పోటీ

ఆచార్య కొలకలూరి ఇనాక్ కలం నుంచి వెలువడిన 'మునివాహనుడు' నాటకంపై సమీక్షపోటీని సాహితీకిరణం సౌజన్యంతో కీ.శే.యం. బాలనాగయ్య పురస్కార కమిటీ నిర్వహిస్తుంది. పోటీలో పాల్గొనే సమీక్షకుల సమీక్ష ప్రతులు మూడింటిని మార్చి 2018లోగా పంపించాలి. గతంలో ప్రచురించినవి అర్హమైనవికావు. వ్యాస ప్రతులతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలను పంపించాలి. ఎంపికైన సమీక్షా వ్యాసాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.1500, రూ.1000, రూ.500 నగదు పారితోషికంతో పాటు జ్ఞాపికను తేదీ : 09.06.2018న హైదరాబాద్‌లో జరిగే సభలో అందిస్తారు. వ్యాసాలను పంపించాల్సిన చిరునామా, సాహితీ కిరణం, ఇం.నెం.11.13.154, రోడ్ నెం.3, అలకాపురి, హైదరాబాద్ – 500102.

'రేలపూలు'కు పురస్కారం

మాడభూషి రంగాచారి పేరిట ఇచ్చే పురస్కారానికి, సమ్మెట ఉమాదేవి రాసిన 'రేల పూలు' కథాసంపుటి ఎంపికైంది. ఈ నెల 25న హైదరాబాద్‌లో నిర్వహించబడే ప్రత్యేక కార్యక్రమంలో రచయిత్రికి ఈ అవార్డు ప్రదానం చేస్తారు.

'కవితా దినోత్సవం'

వంతెన కవిత్వ బులెటిన్ పక్షాన మార్చి 21న ప్రపంచ కవిత్వ దినోత్సవ పోటీ నిర్వహిస్తున్నారు. పాల్గొనే కవులు 25 లైన్లకు మించని కవితలను ఈ నెల 28వ తేదీలోపు పంపించాలి. చిరునామా : 'చిత్తలూరి' ప్రధాన సంపాదకులు, వంతెన, కవిత్వ బుల్లెటిన్, కేరాఫ్ అమూల్యా చందు కప్పగంతు, డోర్ నెం.29–27–23, సూర్యనారాయణ వీధి, సూర్యారావు పేట, విజయవాడ – 2, సెల్ నెం.90598 24800, 9133832246.

సబ్బండ వర్ణాల కథలకు అభ్యర్థన

డా|| మేడికుర్తి ఓబులేసు, సమస్త వృత్తుల జీవితాలపై, కులాలవారీగా కథాసంకలనాలు తేవాలని యత్నిస్తున్నారు. కుమ్మర్లు, గీత కార్మికులు, విశ్వకర్మలు, వడ్డెరలు, జంగాలు వంటి సబ్బండ వర్ణాల వారు తమ తమ కులాలకు సంబంధించిన కథలను, మేడికుర్తి ఓబులేసు, అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంటాక్టు), తెలుగు శాఖ విభాగం, రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు – 518007కు గానీ, ఈమెయిల్ medikurthiobulesu@gmail. comకు గానీ పంపాలని కోరుతున్నారు.

కళాస్రవంతి కవితల పోటీ

సామాజిక అంశంతో కూడిన 30 లైన్లకు మించని కవితలను కళాస్రవంతి పోటీకై ఆహ్వానిస్తుంది. పోటీకి పంపే కవితతో పాటు రెండు జీరాక్స్ ప్రతులు పంపాలి. వాటిపై రచయిత పేరు రాయొద్దు. హామీ పత్రం, బయోడేటా, కలర్ ఫోటో జత చేసి పంపాలి. కవితలను మార్చి 31వరకు పంపవచ్చును. చిరునామా : పల్లోలి శేఖర్ బాబు, వ్యవస్థాపక కార్యదర్శి, కళాస్రవంతి సాహితీ సంస్థ, రిజిస్టర్ నెం.72/14, శివాలయం వీధి, కొలిమిగుండ్ల – 518123 , కర్నూలు జిల్లా (ఏ.పి.)

తెలంగాణపై సంస్కృత ప్రభావం



డా.నలిమెల భాస్కర్
9704374081

సంస్కృతం ఆర్యభాషే కావచ్చును. అది ఈ దేశంలోని కొన్ని సామాజిక వర్గాలకు బాగా పరిచితమైన, ఆ వర్గాల్లో చాలా ప్రచలితమైన భాషే అవొచ్చును. అయితేనేం..ఆ భాష దివి నుండి భువికి దిగిరాక తప్పలేదు. అసలు ఏ భాషకైనా నేల మీద కాళ్లానక తప్పని పరిస్థితి వుంటుంది. పైగా సంస్కృతం పూర్వం అధికార భాషగా ఉన్నప్పుడు అది దేశ భాషల్లోకి చొచ్చుకుపోయింది. ఆ భాషల మీద బాగా ప్రభావం చూపింది. తన ప్రతాపం నెరపింది. తత్కారణంగా సంస్కృత పదాలు తెలుగు భాషలో పాలలో పంచదారలా కలిసిపోయినై. ఇట్లా ఏ భాషలోనికైనా ఇతర భాషల నుండి పదాలు రావడం తప్పదు. ఆదాన ప్రదానాల ద్వారా భాషల మధ్య పరస్పర పద వినిమయం ఉంటుంది. అప్పుడే అవి పరిపుష్టం అవుతాయి. సుసంపన్నంగా మారుతాయి. అయితే ఈ పదాల మార్పిడి ఏకపక్షంగా ఉండకూడదు. పైగా ఒక భాష అస్తిత్వానికి భంగం వాటిల్లని రీతిలో ఈ మార్పులు జరగాలి. తెలుగు నుండి సంస్కృతం లోనికి వెళ్లిన మాటల కన్నా సంస్కృతం నుండి తెలుగులోకి వచ్చి చేరిన పదాలే ఎక్కువ. మరి తెలంగాణ భాషలో ఈ సంస్కృత పదాలు ఎట్లున్నాయి? ఎన్నున్నాయి? బొంబాటుగ వున్నవి, బొచ్చెదున్నయి .. అనే జవాబులే వస్తాయి వెంటనే!

తెలంగాణము అంటే వాస్తవంగా తెలుంగు ఆణెమే! అంటే తెలుగు భాషకు స్థానం. అయినా మన అవసర నిమిత్తమో, అధికార భాషగా సంస్కృతం కొంత కాలం ఉన్న కారణంగానో తెలంగాణ భాషలోకి అనేక సంస్కృత పదాలు వచ్చి చేరినై. పండితుల మాటల్లోనే కాకుండా పల్లె ప్రజల సంభాషణల్లో కూడా ఈ మాటలు సహజంగా చక్కగా దొర్లుతుంటాయి.

తెలుగు భాషలో ''వేలి ముద్ర'' అనే మాట ఒకటి ఉంది. దీనికి సమానార్థకంగా 'అంగూట్ ఒత్తుడు'' అనే సమాసం వాడుకలో ఉంది. ''అంగూట్'' అంటే ఏమిటి? ''అంగుష్ఠం'' అనే సంస్కృత పదం నుంచి వచ్చిందది. దీనికి బొటనవేలు అని అర్థం. వేలి ముద్రలో ఏ ''వేలు'' అనే స్ఫురణ లేదు. కాకపోతే ''వేలు'' తెలుగు పదం. కాదు కాదు తమిళ పదం. ''విరల్'' అనే పదం వ్రేలు అయ్యి పిదప వేలుగా మారింది. ఇక ''ముద్ర'' సంస్కృతం. ఆ లెఖ్ఖన వేలి ముద్రా తెలుగు కాదు, అంగూట్ ఒత్తుడూ తెలుగు కాదు. (ఒత్తుడు మాత్రం తెలుగే సుమా:!) ఆంగ్లంలో యిదే థంబ్ ఇంప్రెషన్.

హైదరాబాద్‌లో ఒకప్పుడు రెండు అంత్రాల బస్సులు విరివిగా నడిచేవి. వీటినే ఇంగ్లీషులో డబుల్ డెక్కర్లు అంటున్నారు. ''రెండు అంత్రాలు'' లోని ''అంత్రం'' అనే మాటకు పూర్వరూపం ''అంతరం''. ఇది సంస్కృతం. ''అంతరం'' మాటకు ఒక అర్థం ''నడిమి చోటు'' ఇంకా తెలంగాణలో ''వాడు నాలుగు అంత్రాల యిల్లు గట్టిండు'',''వీడు నడుమంత్రపోడు'' మొదలైన మాటల్లోని అంత్రమూ ఈ సంస్కృత అంతరమే మరి!

''ఎల్లయ్యకు ఒక్క అచ్చరం ముక్క రాదు'', ''పొట్ట చీరినా ఒక్క అచ్చరం లేదు'' ... ఈ మోస్తరు వాక్యాల్లోని ''అచ్చరం'' సంస్కృత ''అక్షర'' జన్యం. జనం ఉచ్చారణాత్వరలో చదువు సంధ్యలు లేకపోవడం చేత కూడా సంయుక్తాక్షరాలను ద్విత్వాలుగా మార్చుకుంటారు. ''లక్ష్మి'' ''లచ్చి'' అవుతుంది. రుక్మిణి ''రుక్కుంబాయి''గా మారుతుంది. కష్టం కట్టమై పోతుంది. ఇష్టమున్నా లేకపోయినా ''ఇష్టం'' ఇట్టంగా మారిపోతుంది. ఈ ''అక్షరాదుల్ని'' యిక్కడికి వదిలేసి ''అగరు బత్తులు'' వెలిగిద్దాం. ఆ వత్తుల్ని అంటించడం ద్వారా వచ్చే సుగంధాలు అనుభవిద్దాం. అగరు బత్తుల్లోని ''అగరు'' సంస్కృత ''అగరువు'' నుండి పుట్టింది. అగరువు అంటే ఒక రకమైన చందనం. ఆ కారణం చేత ముట్టించగా వచ్చేది సుగంధం. వీటినే ''ఊదు బత్తులు'' అని కూడా పిలుస్తారు.

తెలంగాణలో ''అగాదం జగన్నాదం'' అయిపోయింది అంతా అనే పలుకుబడి ప్రచారంలో ఉంది. దీనికి భావం ''అంతా అగమ్య గోచరంగానూ, అయోమయంగానూ వుందని. ఈ పదబంధంలోని ''అగాదం'' సంస్కృత ''అగాథం'' నుండీ, ''జగన్నాదం'' ఆ భాషలోని ''జగన్నాథం'' నుండీ వచ్చాయి. ఇటువంటి పలుకుబళ్లు అలవోకగా ప్రజల నోళ్లలో నానుతున్నాయి. ''ఏ వాన్ని ఎందుకు కొడుతున్నవే! వాడు అగ్యానం పిల్లవాడు. ఇంక సక్కగ గ్యానమే రాలేదు వానికి'' అనే మాటలు వినబడుతాయి. ఇందులోని అగ్యానం, గ్యానం వరుసగా అజ్ఞానం, జ్ఞానం నుండి జనించిన మాటలు. ''ఈ పిల్లలు పాడుగాను! నెరీ ఆగ్గెల లేకుండ అయితున్నరు'' లోని ''ఆగ్గె'' ఏమిటి? అది ''ఆజ్ఞ''. అంటే పెద్దవాళ్లు ఆజ్ఞాపిస్తే పిల్లలు వినడం లేదని అర్థం. అదుపాజ్ఞల్లో ఉండడం లేదని సారం. సంస్కృతంలోని ''ప్రజ్ఞ'' పెగ్గె కాలేదా? అట్లాగే ''ఆజ్ఞ'' ఆగ్గె అయ్యింది. ప్రజ్ఞ అయినా, పెగ్గె అయినా సామర్థ్య సూచకం అయినట్లే; ఆజ్ఞ అయినా, ఆగ్గె అయినా ఏకార్థ బోధకం.

''ఇగో ఏదైనా అతి చెయ్యద్దు. వాడు అతిచేస్తడు ''లోని ''అతి'' అచ్చంగా సంస్కృతం. అంటే ఎక్కువ చేయటం. ఓవర్ చేయడం. అతి చేయడం వల్ల జరిగే పర్యవసానాలు వేరు. ''అతి సర్వత్ర వర్జయేత్'' అనేది సూక్తి. ''ఎవ్వలకు అతికారం ఇచ్చినా బతుకులు ఏం మారుతలేవు'' అనే వాక్యంలోని ''అతికారం'' అధికారంలోంచి వచ్చింది. అసలు తెలుగులో మహాప్రాణాలు అంటే ధ, భ, ఖ మొదలైనవి లేవు. అందుకని ప్రజలు తమకు అనుకూలంగా ఆ పదాల్ని మార్చుకుంటారు. అలా మారడమే తెలుగు భాషా పద్ధతి. ప్రజల వ్యవహారంలో ఉన్నవన్ని సాధురూపాలే! జనబాహుళ్యంలో బాగా నానుతున్న ఇటువంటి మాటలన్నింటినీ నిఘంటువుల్లోకి ఎక్కించవలసిందే గాని భాషకు ఏదో అపచారం జరుగుతుందనే అభిప్రాయం వుండకూడదు.

''మల్లయ్యకు ధైర్నం తక్కువ. ఆపద వచ్చినప్పుడు మనిషికి గుండె ధైర్నం ఉండాలె. అధైర్నం మంచిది కాదు'' వాక్యాల్లోని ''ధైర్నం'' ధైర్యం నుండి ధైర్యంగా నిర్భయంగా ప్రభవించింది. ధైర్యంలోని యావత్తు ధైర్నంలో నావత్తుగా మారింది. ఎంత ధైర్యమో గమనించండి. ప్రజలు పదాల్ని తాము ఉచ్చరించడానికి విధేయంగా మార్చుకుంటారు. ''గుండె ధైర్నం చెడొద్దు'' అంటారు. ఇంకో మాట! ''అధ్వానం'' అనే పదానికి అమార్గం అని అర్థం. అంటే పెడ త్రోవ. చెడుదారి. ఇది తెలంగాణలో అమాంతం ''అద్మాన్నం'' అయిపోతుంది. వా వత్తు మావత్తు అయి కూచుంది. అదనంగా నకారానికి నావత్తు వచ్చి చేరింది. ఇట్లా ద్విత్వం రావడం తెలంగాణ భాషలో సర్వ సాధారణం. తెలంగాణ భాషేమిటి, తెలుగు భాషా లక్షణం అది. ఉదాహరణకు ''పాపాయి కన్నులు కలువరేకుల్లు, పాపాయి చేతుల్లు పొట్ల కాయల్లు, ''మా పాప మామల్లు మత్స్యావతారం, వరసైన బావల్లు వరహావతారం'' మొదలైన పాటల్లోని ''కన్నుల్లు'' వంటి పదాల్లో ద్విత్వం రాలేదూ! అదుగో... అలాగే తెలంగాణలో ''కాళ్లు తట్ట తట్ట కొడతరు పిల్లలు బడికి పోను అని. అయినా పెద్దలు ఊరుకోక వాళ్లను గొర్రగొర్ర గుంజుకపోతరు. కొంత మంది ఉత్తగనే కిల్లకిల్ల నవ్వుతరు. తలలో పేలు పడ్డవాళ్లు బర్రబర్ర గోకుతరు. గాలి బొయ్యబొయ్య ఇసురుతది'' లాంటి వాక్యాల్లోని ''తట్టతట్ట కొడుతరు'' మొదలైన మాటల్లో ద్విత్వం ఉంది కదా! అట్లాగే ''అధ్వానం'' లోని ''న'' తెలంగాణ ''అద్మాన్నం'' లో ''న్న''గా మారింది.

సంస్కృత పదం ''అనాయాసం'' ఎటువంటి ఆయాసం లేకుండా తెలంగాణలో ''సునాయాసం'' అయింది. అనాయాసం అంటే ఆయాసం లేకుండా అనే నఞ్ తత్పురుషం. మరి సునాయాసం ఎట్లా పుట్టిందో, సులువుగా చెప్పలేం. ఆయాసం లేకుండానూ, మంచిగానూ అని అర్థం చెప్పుకోవాలి. సునాయాసంలోని ''సు'' మంచిగా, చక్కగా అనే అర్థాన్నే ఇస్తున్నది.''బూమలింగం రాతం దుబాయికే పోతుంటడు. ఊల్లె ఉండనే ఉండడు'' లోని ''రాతం'' మాటకు అర్థం ''ఎల్లప్పుడు'' అని, ఈ ''రాతం'' ఎక్కడిది? అనవరతం, అనారతం, నిరతం అనే సంస్కృత పదాల్లోని రతమే రాతంగా మారొచ్చు. అయితే ''రతం'' అని విడిగా మాటకు అర్థం లేదు. ఉన్నా ఎల్లప్పుడు అనే భావం రాదు. అయితేనేం పండితుల సంభాషణల్లో గబగబా దొర్లిన అనారతం వంటి మాటల్ని విన్న జనం పొరపాటున ''రాతం'' గ్రహించి ఉండాలి.

''అన్నాలం పాడుగాను! ఏం కాలమొచ్చింది. అంత అగ్గిబుగ్గయిపోతుంది'' వాక్యంలోని ''అన్నాలం'' ఏమిటో కాదు. అది ''అన్యాయం''. సంస్కృత పదంలో వున్న యావత్తు తెలంగాణలో నావత్తు కావడం ద్విత్వపరమైన పాత మార్పే! ఇక్కడ ప్రస్తావించదగిన అంశం అన్యాయంలోని యకారం లకారంగా అన్నాలంలో చోటు చేసుకోవడం. ఇదెక్కడి అన్యాయం అని పండితులు గుండెలు బాదుకోనక్కర లేదు. భాష మారుతుంది. మారడం సహజం. ప్రజల వ్యవహారంలో అనేక కారణాల వల్ల మరింత మారిపోతుంది. మారిన రూపం వాడుకలో ఉంటే సాధురూపమే! ఇది ప్రజాస్వామిక యుగం. ప్రజానీకం మాట్లాడుతున్న ప్రతి మాటనూ కళ్లకు అద్దుకోవాలి. సేకరించాలి. నిఘంటువుల్లోకి తీసికోవాలి. కాలానుగుణంగా అన్నీ మారుతున్నాయి కానీ నిఘంటువులే మారడం లేదు. మారడం అటుంచి అసలు నిఘంటు నిర్మాణమే లేదు తెలంగాణలో. కేవలం కవిత్వాది ప్రక్రియలు తప్ప తెలుగు సాహిత్యంలో ఇతర ప్రక్రియలు నిష్క్రియలుగా మారడం మంచి పరిణామం కాదు. ప్రజల మాటలతో నిఘంటు నిర్మాణం జరగడం తక్షణావసరం.''అనుములంటే అపరాదం –మినుములంటే మిడియాల్లం'' అనే తెలంగాణ సామెతలోని అపరాదం సంస్కృత అపరాధ్యజన్యం.

మహాప్రాణం తేలికైంది తెలంగాణలో. ఆ సామెతకు అర్థం ఏం మాట్లాడినా ఇబ్బందే అని స్థూలంగా! ఇక సంస్కృతంలోని ''అపేక్ష''కు ఏ అపేక్షో ఆపాచ్చనగా మారాలని! ''ఆపాచ్చన'' తెలంగాణ మాట. కోరిక అనే అర్థం కల్గిన అపేక్ష తెలంగాణలో ఆపాచ్చన అయిపోయింది. ''పైసల మీద వానికి ఎంత ఆపాచ్చన పాడయింది. పోయేటప్పుడు ఏమన్న తీస్కపోతమా?'' అంటుంటారు మామూలు జనాలు. ''వీడు అప్రశస్తపు ముండకొడుకు'' వంటి తిట్లు కొన్ని కుటుంబాల్లో వినవస్తుంటాయి. ఈ ఛీత్కారంలోని ''అప్రశస్తపు'' సంస్కృతం. చివరి ''పు'' తెలుగు. ప్రశస్తం కానిదే అప్రశస్తం. ఇక్కడ చెడ్డవాడు అని అర్థం చేసుకోవాలి.

సంస్కృతంలో 'అబద్ధం'' అనే పదం ఉంది. అంటే బద్ధము కానిది. దేనికీ కట్టుబడని నీతినియమం లేని అసత్యం అబద్ధం. ఇది ఎంచక్కా తెలంగాణలో నిత్య వ్యవహారంలో ''అవద్దం''గా అవుపిస్తున్నది. అబద్ధంలోని ''బ'' అవద్దంతో ''వ''గా మారింది. వకార బకారాలు రెండూ పరస్పరం మారడం భాషలో సహజం. అబద్ధానికి వ్యతిరేకంగా నిబద్ధం ఉంది సంస్కృత భాషలో. కట్టుబడేది నిబద్ధం. చిత్రంగా ఇది తెలంగాణలో ''నివ్వద్దె'' అయ్యింది. ఇక్కడా ''బ'' కారం ''వ''గా మారడమే కాకుండా అదనంగా ద్విత్వమైంది. అంతేగాక ''నిబద్ధం'' లోని ''ద్ధం'' చిత్రంగా ''ద్దె'' గా మారింది. నిబద్ధంలోని ''సున్నా'' ఎగిరిపోయింది. పైగా ''ద్ధ'' అనేది ఎకారాంతమై ''ద్దె''గా మారింది. కన్నడ ప్రభావం తెలంగాణ భాషపై ఎక్కువ. పాఠశాలను నిజామాబాద్ ప్రాంతాల్లో శాల్లె అంటారు. అక్కడే బిడ్డను బిడ్డె అనీ, పిట్టను పిట్టె అని కూడా పిలుస్తారు. శాల్లె, బిడ్డె, పిట్టె... ఇటువంటివన్నీ ఎకారాంతాలు.

నిజామాబాద్ జిల్లాకు ఆనుకొని సరిహద్దు రాష్ట్రంగా కర్నాటక ఉంది. ''నువ్వద్దె'' లోని ''ద్దె'' మీద ఆ రాష్ట్రపు అసర్ పడింది. ''అమృత'' అనేది ఆకారాంత స్త్రీ లింగ సంస్కృత నామ వాచకం. ఇది తెలుగులో ''అమృతము'' అవుతుంది. చివరి ''ము'' తెలుగు ప్రత్యయం. తెలంగాణలో కొంత మంది స్త్రీల పేర్లు అమృతవ్వ, అమృతమ్మ అని కూడా ఉంటాయి. ''అర్తంలేని సదువు ఎర్తం'' అనే సామెతలోని ''అర్తం'' సంస్కృత ''అర్థం'' లోంచి వచ్చింది. అర్థము అంటే శబ్దార్థం. మీనింగ్. ఆ అర్థం బోధపడకుండా చదివే విద్య వ్యర్థం కదా! సంస్కృత వ్యర్థం తెలంగాణలో ''ఎర్తం'' గా అవతరించింది. మొలల వ్యాధి, పైల్సు, మూలవ్యాధి అనే మాటలకు తెలంగాణలో ''అర్శ మొలలు'' అనే సమాస వ్యవహారం ఉంది. అర్శం అంటే మూలవ్యాధే! పైగా యిది అర్శం కాదు, అస్రం. అస్రం అంటే నెత్తురు. ఆ రక్త నాళాలు గట్టిబారగా ఏర్పడినవే అర్శమొలలు.కొందరు ''అల్మింతలు'' కూరగా వండుకుంటారు. ''అలసాంద్రము'' నుండి ఆల్మింతలు ఏర్పడ్డాయి.

అలా మారడంలో మనకు చింతలూ, విచారాలే వద్దు. ''అవతారం'' అనేది సంస్కృత పదం. ఇది చాలా చక్కగా తెలంగానలో ప్రయుక్తం అవుతున్నది. దేనికైనా జవాబు చెప్పకుండా ముభావంగా ఉన్నప్పుడు ''వీడు బుద్ధావతారం'' అంటారు. ఏదీ సరిగా చెప్పే జ్ఞానం లేని తరుణంలో'' వానిది మొద్దావతారం'' అని పల్కుతారు. సరిగా బట్టలు వేసుకోని సందర్భంలో ''ఏం అవతారంరా నీది?'' అని ప్రశ్నిస్తారు. చచ్చీచెడీ, కిందామీదా పడీ ఓ పనిని సాధించిన సన్నివేశంలో ''అబ్బా! నాకు ఓ అవతారం ఎత్తినంత పని అయ్యింది'' అంటుంటారు. ఇవన్నీ అవతార ప్రస్తావనలే! అవలచ్చనం (అవలక్షణం), అంసురం (అవసరం), అవస్త (అవస్థ), అన్నం తింటున్నవా అశుద్ధమా (అశుద్ధం) అతారె (అస్త్రం), ఆంకారం (అహంకారం)... ఇత్యాది సంస్కృత జన్యాలను తెలంగాణ జనాలు హాయిగా వాడుతున్నారు. ●

జాషువా కోరిన సామాజిక సమరసత



ఎస్.ఎస్.నారాయణమ్మ
7382150216

సర్వమానవ శ్రేయస్సు కోసం మానవులలో నైతిక విలువలను పెంచుటకు వారి అభివృద్ధి కోసం ఏర్పాటు చేసినవి కులమతాలు. ఇవి మానవత్వాన్ని పెంచాలి. మంచిని బోధించాలి కొందరు మత ఛాందసవాదులు స్వార్థపూరిత బుద్ధితో వర్ణ వ్యవస్థను ఆ తరువాత తక్కువ ఎక్కువ భావాలతో మానవులంతా ఒకటే అనే భావం మరిచారు. ఈ సమయంలో ''అక్షరాన్ని ఆయుధంగా చేసి కవితను ఖడ్గంలా ఝుళిపించి సాహిత్యాన్ని సామాన్యుని ముంగిట అసామాన్యుడిగా చేశారు జాషువా. దళితులను అంటరాని వారిగా చేసి దోపిడీ చేసే హైందవ బ్రాహ్మణ పండితులను పండిత భాషలోనే సమాధానం చెప్పారు గుఱ్ఱం జాషువా.

''గౌరవం కులానికా? కలానికా?'' అని ప్రశ్నించాడు.

జీవితానుభవాల రాపిడినుండి ప్రతిభ గుబాళించిన కవిత జాషువాది. ''కులమత విద్వేషంబుల్ తలసూపని కళారాజ్యం'' కోసం కలలు కన్న ఆశావాది సమతావాది గుఱ్ఱం జాషువా. కవి దిగ్గజంగా పేరొందిన జాషువా కవితల్లో స్పృశించని కథావస్తువే లేదు. ప్రజా భాషలో రచించిన ఆయన కవితల్లో సామాజికత కన్పిస్తుంది.పేదరికం సహనాన్ని నేర్పితే కులతత్వం వల్ల ఎదిరించే లక్షణం అలవడింది అని చెప్తూ జాషువా ఇలా అన్నారు.

''కుల మతాలు గీచుకున్న గీతల చొచ్చి/ పంజరాన కట్టుపడను నేను

నిఖిలలోక మెట్లు నిర్ణయించిన నాకు/ తిరుగులేదు విశ్వనరుడ నేను.

జాషువా మానవతావాది. అందరి హితాన్ని అందరి సుఖాన్ని కోరేది మానవతా వాదం. అది కులమత వర్గ భాషా సంకుచిత ధోరణుల కంటే అతీతమైంది. ఇది సమాజంలో చూడాలనుకున్నారు

''మత పిచ్చిగాని వర్ణో/ న్నతిగాని స్వార్థ చింతనమని, నా/

కృతులందుండదు శబ్దా/ కృతి బ్రహ్మానంద అద్మ నృత మ్మొనర్చున్''


అంటూ వివక్ష లేని సమాజాన్ని కోరుకున్నారు. తన రచనలో ఇలాంటి భావాలు లేవని బ్రహ్మానంద లక్ష్మిని కల్గించునని ఇలా చెప్పారు.

''సమతలేని రిత్త చదువేల? పదవేల/

మతము లేల నూరు వ్రతము లేల?'' అనే తన మాటలలో జాషువా కోరిన సమానత్వాన్ని బలపరుస్తున్నాయి.

గబ్బిలాన్ని అపశకునం అని భావించే సమాజంలో కాదేది కవితకనర్హం అన్న శ్రీ శ్రీ మాటలను ఆదర్శంగా తీసుకొని ''గబ్బిలాన్ని ప్రధాన పాత్రగా ఖండ కావ్యాన్ని రాసారు. ఈ ఖండ కావ్యంలో వర్ణ వ్యవస్థపై నిరసన ''వర్ణ సంఘర్షణ'' దర్శింప చేసారు. గబ్బిలం కావ్యంలో శ్రామికుల కష్టాలను వారున్న దయా విహీన స్థితిని చిత్రించారు.

''వాని రెక్కల కష్టంబులేని నాడు/ సస్యరమ పండి పులకింప సంశయించు/ వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు భోజనము బెట్టువానికి భుక్తి లేదు.'' కష్టించి పంటను పండించి రైతులు ఆకలితో పస్తుండే పరిస్థితిని అంటరాని తనాన్ని నిరసిస్తూ తన రచనతో మానవతా



గుఱ్ఱం జాషువా

వాదాన్ని, జాతీయాభిమానం సమకాలీన సమాజ జీవన సమస్యలను వాస్తవ దృక్పథంతో రచన చేసారు. సంప్రదాయ స్పర్శ ఆధునిక భావధోరణి మనోహరంగా మేళవించారు. భావాభ్యుదయాలను ఏకం చేసి సంప్రదాయ పద్యాలలో సామాజిక విషయాలను చిత్రించారు. అభ్యుదయ దృక్పథాన్ని అన్నార్తుల ఆక్రందనలను తెలియజేసే విధంగా తన రచనలో ధనవంతులు తమ సరదాల కోసం ఖర్చు చేస్తారు. కాని ఆకలితో ఉన్న పేదల శూన్యమైన పాత్రలలో ఒక్క మెతుకు విదల్పరు ఈ భరత భూమిలో అని అంటారు జాషువా. గబ్బిలంలో ఆకాశవాణి మీద రాసిన పద్యాల్లో కూడా జాషువా ఇలా రాసారు.

''రేయింబవలు భారతీయ సంస్క ృతి పేర/ గండ శిలలు చూసి కథలు చెప్పి /కటిక పేదవాని కడుపులో గల చిచ్చు / గడప గలవే నీవు గగన వాణి'' అని అట్టడుగు వర్గాల ప్రజల దీన స్థితిని సమాజంలోని ఇతర వర్గాల వారి హృదయాలను కరిగించి వారిలో మార్పుకు అందుకు అనువైన వాతావరణం కల్పించాడు. అదే ఆశతో కావ్య రచన చేసాడు.

''ధర్మమునకు పిరికితన మెన్నడును లేదు.

సత్యవాక్యమునకు చావు లేదు'' అని గబ్బిలం కావ్యంలో

తన మనోగతాన్ని దృఢ నిశ్చయం తెలియజేసారు జాషువా. కావ్యాంతంలో ''భోగులారగించు భుక్తి కన్నుల జూచి/ పరమ పేదలు దు:ఖపడని చోటు'' అంటూ చూసి వచ్చావా నీవు అని గబ్బిలాన్ని అడిగించిన ఆశావాది జాషువా. తెలుగు తేజంలో ఆంధ్రదేశంలోని వివిధ పుణ్య క్షేత్రాలను పుణ్య తీర్థాలను వాటి మహాత్మ్యాలు అద్భుతంగా వర్ణించారు. దీనిలో తెలుగు వాఙ్మయ లక్ష్మిని వర్ణించిన తీరు జాషువాకి గల ఆంధ్రాభిమానాన్ని చాటుతుంది. సాహిత్యం పై తన కున్న మక్కువను దీనిలో వ్యక్తం చేసారు. శ్రీ కృష్ణదేవరాయల కాలం నాటి విజయ నగర వైభవం అనంతర కాలంలో తంజావూరు పాలకులు కవులను పెంచి పోషించిన విధానం అద్భుతం. ఆంధ్రులు కావ్య రంగంలో కదనరంగంలో సాటి లేని వారని చాటి చెప్పారు. అన్నమయ్య, క్షేత్రయ్య, ముద్దుపళని, నన్నయ్య, తిక్కన, శ్రీనాథాది కవులు ఆంధ్రవాఙ్మయ లక్ష్మిని సేవించిన విధం వర్ణించి చెప్పారు.

''మాతృ భాషలకనర్హ మర్యాదలొనరించు/ సర్వకళాశాల సాగు చోట/ ప్రజల నాహరించు బహుమత దేవతా/ దైనందిన గ్లాని లేని చోట/ నవనీత నిభమైన కవుల కమ్మని వాక్కు/ వెఱపులే కావిర్భవించు చోట

సంతానమునకు వైషమ్యంబు నేర్పని తల్లిదండ్రులు విరాజిల్లు చోటు అనే తన పద్యంలో జాషువా మాతృభాషలకు గౌరవాన్ని సర్వభాష సమన్వయాన్ని వివక్ష లేని విద్యను వైషమ్యాలు నేర్పని తల్లితండ్రులు ఉన్న సమాజాన్ని చూడాలన్న ఆశను వ్యక్తపరచారు. మనుషులలో వివక్షతను తొలగించుటకు మానవత్వాన్ని విశ్వ వ్యాప్తం చేయాలని ఆకాంక్షించారు. మానవులంతా సమానులనే భావాన్ని విశ్వవ్యాప్తం చేయాలని ప్రయత్నించారు. విశ్వనరుడిగా పేరొందిన వారు గుఱ్ఱం జాషువా గారు. ●

విషాదం

ఏమోయ్!
నువ్వలా ఉన్నపళంగా
వీడ్కోలు చెప్పేస్తూ వెళ్లిపోయావు
బయట నుంచి తాళం తీస్తుంటే
ఇంటిగుమ్మానికతికించిన
నీ చిరునవ్వు
చిన్నగాఆప్యాయంగా పలకరిస్తుంది
తలుపు తీసి లోపలికి వచ్చేస్తే
ఇల్లంతాచిందరవందరగా
జ్ఞాపకాలు
బయటికెళ్లే హడావుడిలో
పారేసి వెళ్లానుగా...
వాటిలోంచి దారి చేసుకుంటూ
దారిచూచుకుంటూ లోపలి కొచ్చేసి
వాటన్నింటిని ఎక్కడికక్కడ
చక్కగా సర్దేస్తుంటే
నిలువుటద్దంలోని నీ కళ్లు
నన్ను మౌనంగా గమనిస్తుంటాయి
తన ముందు కొచ్చిన ప్రతిసారీ
మెల్లగా నాతో
మాట్లాడుతాయి కూడా
ఈ విషయం నీకు తెలుసా...
నువ్వలా వెళ్లావో లేదో
ఎలాతెలుసుకుందోఏమో?
ఒంటరితనం
అమాంతంగావచ్చి
నన్నల్లుకు పోయింది
ఆనందాలన్నింటినీ అప్పుడే
కట్టగట్టి చెత్తబుట్టలో పారేసానుగా
ఇప్పుడు ఇంట్లో
అవేమీ కనిపించడం లేదు
ఆమూలెక్కడో మూత
వదులైన సీసాలోని దుఃఖం ఒలికింది
ఇల్లంతా ఆవాసన వ్యాపిస్తోంది.
మరో మాట
మన ఇంట్లోని సందడి మీద
పోటీపడి చిత్తుగా ఓడించిందిగా
ఇప్పుడు ఇల్లంతా మౌనం
రాజ్యమేలుతుంది.
నీకో విషయం చెప్పనా
నాకు... నాకు
దేవుని మీద
భలే కోపమొచ్చిందోయ్
ఇప్పుడు ఆయన పటానికి దండ
వేయటం లేదు
ఆ దేవుడు కుళ్లుకుని చావాలని
కచ్చగా ఆయన వంక చూస్తూ
నీ పటానికి వేస్తున్నాను.

శ్రీధర్ చౌడారపు
94400 32211

అంకెలు

అంకెతప్పి
రంకె వేస్తుంటే
అంకెలానవాలు
గాంచలేని సామాన్యుడు
సంఖ్యామానం
కొలతల్లోవ్యత్యాసం
రేఖల్లో గ్రాఫ్ లలో క్రాప్ హాలిడే
దవానహీ
భీమా దవాకేలియే వహ్వా
కౌటిల్యుని మించిన
గారడీగాళ్ళు
వడ్డించే హల్వాలో
హాలాహలం
మింగక తప్పట్లే


గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

మన తెలంగాణ
5
హైదరాబాద్
సోమవారం
12 ఫిబ్రవరి, 2018
www.manatelangana.news



చిన్నప్పడెప్పడో అమ్మ కొనిచ్చిన రూబిక్స్ క్యూబ్‌ని టైమ్‌పాస్ ఆట వస్తువుగా కాకుండా టైమ్‌తో పోటీపడే ఆటలా సాధన చేశాడు. ప్రస్తుతం ఇప్పటి తరానికి తెలిసిన ఆటలంటే... క్రికెట్... టెన్నిస్... హాకీ...చెస్..ఇలా చటుక్కున కొన్ని చెప్పేస్తాం!! కానీ భీమవరానికి చెందిన వంశీ నా రూటే సెపరేటు అంటూ "రూబిక్స్ క్యూబ్"ని పట్టుకున్నాడు. అది మొదలు.. అది తన వేళ్లలో భాగమై.. మెదడుతో మమేకమైపోయింది! అంతే ..గిన్నిస్ రికార్డులన్నీ తన సొంతం చేసుకుంటున్నాడు.

రాజు రూటే రూబిక్స్


వంశీ కృష్ణంరాజు









మనం ఏ రంగాన్ని ఎంచుకున్నాగాని దానిని మనస్ఫూర్తిగానే ఎంచుకుంటాం..అలాంటప్పుడు ఎటువంటి భయం ఉండదు ..అటువంటి చోటనే వంద శాతం మన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాం. వంశీ కృష్ణంరాజు కూడా సరిగ్గా ఇలాగే తనకు నచ్చిన రంగాన్నే ఎంచుకున్నారు. ఆ ఇష్టానికి మరింత శ్రమను జోడించారు అంతే.. ఊహకందనంత అద్భుతాలను సృష్టిస్తున్నారు.
కొన్ని గేమ్స్ వల్ల ఫిజికల్ గా బెనిఫిట్స్ ఉంటే, రూబిక్స్ క్యూబ్ వల్ల మన ఆలోచనలకు బెనిఫిట్ ఉంటుందనంటారు. ఫిజికల్ గా శ్రమపడడం ఎంత కష్టమో రూబిక్స్ క్యూబ్ లాంటి గేమ్స్ ఆడడం అంతకన్నా కష్టం. ఈ ఆటతో వంశీ కృష్ణ ఓ ఆట ఆడుకుంటున్నాడు. ప్రపంచవ్యాప్తంగా ఇంతవరకు కొంత టైం వ్యవధి పెట్టుకుని విజయాలను, రికార్డులను నెలకొల్పిన వారిని చూస్తున్నాం. వంశీ అంతకు మించి నీటిలో రూబిక్స్ క్యూబ్ ని సాల్వ్ చేయడం, కళ్ళకు గంతలు కట్టుకుని పరిష్కరించడం, ఒంటి చేత్తో జోడించడం లాంటివి.., 24 గంటల పాటు ఏ విరామం లేకుండా సాల్వ్ చేయడం.. ఇలాంటి రకరకాలైన పద్ధతుల్లో అద్భుతాలను సృష్టిస్తూ గిన్నిస్ బుక్‌లో సైతం రెండు సార్లు స్థానం సంపాదించుకున్నాడు.
నిజానికి ప్రతీది మన జీవితంలోకి కాకతాళీయంగానే వస్తుంది కాని అది మనల్ని ఏ విధంగా ప్రభావితం చేసిం దాన్ని బట్టే దానితో మన ప్రయాణం ఆధారపడి ఉంటుంది. ఎప్పుడో చిన్నతనంలో భీమవరంలో మొదటిసారి జాతరలో కొనుక్కున్న క్యూబ్ వల్ల నెమ్మదిగా దానిని సాల్వ్ చెయ్యాలన్న కసి పెరిగింది. సాల్వ్ చేస్తున్న కొద్దీ ఆ విజయం హాబీగా మారిపోయింది. ఆ విజయాన్ని ప్రత్యేకంగా పొందాలి అనే తపనలో ఇలా రకరకాల స్టైల్ లో సాల్వ్ చేయడం మొదలు పెట్టాడు.

రూబిక్ రాజు పొందిన రికార్డులు:

* ఒకే చక్రంతో నడిచే యూనిసైకిల్ మీద ప్రయాణం చేస్తూ గంట ముప్పై నిమిషాల సమయంలో రూబిక్స్ క్యూబ్ ని 165 సార్లు సాల్వ్ చేశాడు.
* 2014లో 24గంటల్లో 2176 సార్లు రూబిక్స్ క్యూబ్ సాల్వ్ చేసి మొదటి గిన్నిస్ రికార్డ్‌ను వంశీ కృష్ణంరాజు అందుకున్నాడు.
* 2017లో అక్టోబర్ 19న బంగళూరులోని ప్రపంచ క్యూబ్ అసోసియేషన్ నిర్వహించిన "ఫాస్టెస్ట్ టైం టు సాల్వ్‌డ్ ఏ సోమా క్యూబ్" పోటీల్లో ప్రపంచ రికార్డును పొందాడు.
* అదేరోజు అన్నిటి కన్నా కష్ట తరంగా నీటిలో మునిగి, ఊపిరి తీసుకోకుండా కేవలం 53 సెకండ్లలోనే రూబిక్స్ క్యూబ్ సాల్వ్ చేసాడు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ తో పాటు రెండు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అందుకొని మరి కొన్ని గిన్నిస్ రికార్డ్స్ అందుకునే వేటలో నిమగ్నమయ్యాడు వంశీ.

మీ జీవితం.. మీ చేతుల్లోనే!!

2018 సంవత్సరంలో మీరు కొత్త జీవితాన్ని మొదలు పెట్టాలనుకుంటున్నారా అయితే దాని కోసం ఎలాంటి కోర్సులు చెయ్యాలో ఆలోచిస్తున్నారా? ఆఫీసుల్లో కంప్యూటర్ల ముందు గంటల కొద్ది కూర్చుని పనిచేసే ఉద్యోగాలు బోర్ కొట్టేస్తే.. ఏదైనా కొత్త వ్యాపారం చెయ్యడానికి ప్రయాత్నించండి. ఉద్యోగాల కంటే వ్యక్తిగత వ్యాపారాలు చేయడం ద్వారా ఎంతో లాభదాయకం. మీరు ఎంచుకున్న రంగంలో ఎలా మీ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలనేది తెలుసుకుందాం....



* విజయాన్ని అందుకునేందుకు వృత్తిపరమైన, ఉద్యోగ అవకాశాల కోసం అన్వేషించండి. సహోద్యోగుల సలహాలు తీసుకోండి. స్నేహితుల సూచనలు తీసుకోవచ్చు. వృత్తి, పరిశ్రమ, ఉద్యోగం కోసం పెట్టుబడి ఎంత మేరకు పెట్టాలో నిర్ణయించుకోండి. ఉద్యోగావకాశాలు, విద్యావకాశాలపై కూడా పరిశోధన చేయండి. వృత్తి, ఉద్యోగాలపై జరిగే సెమినార్లకు హాజరైతే మంచి ఆలోచనలు లభిస్తాయి.
* మాటల్లో స్వచ్ఛత ఉండేలా చూసుకోవాలి. సోషల్ మీడియా, టీవీల్లో వచ్చే ప్రకటనల పట్ల జాగ్రత్త వహించండి. ఆచితూచి అడుగేయడం అవసరం. కెరీర్‌కు దోహదపడే పాఠ్యాంశాలను ఎంచుకోవడం మంచిది. కోర్సుల కోసం నెట్లో శోధించి తెలుసుకోండి. ఉద్యోగం చేస్తూనే కెరీర్ వృద్ధి కోసం కొన్ని టెక్నికల్ కోర్సులు చదవడం చేయొచ్చు.
* ఉద్యోగ సమాచారం కోసం ఇప్పుడు అన్ని విషయాలు ఇంటర్‌నెట్‌లో లభిస్తున్నాయి. కనుక ఇంటర్‌నెట్‌లో చూసి నిర్ణయాలు తీసుకోండి. మీరు ఎంచుకున్న వ్యాపారంపై పూర్తి అవగాహన తెచ్చుకోవాలి. అందుకు పక్కాగా ప్రణళికలు తయారుచేసుకోవాలి.
* లక్ష్యాన్ని ఛేదించేందుకు లోతుగా పరిశోధన చేయండి. చేసే పనిని ఆసక్తితో చేయండి. విశ్రాంతి తీసుకుంటూ మెదడుకు పనిచెప్పండి. ఆలోచనల ద్వారా లక్ష్యం మీ చేతుల వద్దకు వచ్చేలా చేయండి. లక్ష్యం గురించి 24 గంటలూ ఆలోచించకుండా 15 నిమిషాలు ఆలోచించినా కార్యాచరణకు తగిన అంశాలుండేలా చూసుకోవాలి.
* కెరీర్‌లో రాణించేందుకు కొత్త వ్యక్తులతో పరిచయాలు కూడా అవకాశాలను అందుకునేందుకు సహాయపడతాయి. మీరు కొత్తగా చేసే వ్యాపారంకాని , విద్యకి సంబంధించిన ప్రాక్టిస్‌లు చేయడం వంటి వాటిని క్యాలెండర్‌లో గుర్తుంచుకోండి. వాటిపై టిక్ చేసుకోవడం ద్వారా మీ లక్ష్యం చేరుకుంటారు.

సోషల్ మీడియాతో సమస్యలకు చెక్..



లీడర్ అంటే తెల్లని బట్టలు వేసుకొని, పెద్దకారులో తిరుగుతూ ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఉంటారనే అపోహలను పటాపంచలు చేస్తున్నారు కొంతమంది నాయకులు. ప్రస్తుత రాజకీయ నాయకులు సోషల్‌మీడియా ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఒకప్పుడు మన సమస్యలు వారితో చెప్పుకోవాల్సి వస్తే వారి ఆఫీసు వైపు నెలలపాటు తిరగాల్సి వస్తుండేది. కాని ప్రస్తుతం వారందరు సోషల్‌మీడియాతో ప్రజల సమస్యలను తెలుసుకొంటున్నారు. వెంటనే సంబంధిత అధికారులను మన దగ్గరకి పంపించి, సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఈ విషయంలో మన ప్రధాన మంత్రి తరువాత తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కె. తారకరామారావు ఉన్నాడు. స్వల్పకాలంలోనే సుపరిచితుడైన మంచి నాయకుడిగా తన ట్విట్టర్ ఖాతాలో మరో విశిష్ట రికార్డును సాధించాడు. అధికారులకు, పార్టీ నేతలకు, కార్పొరేట్ ప్రతినిధులకు, అన్నింటికీ మించి సామాన్యులకు అందుబాటులో ఉండేందుకు.. వేదికగా ఎంచుకున్న ట్విట్టర్ ఖాతా మిలియన్ మైలురాయిని అధిగమించింది. కేటీఆర్ ట్విట్టర్ అకౌంట్ ఫాలోవర్ల సంఖ్య శుక్రవారం నాటికి పది లక్షలు దాటింది. మంత్రులు, ముఖ్య మంత్రులు, అంతర్జాతీయస్థాయి సంస్థల అధినేతలు, సినీనటులు, వివిధ రంగాల ప్రముఖులు, మరెందరో సామాన్యులు కేటీఆర్ ఫాలోవర్ల జాబితాలో ఉన్నారు. ప్రాంతీయ నేతకు అతితక్కువ కాలంలో ఇంతమంది ఫాలోవర్లు లభించడం ఆయకే సాధ్యమైంది. ఈ సందర్భంగా ఆయన తన ట్విట్టర్ ఫాలోవర్లకు మిలియన్ థ్యాంక్స్ చెప్పారు. రెండేళ్ల క్రితం ఆయన ట్విట్టర్ ఫాలోవర్ల సంఖ్య కేవలం యాభై వేలే. ప్రస్తుతం ఆ సంఖ్య పది లక్షలకు చేరడం కేటీఆర్ పనితీరుకు నిదర్శనం. తన పరిధిలోని శాఖలకు సంబంధించిన సమాచారం తెలియజెప్పడమే కాకుండా, ఇతరశాఖల్లోని ఆసక్తికరమైన అంశాలను సైతం పంచుకొంటున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం, తన పరిధి కాకపోతే వాటిని ఇతరులకు చేరవేయడం వంటివి మంత్రి కేటీఆర్ ప్రత్యేకతలు. ఆపదలో ఉన్నవారు ఎవరైనా, ఎక్కడి నుంచైనా ఆయనకు ఒక్కట్వీట్ చేస్తే చాలు.. సమస్య పరిష్కారమైపోతున్నది. ఒకవేళ తాను బిజీగా ఉంటే.. ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేకంగా ఆన్‌లైన్లోనే కేటీఆర్ ఆఫీస్ పేరుతో ఒక ట్విట్టర్ హ్యాండిల్‌ను ఏర్పాటుచేశారు. ఆయన ద్వారా సహాయం పొందినవారిలో కేవలం తెలంగాణవారే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలవారు కూడా ఉండటం విశేషం.

లీటర్ పెట్రోల్‌తో 410 కిలోమీటర్ల ప్రయాణం



ఒక లీటర్ పెట్రోల్‌తోనే ఈ బైక్ ఎంత మైలేజ్ ఇస్తుందో తెలుసా? ఇప్పటికే రోజు రోజుకి పెరుగుతున్న ధరలు, దానికి తోడు ఇంధన కొరతతో అల్లాడుతున్న ప్రపంచానికి ఓ మార్గాన్ని చూపించాడు కర్ణాటకకు చెందిన ఓ కుర్రాడు. ఈయన తయారు చేసిన బైక్‌లో 1 లీటర్ పెట్రోల్ పోస్తే ఇది ఏకంగా 410 కిలో మీటర్లు ప్రయాణిస్తుందంటున్నాడు. సాధారణంగా మనం వాడే బైక్స్ 50 నుండి 70 కిలోమీటర్ల వరకు వెళ్తాయి. కాని కర్ణాటక లోని ఒక మెకానికల్ ఇంజనీరింగ్ స్టూడెంట్ ఉమేష్. తను తయారు చేసిన బైక్ IC టెక్నాలజీ, ఇంజన్, రెండు బ్యాటరీలు, గేర్ బాక్స్, DC మోటర్ ఆధారంగా(ఇంజనీరింగ్ డిజైన్ ప్రక్రియ పద్ధతుల కలిపి 40 వేల వ్యయంతో) దీనిని రూపొందించాడు. సాధారణ బైక్‌లో 1 లీటర్ పెట్రోల్ పోస్తే అవి 70 కిలోమీటర్లు వరకు వెళ్లవచ్చు కాని ఉమేష్ తయారు చేసిన బైక్ మాత్రం 410 వరకు వెళ్లవచ్చని వెల్లడిస్తున్నాడు. భవిష్యత్తులో ఇంధన కొరతను నివారించడానికి ఈ బైక్ ఉపయోగపడుతుందని పేర్కొన్నాడు.

నయా గాడ్జెట్స్

స్మార్ట్ వాలెట్



కొన్ని సందర్భాలలో వాలెట్ మర్చిపోవడం అందరికీ అనుభవమే. పోయిన వస్తువు తిరిగి రావడం అనేది అసాధ్యం. ఇలా ఆఫీసు, హోటళ్లు లాంటి ప్రదేశాల్లో వాలెట్‌లను మర్చిపోతే..అనే సమస్యకు పరిష్కారంగా వయోగర్ స్మార్ట్ వాలెట్ అందుబాటులోకి వచ్చింది. బ్లూటూత్ ద్వారా ఫోన్‌కు కనెక్ట్ చేసుకోవచ్చు. ఎప్పుడైనా సరే పర్సు మర్చిపోయి, కొన్ని అడుగుల దూరం వెళ్లినప్పుడు ఫోన్‌కు నోటిఫికేషన్ వస్తుంది. మనం వెంటనే అలెర్ట్ అయ్యి వెనక్కు వెళ్లి వాలెట్‌ను తీసుకోవచ్చు. అంతేకాకుండా ఫోన్ ఎక్కడ పెట్టామో మర్చిపోయినా, కనిపించకపోయినా ఈ వాలెట్‌లోని బటన్‌ను నొక్కితే అది రింగ్ అవుతుంది. దాంతో ఫోన్ ఎక్కడుందో తెలుసుకోవడం సులభం. మొబైల్‌ను మన ఎదురుగా ఉంచి వాలెట్‌లోని బటన్‌ను నొక్కి సెల్ఫీ తీసుకునే సదుపాయం ఉంది. ధర రూ. 3,699.cuirally.comలో ఆర్డరిచ్చి తెప్పించుకోవచ్చు.



మెడనొప్పికి అలెక్స్


స్మార్ట్‌ఫోన్, లాప్‌టాప్, డెస్క్‌టాప్‌లను గంటలకొద్దీ వాడటం వల్ల చాలా మందికి మెడ నొప్పి, వెన్నునొపి అనేవి సర్వసాధారణంగా మారింది. మెడను సరిగ్గా వంచనప్పుడే ఇలాంటి సమస్యల బారిన పడుతుంటారు. అలెక్స్ అనే పరికరాన్ని మెడపై ధరిస్తే సరి. యాప్, వైఫైతో దీన్ని స్మార్ట్ ఫోన్‌కు అనుసంధానించవచ్చు. మనం సిస్టమ్‌ను ఉపయోగించి పనిచేస్తున్నప్పుడు మెడను ఎలా వంచాలో ఈ పరికరం చూపిస్తుంది. ఎన్ని గంటలు మెడను ఒకే కోణంలో ఉంచామో చెబుతుంది. మెడను వంచే విధానం, కూర్చునే పద్ధతి సరిగ్గా లేనప్పుడు వైబ్రేషన్స్ ద్వారా సరిచేస్తుంది.



స్మెల్ స్పీకర్

మనసుకు నచ్చే సంగీతం హాయినిస్తుంది. అందులో స్పీకర్ల నుంచి వినబడే మ్యూజిక్ డాన్స్ ఆడించక మానదు. అలాంటిది స్పీకర్ల నుంచి సువాసనలు వెదజల్లితే మరింత మజా వస్తుంది. సైరనో అనే స్మెల్ స్పీకర్లు సవాసనలు వెదజల్లుతాయి. పాటలకు అనుగుణంగా ఏకంగా 12 రకాల పరిమళాలను అందిస్తాయి. హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన డేవిడ్ ఎడ్వర్డ్స్ అనే గాడ్జెట్ నిపుణుడు, ఔత్సాహిక వ్యాపారవేత్త ఈ కొత్త పరికరాన్ని రూపొందించాడు. స్మార్ట్‌ఫోన్‌తో కూడా దీన్ని ఆపరేట్ చేయొచ్చు. ధర పదివేల రూపాయలు.

వలస కార్మికుల హక్కుల రక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలి



మన తెలంగాణ / హైదరాబాద్ : వలస కార్మికుల హక్కుల రక్షణ, సంక్షేమానికి అన్ని ప్రభుత్వాలూ కృషి చేయాలని తెలంగాణ ప్రవాసీ సంక్షేమ వేదిక (తెలంగాణ ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరమ్) తరపున మాజీ ఐఎఫ్ఎస్ అధికారి, దౌత్యవేత్త డాక్టర్ బి.ఎం. వినోద్ కుమార్ కోరారు. 'ప్రపంచ వలసల సమగ్ర విధాన ప్రక్రియ' అనే అంశంపై ఐక్యరాజ్య సమితి రూపొందించిన తుది ముసాయిదాపై చర్చిండానికి ఈ నెల 11,12న ఫిలిప్పీన్ దేశ రాజధాని మనీలాలో జరుగుతున్న ఆసియా ప్రాంతీయ సదస్సులో డాక్టర్ బి.ఎం. వినోద్ కుమార్ పాల్గొన్నారు. భారతీయ వలస కార్మికులు, కార్మిక సంఘాలు, సామాజిక సంస్థల అభిప్రాయాలను డాక్టర్ వినోద్ కుమార్ ఆదివారం సదస్సులో వివరించారు. నల్లగొండ జిల్లాకు చెందిన వృత్తిరీత్యా వైద్యులైన డాక్టర్ బి.ఎం.వినోద్ కుమార్ ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)లో 1986 లో చేరారు. భారత విదేశాంగ శాఖలో వివి ధ హోదాలలో ఆయన పనిచేసి 2015 లో పదవీ విరమణ పొందారు. 1995 – 96లో హైదరాబాద్ పాస్ పోర్ట్ అధికారిగా, 2010 – 12లో ఢి ల్లీలోని విదేశాంగ శాఖలో సంయుక్త కార్యదర్శిగా ఆయన భాద్యతలు ని ర్వర్తించారు. జర్మనీ, అల్జీరియా, మలేసియా, ఉజ్బేకిస్తాన్, అజర్ బైజాన్ దేశాలలోని భారత రాయబార కార్యాలయాల్లో వివిధ హోదాలలో పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ప్రవాస భారతీయుల అధ్యక్షులుగా సేవలందిస్తున్నారు.





ఓవర్సీస్ ఎటిఎంకు నిప్పు

17 పేజీల నోట్‌ను వదిలివెళ్లిన అగంతకుడు

మన తెలంగాణ/ హైదరాబాద్: కూకట్‌పల్లి కెపిహెచ్‌బికాలనీలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఎటిఎంను గుర్తు తెలియని వ్యక్తి తగులబెట్టాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి 7 గంటలకు చోటు చేసుకుంది. అనంతరం అదే ఎటిఎం దగ్గర ప్రపంచంలో మానవ సమస్యలపై సలహాలు సూచనలతో కూడిన 17 పేజీల నోట్ విడిచి వెళ్లాడు. అంతేకాదు ఆ నోట్‌లోని విషయాలను మీడియా ప్రచురించక పోతే ఆత్మహత్యకు పాల్పడుతానని బెదిరింపు లేఖ కూడా రాసి పెట్టాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. ఎటిఎంలో నుంచి పెద్ద ఎత్తున మంటలు రావడంతో అటుగా వెళ్తున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా అప్పటికే మంటల్లో ఎటిఎం కాలిపోయింది. ఎటిఎంలో సుమారు రూ. 70 వేలు ఉన్నట్లు సమాచారం. శనివారం సాయంత్రమే ఎటిఎంలో డబ్బులు పెట్టినట్లు ఓవర్సీస్ బ్యాంకు అధికారులు తెలిపారు. అయితే ఈ ఘటనకు పాల్పడింది ఎవరు, నోట్‌లో ఏముంది, నగరానికి చెందిన వ్యక్తే చేశాడా, అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న సిసి కెమెరాల ఫుటేజీలని సేకరించిన పోలీసులు విచారణ ప్రారంభించారు.

గొల్ల, కురుమలకు అండగా ప్రభుత్వం

మన తెలంగాణ/ హైదరాబాద్ : గత ప్రభుత్వాలు గొల్ల, కురుమలను పట్టించుకోలేదని, రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేసి అండగా నిలుస్తుందని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎంఎల్‌ఎ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన గొల్ల, కురుమ సంఘాల ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఏప్రిల్ నెలలో నిర్వహించే బారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

పత్తాలేని పర్యాటక విధానం

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రం ఏర్పడి మూడున్నరేళ్లు గడుస్తున్నా పర్యాటక పాలసీపై స్పష్టత లేదు. పర్యాటక పరిశ్రమ భాగస్వాములతో పలు మార్లు చర్చించి, ముసాయిదా పాలసీని రూపొందించి రెండేళ్ల క్రితమే ముఖ్యమంత్రి దగ్గరకు పంపినా ఇంకా ఆమోద ముద్ర పడలేదు. ప్లెజర్ టూరిజం, బిజినెస్ టూరిజం, నేచర్ టూరిజం, కల్చరల్ టూరిజం, సోషల్ టూరిజం, రిక్రియేషన్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం, మెడికల్,హెల్త్ టూరిజం, రెలిజియస్ టూరిజం, వైల్డ్ టూరిజం, ఆధ్యాత్మిక తదితర కోణాలున్న పర్యాటకాన్ని వినూత్నమైన పాలసీతో కొత్త పుంతలు తొక్కించవచ్చని అందరూ భావించారు. ముసాయిదాలో పర్యాటక కేంద్రాల సంఖ్యను పెంచాలని, తెలంగాణ చరిత్రకు అద్దంపట్టే గడీలు, కోటలను వినియోగించుకోవాలని సూచించారు. రాచకొండ, దోమకొండ, భువనగిరి, ఖమ్మం, ఎలగందల, జగిత్యాల, నగునూరు, మెదక్, రామగిరి కోట లాంటి చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలకు విదేశీ పర్యాటకులను ఆకర్శించేలా ప్రత్యేక కసరత్తు చేయాలని ప్రతిపాదించారు. కొత్తగా స్టార్ హోటళ్లు, రిసార్టులు, హెరిటేజ్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, మోటళ్లు, టెంట్లతో రూములు, అమ్యూజ్‌మెంట్ పార్కులు, థీమ్ పార్కులు, టూరిజం శిక్షణ కేంద్రాలు, వాటర్, అడ్వెంచర్ స్పోర్ట్స్ యూనిట్లకు రాయితీలు ఇవ్వాలని పర్యాటక శాఖ ఆ ముసాయిదాలో ప్రతిపాదించింది. ప్రభుత్వ స్థలాల కేటాయింపుతో పాటు 15 నుంచి 20 శాతం పెట్టుబడి సాయం అందించాలని, మెగా టూరిజం పార్కులకు స్టాంపు డ్యూటీ మాఫీ చేయాలని సిఫార్సు చేశారు. విద్యుత్ చార్జీల్లో సగం రాయితీ, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో టూరిజం యూనిట్లు నెలకొల్పేందుకు మరిన్ని ప్రోత్సాహకాలు ఇవ్వాలని ఈ ముసాయిదాలో పొందుపరిచారు. సిఎం ఆమోదం కోసమే ఎదురుచూపులు.

మాస్కోలో విమాన ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. కాగా, ఇందులో ప్రయాణిస్తున్న 71 మంది ప్రాణాలతో ఉండే అవకాశం లేదని రష్యన్ ఎమర్జెన్సీ సర్వీసెస్ పేర్కొంది. విమానం కూలిపోయిన స్థలంలో శకలాలు చాలా దూరం వరకు పడిపోయాయని కూడా తెలిపింది. ఏడేళ్ల క్రితం ఈ విమానాన్ని రష్యా తయారు చేసింది. ఏడాది క్రితం దీన్ని రష్యన్ ఎయిర్‌లైన్స్ కంపెనీ నుంచి సరటోవ్ ఎయిర్‌లైన్స్ కొనుగోలు చేసింది. అత్యవసర సహాయ బృందం రోడ్డు మార్గం ద్వారా ఘటనాస్థలికి చేరుకోవడానికి వీలుకాకపోవడంతో, కాలినడకన అక్కడికి వెళ్లారు. విమానం టేకాఫ్ తీసుకున్న రెండు నిమిషాలకే రాడార్ నుండి సంబంధాలు తెగిపోయాయని, ఆకాశంలో విమానం అదృశ్యమైందని డెమోడిడోవో విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. విమాన దుర్ఘటనకు మానవ తప్పిదం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు వంటి అనేక కారణాలు ఉండే అవకాశముందని రవాణా శాఖ మంత్రి తెలిపారు. ఘటనపై దర్యాప్తు ప్రారంభమైంది.

విధ్వంసానికి తోడు కావొద్దు

(మొదటిపేజీ తరువాయి)

కాక 125 కోట్ల భారతీయులకు గర్వకారణం' అని మోడీ అన్నారు. దుబాయ్ ప్రభుత్వం సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించడాన్ని ఆయన కొనియాడారు. ఎడారి ప్రాంతాన్ని మార్చేసిందని చెప్పారు. ఇదో అద్భుతం, ప్రపంచానికి గల్ఫ్ ఎమిరేట్స్ ఉదాహరణ అన్నారు. జనాభా వృద్ధి అత్యధికంగా పెరిగినప్పటికీ ప్రపంచ జనాభాలో 9.5 శాతం మంది ఇంకా దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారని పేర్కొన్నారు. 'నేడు పేదరికం, నిరుద్యోగం, విద్య, ఇళ్లు, మానవ ఉపద్రవాళ్లు సవాలుగా నిలిచాయి' అన్నారు. ' అభివృద్ధి ద్వారానే ఈ సమస్యలన్నింటినీ అధిగమించగలం. అందుకనే నా ప్రభుత్వం సాంకేతిక వినయోగంపై పనిచేస్తోంది' అని వివరించారు. తమ ప్రభుత్వం మంత్రం 'సబ్‌కే సాత్, సబ్‌కా వికాస్' అన్నారు. 125 కోట్ల మందికి సాధికారతను కల్పించే కీలక రంగాలపై భారత్ దృష్టిసారించిందన్నారు. గత 25 ఏళ్ల కాలంలో భారత్‌లో ప్రసూతి మరణాలు మూడు రెట్లు తగ్గిందన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా చూసినప్పుడు సగం అన్నారు. భారత ఉపగ్రహ కార్యక్రమాన్ని ఆయన కొనియాడారు. అంగారక గ్రహ కక్ష్య కార్యక్రమానికి కిలో మీటరుకు వ్యయం కేవలం రూ. 7 అయిందన్నారు. భారత్‌లో ట్యాక్సీ కారు ఎక్కితే కిలోమీటరుకు రూ. 10 అవుతుందని పోల్చారు. భారత్‌లో 65 శాతం జనాభా యువతేనని, వారంతా 35 ఏళ్లలోపువారేనని, సాంకేతిక విజ్ఞానం ద్వారా యువతకు సాధికారతను అందించడం ద్వారా నవభారత్‌ను సాధించాలన్నదే తమ దేశం స్వప్నమని చెప్పారు. టెక్నాలజీ ఆలోచన అంత వేగంగా మారుతోందన్నారు. ప్రపంచ మార్పులో కూడా సాంకేతికత పెద్ద మాధ్యమంగా మారిందన్నారు. 'మేము ఆరు ఆర్స్ అనుసరిస్తున్నాం. అవి రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్, రీకవర్, రీడిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చర్' అని వివరించారు. దీనికి ప్రేక్షకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఆచరణలో ఆర్‌టిసికి మొండిచెయ్యి

• బడ్జెట్‌లో ఆర్‌టిసికి కేటాయిస్తున్న నిధులలో సగం కూడా విడుదల చేయడం లేదు • గత మూడేళ్లుగా ఇదే తంతు

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రజా రవాణ వ్యవస్థ 'తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (టిఎస్‌ఆర్‌టిసి)ను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో మొండి చెయ్యి చూపుతోంది. గత మూడేళ్లుగా ప్రభుత్వం బడ్జెట్‌లో ఆర్‌టిసికి కేటాయిస్తున్న నిధులలో సగం కూడా విడుదల చేయడం లేదు. ప్రస్తుత ఆర్థిక ఏడాది 2017 –18 బడ్జెట్‌లో ప్రభుత్వం ఆర్‌టిసికి రూ.994 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు (జనవరి వరకు) రూ.325 కోట్లను మాత్రమే విడుదల చేసింది. బస్ పాస్‌ల రాయితీకి కేటాయించిన రూ.520 కోట్లలో రూ140 కోట్లను, కొత్త బస్సుల కొనుగోలుకు కేటాయించిన రూ.140 కోట్లలో కేవలం రూ.40 కోట్లను, ప్రభుత్వ గ్యారెంటీ రుణాలను తిరిగి చెల్లించేందుకు రూ.357 కోట్లలో కేవలం రూ.145 కోట్లను మాత్రమే విడుదల చేసింది. వివిధ వర్గాలకు కల్పిస్తున్న రాయితీ బస్ పాస్‌ల కోసం చెల్లించే నిధులను కూడా ప్రతి నెలా చెల్లించకుండా 3 లేదా 6 నెలలకో సారి రూ.100 కోట్లు, రూ.150 కోట్లను విదుల్చుతోందని ఆర్‌టిసివర్గాలు అంటున్నాయి. పట్టణ రవాణ రవాణా వ్యవస్థలో నష్టాలే వస్తాయని హైదరాబాద్‌లో నడిపే బస్సులపై వచ్చే నష్టాన్ని జిహెచ్‌ఎంసి భరించే విధంగా సిఎం కెసిఆర్ చట్ట సవరణ చేసినా ఆచరణలో ప్రయోజనం లేకుండా పోయింది. గత ఏడాది సిఎం సమక్షంలో ఆర్భాటంగా రూ.197 కోట్ల చెక్కును ఇచ్చిన జిహెచ్‌ఎంసి, హైదరాబాద్ అభివృద్ధి పనులకు నిధులు సరిపోవడం లేదని, ఆర్‌టిసి నష్టాలను తాము భరించలేమని ఇచ్చిన చెక్కును వెనక్కు తీసుకుని మొండి చెయ్యి చూపింది. ఆర్థిక సాయం కోసం ఆర్‌టిసి అధికారులు ప్రభుత్వం వద్ద చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. వచ్చే బడ్జెట్ (2018 19)లో చూద్దామనే సమాధానం ప్రభుత్వం నుంచి ఆర్‌టిసి అధికారులకు ఎదురైనట్లు సమాచారం.ప్రభుత్వ చేయూత కరవవడంతో ఆర్‌టిసి నష్టాల ఊబిలో కూరుకుపోతున్నది. ఇప్పటివరకు టిఎస్‌ఆర్‌టిసి దాదాపు రూ.2500 కోట్ల అప్పులతో కొట్టుమిట్టాడుతుండగా ప్రతి ఏటా సంస్థకు సుమారు రూ.400 కోట్ల నష్టం వాటిల్లుతున్నది. 2015 నుంచి 2018 జనవరి వరకు మూడు ఏళ్లకు దాదాపు రూ.1600 కోట్ల నష్టాలు వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.410 కోట్ల నష్టాన్ని సంస్థ చవిచూసింది.



బడ్జెట్‌లో ఆర్‌టిసికి నిధుల కేటాయింపు, విడుదల వివరాలు

ఆర్థిక సంవత్సరం	నిధుల కేటాయింపు	నిధుల విడుదల
2015-16	రూ. 400 కోట్లు	రూ. 211 కోట్లు
2016-17	రూ. 633 కోట్లు	రూ. 275 కోట్లు
2017-18(జనవరి)	రూ. 994 కోట్లు	రూ. 325 కోట్లు

రూ.1500 కోట్లివ్వండి

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆర్‌టిసిని ఉదారంగా ఆదుకునేందుకు 2018 –19 బడ్జెట్‌లో రూ.1500 కోట్లను కేటాయించాలని, ఆర్‌టిసిపై పడుతున్న రూ. 200 కోట్ల మోటారు వాహనాల పన్ను, రూ.320 కోట్ల డీజిల్‌పై అమ్మకపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆర్‌టిసి వర్గాలు కోరుతున్నాయి. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వంలోని పెద్దల మెహర్బానీల కోసం ఆదాయం లేని, మారు మూల గ్రామాలకు, తండాలకు కూడా నడుపుతున్న పల్లె వెలుగు, పల్లె వెలుగు మినీ బస్సుల భారాన్ని ప్రభుత్వమే భరించాలని ఆర్టీసీ యాజమాన్యాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

పదోన్నతులలో బిసిలకు రిజర్వేషన్లు

• మంత్రి జోగు రామన్న



మన తెలంగాణ/ హైదరాబాద్: బిసి ఉద్యోగులకు పదోన్నుతలలో రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని బిసి సంక్షేమ శాఖ మంత్రి జోగురామన్న అన్నారు. ఇతర ఉద్యోగ సంఘాలమాదిరిగా బిసి ఉద్యోగ సంఘాలకు, ఉపాధ్యాయ సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఫ్యాప్సీ ఆడిటోరియంలో ఆదివారం ''బిసి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మహాసభ'' జరిగింది. ఈ సభకు మంత్రి జోగురామన్న ముఖ్య అతిథిగా హాజరుకాగా ఎంపి బండారు దత్తాత్రేయ, పిసిసి మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, బిసి కమిషన చైర్మన్ బి.ఎస్. రాములు, జస్టిస్ ఈశ్వరయ్య, బిసి కమిషన్ రాష్ట్ర సభ్యులు వి.కృష్ణమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోగురామన్న మాట్లాడుతూ విద్య, సామాజిక, ఆర్థిక రాజకీయ రంగాలలో బిసిలకు సమాన వాటా దక్కాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదన్నారు. బిసిలపై పలు అంశాలపై చర్చించి రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి కెసిఆర్‌కు అందజేశామని చెప్పారు. పారిశ్రామిక విధానంలో బిసిలకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు వీలుగా బిక్కి అనే సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పునరుద్ఘాటించారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ఎవరెన్ని అడ్డంకులను సృష్టించినా పార్లమెంట్ సమావేశాల్లో బిసి కమిషన్ బిల్లు ఆమోదం పొందుతుందన్నారు. బిసి ప్రధాన డిమాండ్లపై బిసి ఉద్యోగుల మార్చి నెలలో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తో సమావేశాన్ని ఏర్పాటు చేయిస్తామన్నారు. పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ పదోన్నతులలో రిజర్వేషన్ల విషయంలో జాతీయ స్థాయిలో మద్దతునిస్తుందన్నారు. అన్ని పార్టీలు బిసి రాజకీయ పాలసీని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ మాట్లాడుతూ బిసి డిమాండ్లపై తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్ర బిసి కమిషన్ బి.ఎస్.రాములు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల పెంపుపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. బిసి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుంకరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్, నేతలు ఇ.నిరంజన్, కుల్కచర్ల శ్రీనివాస్, దుర్గయ్య, వినోద్ పాల్గొన్నారు.

రుణమాఫీని పూర్తి చేయండి

మంత్రి పోచారంను కోరిన ఎంఎల్‌ఎ సండ్ర వెంకటవీరయ్య



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా 'పంట రుణం మాఫీ' పథకం కింద లబ్ధి పొందని రైతుల జాబితా ఇస్తే మాఫీ చేస్తామని సిఎం కె.చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ వేదికగా ప్రకటన చేశారని, ఆ హామీని వెంటనే నెరవేర్చాలని టిడిపి ఎంఎల్‌ఎ సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. గడిచిన అసెంబ్లీ సమావేశాల్లో రుణమాఫీపై చర్చ సందర్భంగా సిఎం మాఫీ కాని రుణాలు, వడ్డీ భారం సంబంధిత రైతుల జాబితా ఇస్తే పరిష్కరిస్తామని చెప్పారని, ఇప్పటికీ ఆదిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని సండ్ర గుర్తు చేశారు. ఉమ్మడి ఖమ్మం, మెదక్, వరంగల్, నిజామాబాద్ జిల్లాలో గ్రామీణ వికాస్ బ్యాంక్ ద్వారా రుణాల రీ షెడ్యూల్‌తో రుణమాఫీ కాలేదని, ఖమ్మంలో 20 వేల మందికి రూ. 107 కోట్లు మాఫీ కావాల్సి ఉందన్నారు. అందుకు సంబంధించిన దరఖాస్తులు స్పీకర్ మధుసూదనాచారికి ఇచ్చినట్లు తెలిపారు. త్వరగా రుణంతో పాటు వడ్డీని కూడా మాఫీ చేయాలని సండ్ర మంత్రి పోచారంను కోరారు.

ఉగ్రవేట



(మొదటిపేజీ తరువాయి)

14 ఏళ్ల బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సైనిక వర్గాలు తెలిపాయి. ఆదివారం ఉదయం జైషే ఇ మహ్మద్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు ఆఫీసర్ల క్వార్టర్స్‌లోకి ప్రవేశించేందుకు యత్నించగా సత్వర స్పందన బృందం వెంటనే ప్రతిఘటించింది. ఇక్కడవున్న 150 ఇళ్ల నుంచి నివాసితులను సైన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించింది.

గాయాలతో ప్రసవించిన గర్భిణీ

ఉగ్రవాదుల దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ గర్భిణీ ఆసుపత్రిలో చిన్నారికి జన్మనిచ్చింది. రైఫిల్ మ్యాన్ నజీర్ అహ్మద్, ఆయన భార్య శనివారం జరిగిన ఈ దాడిలో గాయపడ్డారు. వెంటనే వారిని సమీపంలోని సత్వారీ మిలటరీ హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ ఆమె ప్రసవించినట్టు అధికారులు తెలిపారు. 'తీవ్రంగా గాయపడిన గర్భిణీ ప్రాణాన్ని కాపాడేందుకు ఆర్మీ వైద్యులు రాత్రంతా కష్టపడ్డారు. సిజేరియన్ ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీశారు' అని లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డల ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడించారు.

పోలీసులు, మిలటరీ దళాలకు ఆహారం అందిస్తున్న పౌరులు

ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో ఆపరేషన్‌ను కొనసాగిస్తున్న పోలీసులు, పారా మిలటరీ దళాలకు ఇక్కడి పౌరులు భోజనం, ఆహార పదార్థాలను అందిస్తున్నారు. సైనిక శిబిరం బయట ప్రధాన ద్వారం వద్ద శనివారం రాత్రి నుంచి పోలీసులు, పారా మిలటరీ దళాలకు ఇక్కడి వారు భోజనాలు, టీ, స్నాక్స్, మంచినీరు తదితరాలను పంపిణీ చేస్తూ సహకారాన్ని అందిస్తున్నారు. 'మా తరపు నుంచి మేం అందిస్తున్నది చాలా స్వల్పం. జాతిసేవలో మేమూ భాగస్వాములం కావాలనుకున్నాం. అందుకే పోలీసులు, పారా మిలటరీ దళాలకు ఆహార పదార్థాలు అందిస్తున్నాం' అని స్థానిక పౌరుడు సంజీవ్ మన్‌మోత్రా తెలిపారు. ఈ చర్య ద్వారా కశ్మీర్‌లో తప్పుదోవ పట్టిన యువతకు మంచి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నామని అన్నారు.

మార్చి 11 నుంచి 'ధరణి' వెబ్‌సైట్

(మొదటిపేజీ తరువాయి)

రావడంతో వెబ్‌సైట్ డిజైన్, తయారీతో పాటు మూడేళ్ళ పాటు నిర్వహణా బాధ్యతలను ప్రభుత్వం ఇప్పటికే ఈ సంస్థకు అప్పగించినట్లు తెలిసింది. మార్చి నెల 11వ తేదీన సిఎం కెసిఆర్ ఈ వెబ్‌సైట్‌ను లాంఛనంగా ప్రారంభించేందుకు వీలుగా కసరత్తు జరుగుతోంది. వెబ్‌సైట్ రూపకల్పన, మూడేళ్ల పాటు నిర్వహణ కోసం ప్రభుత్వం రూ. 116.05 కోట్ల మేరకు నిధులను కేటాయిస్తోంది. భూరికార్డుల ప్రక్షాళన తర్వాత లెక్కతేలిన భూముల వివరాలతో పాటు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోని వివరాలన్నీ ఈ వెబ్‌సైట్‌కు జోడించేలా రూపకల్పన జరుగుతోంది. వచ్చే నెల నుంచి అన్ని మండల రెవిన్యూ కార్యాలయాలు కూడా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలను నిర్వహించనున్నందున ఆ వివరాలను కూడా ఈ వెబ్‌సైట్ జోడించేలా రూపకల్పన జరుగుతోంది. ఒకేసారి రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, మండలాల తహసీల్దార్లు, అందులో పనిచేసే సుమారు 12 వేల మంది సిబ్బంది భూములకు సంబంధించిన లావాదేవీలు జరిపేందుకు, ఆన్‌లైన్ రికార్డులను వినియోగించేందుకు వీలుగా వెబ్‌సైట్ బ్యాండ్ విడ్త్‌ను, 'స్ట్రక్చర్'ను రూపొందించాల్సిందిగా ఐఎల్‌ఎఫ్‌సి సంస్థకు ప్రభుత్వ ఐటీఇఎస్ విభాగం స్పష్టం చేసింది. సిసిఎల్‌ఎలోని భూరికార్డుల డాటా, రిజిస్ట్రేషన్ విభాగంలోని డాటా, రెవిన్యూ శాఖలోని డాటా.. ఇలా భూములకు సంబంధించిన అన్ని వివరాలూ ఈ వెబ్‌సైట్‌తో అనుసంధానం కానున్నాయి. 'సమీకృత భూ రికార్డుల నిర్వహణ వ్యవస్థ'గా పనిచేసే ఈ వెబ్‌సైట్‌ను గచ్చిబౌలిలో ఐటీఈ అండ్ సి విభాగం ఆధ్వర్యంలోని స్టేట్ డాటా సెంటర్ సెర్వర్‌కు అనుసంధానమవుతుంది. కొత్త పట్టాదారు పాస్‌బుక్‌ల వివరాలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ లాంటి అప్‌డేట్స్ కూడా ఈ వెబ్‌సైట్‌కు అనుసంధానంగా ఉంటాయి. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా భూరికార్డులను తెలుసుకోడానికి, మార్పులు చేర్పుల కోసం విజ్ఞప్తి చేసుకోడానికి ఈ వెబ్‌సైట్ ఉపయుక్తంగా ఉంటుంది. ఈ వెబ్‌సైట్ తయారీ అనంతరం మూడేళ్ళ పాటు నిర్వహణ కోసం 600 మంది ఐటి నిపుణులను ఐఎల్‌ఎఫ్‌సి సంస్థ వినియోగించుకోనుంది. ఇందు కోసం వారికి తగిన శిక్షణను కూడా ఈ నెల రోజుల వ్యవధిలో ఇవ్వనుంది.

వెబ్‌సైట్ రూపకల్పనపై నేడు సమీక్ష :

ధరణి వెబ్‌సైట్ డిజైన్ మొదలు నిర్వహణ వరకు సిసిఎల్‌ఎ కార్యాలయంలో సోమవారం ఉదయం మొదలు సాయంత్రం వరకు సమావేశం జరగనుంది. సిసిఎల్‌ఎ, రెవిన్యూ, ఐటి, ఐటిఇ అండ్ సి, ఐఎల్‌ఎఫ్‌ఎస్ సంస్థ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారు. వివిధ శాఖల్లోని డాటాను ఈ వెబ్‌సైట్‌కు అనుసంధానించడం, రోజువారీ కార్యకలాపాలు నమోదు కావడం, ప్రధాన సెర్వర్‌కు అనుసంధానం చేయడం, భూ రికార్డుల మార్పుల చేర్పులకు వచ్చే విజ్ఞప్తులకు తగిన అవకాశం ఇవ్వడం.. ఇలా అన్ని కోణాల నుంచి ఈ సమావేశంలో చర్చ జరగనుంది.

వేగంగా సీతారామ



(మొదటిపేజీ తరువాయి)

తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మాన్ని అభివృద్ధి గుమ్మంగా మారుస్తామని సీతారామ ప్రాజెక్టు ద్వారా పాలేరును నింపుతామన్నారు. 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని తెలిపారు. హైద్రాబాద్ రింగు రోడ్డుకు ధీటుగా ఖమ్మం రింగు రోడ్డు నిర్మాణం త్వరలోనే చేపడతామన్నారు. దేశంలోనే రహదారుల అభివృద్ధిలో ఖమ్మం జిల్లాను నెంబర్‌వన్‌గా నిలుపుతామన్నారు. మురికి కూపంలా ఉన్న లకారంను సుందర వనంగా తీర్చిదిద్దినట్లు మంత్రి తెలిపారు. ఎంఎల్‌ఎ అజయ్ ప్రత్యేకంగా కృషి చేశారన్నారు. 5కె రన్‌లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని లకారం అభివృద్ధి చూసి హర్షం వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంఎల్‌సి పల్లా రాజేశ్వరరెడ్డి, బాలసాని లక్ష్మి నారాయణ, జెడ్పి చైర్‌పర్సన్ గడిపల్లి కవిత, కలెక్టర్ లోకేష్‌కుమార్, ఐడిసి చైర్మన్ బేగ్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డిసిసిబి చైర్మన్ మువ్వా విజయబాబు, మేయర్ పాపాలాల్, నగర కమిషనర్ సందీప్‌కుమార్ ఝా పాల్గొన్నారు.

అవినీతిలో బిజెపి ప్రపంచ రికార్డు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నప్పుడు ఒకదాని తర్వాత ఒకటిగా అనేక కుంభకోణాలకు పాల్పడిందని ధ్వజమెత్తారు. 'ఐదు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఒక్క కుంభకోణం కూడా చోటుచేసుకోలేదు. కాని వారి (బిజెపి) పాలనలో ఒకటేమిటి అనేక రకాల కుంభకోణాలు జరిగాయి' అని విమర్శించారు. 'ఎన్నికలు వస్తున్నాయి, కాంగ్రెస్ పార్టీకి, సిద్ధరామయ్యకు మద్దతివ్వండి. మళ్లీ ఇక్కడ మా ప్రభుత్వం వస్తుంది. మీకోసం మేం కలిసి పని చేస్తాం' అని పేర్కొన్నారు. కుస్తగిలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కెపిసిసి అధ్యక్షుడు జి.పరమేశ్వరతో కలిసి కాలినడక వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. గత బిజెపి ప్రభుత్వంలో బిఎస్ ఎడ్యూరప్ప, సదానంద గౌడ, జగదీశ్ షెట్టార్ వంటి ముగ్గురు ముఖ్యమంత్రులను చూశామని, ముగ్గురు మంత్రులు జైళ్లలో ఉన్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వం అవినీతిలో ప్రపంచ రికార్డులు సృష్టించిందని, దీనిపై వారు ముందుకు వచ్చి మాట్లాడాలని అన్నారు.

లెక్కల్లో లేరు

(మొదటిపేజీ తరువాయి)

ఇంగ్లీష్‌లలో పిల్లలకు యాంత్రికంగా అభ్యాసం కల్పించారని, కరదీపికలో వివరించిన తీరులో అభ్యాసాలతో కూడిన కృత్యాలను కల్పించిన టీచర్లు అరుదు అని నివేదిక పేర్కొనింది.

అంగ్లంలో అంతంత మాత్రమే

ప్రాథమిక, ఉన్నత స్థాయిల్లో ఆంగ్లంలో దాదాపు అందరూ అక్షరాలను గు ర్తించగలుగుతున్నా పిల్లలు పదాలను చదవలేకపోతున్నారు. ఇంగ్లీష్‌లో ఒక పేరాను ధారాళంగా చదవగలిగే, తప్పులేకుండా రాయగలిగే విద్యార్థులు ప్రాథమిక స్థాయిలో ఎవరూ లేరని నివేదికలో పేర్కొన్నారు. ఉన్నత స్థాయిలో 15 శాతం వరకు ఉంటారని తెలిపింది. ఆదర్శ పాఠశాలల్లో పరిస్థితి కొంత మెరుగుగా ఉన్నా కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు(కెజిబివి)లలో పరిస్థితి ఉన్నత పాఠశాలల మాదిరిగానే ఉందని తనిఖీల్లో వెల్లడైంది. గ్రంథాలయ పుస్తకాలు, వార్తాపత్రికలు, బాలసాహిత్యం, కథావాచకాలు, అక్షరాలు, పదాలు, సంఖ్యలు తదితర వాటికి చెందిన బోధనాభ్యాసన సామాగ్రి ఎక్కడా ఉపయోగించిన ఆధారాలు లేవని నివేదికలో పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయిలో ఫార్మెటివ్ అసెస్‌మెంట్(ఎఫ్‌ఎ)ల నిర్వహణపై పూర్తి స్థాయిలో అవగాహనే లేదు. ప్రైమరీ స్కూళ్లలో పిల్లల నోట్‌బుక్‌లు కూడా సరిగ్గా ఉండటం లేదు.

రాత పనులకు, ప్రాజెక్ట్ పనులకు, పిల్లల భాగస్వామ్యం ప్రతిస్పందనల కు టీచర్లు మౌఖికంగానే మార్కులు వేస్తున్నారు. కొన్ని చోట్ల ఎఫ్‌ఎ నిర్వహించకుండానే మార్కులు నమోదు చేసినప్పటికీ వాటిని పరిశీలించలేదు. వివిధ పాఠశాలల్లో ఎఫ్‌ఎల నిర్వహ ణ గురించి అవగాహన అంతంత మాత్రంగానే ఉందని నివేదించారు. మండల విద్యాధికారులు, డిప్యూటీ ఐఒఎస్‌లు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను పర్యవేక్షిస్తున్నటికీ రికార్డులను పరిశీలించి, ప్రశ్నించిన దాఖలాలు లేవు. కేవలం సిసిఇ రిజిష్టర్‌లో వివరాలు నమోదు చేశారా..? లేదా..? అని అడగడానికే పరిమితమయ్యారు. పాఠశాలల నుంచి నివేదికలు వస్తే చాలా అనే ధోరణిలో ఎంఇఒలు, డిప్యూటీ ఐఒఎస్‌లు వ్యవహరిస్తున్నారు. వీరికి కూడా ప్రాథమిక స్థాయిలో సిసిఇ నిర్వహణపై అంతంత మాత్రంగానే అవగాహన ఉందని తేలింది.



రాజకీయాల్లో జవాబుదారీతనం ముఖ్యం : వెంకయ్య నాయుడు

మన తెలంగాణ / హైదరాబాద్ : రాజకీయాలకు మన దేశ ప్రజాస్వామ్య విలువలను పటిష్ఠం చేసే స్వభావం ఉండాలని, రాజకీయ నాయకులకు జవాబుదారీతనంతో పాటు క్రమశిక్షణ, పారదర్శకమైన జీవితం ఉండాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం దేశాన్ని అవిద్య, అరాచకం, అవినీతి, ఉగ్రవాదం పట్టి పీడిస్తున్నయన్నారు. వీటికి సమాధానం కనుగొనడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే అని భావించ కుండా ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలన్నారు. రాగస్వప్తస్వరం, సుబ్బిరామిరెడ్డి లలిత కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కె.రోశయ్యను జీవితకాల సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాజకీయ రంగంలో పరిణతి చెందిన రాజకీయవేత్తగా రోశయ్యకు ప్రత్యేక గుర్తింపు ఉన్నదని, సౌమ్యుడిగా, సమర్థకుడిగా, అన్ని పార్టీల ఆదరాభిమానాలను చూరగొనే వ్యక్తిగా ప్రత్యేకత పొందారని అన్నారు. రోశయ్య మాట్లాడుతూ, తాను రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఎన్నో పదవులు లభించాయని, అవి యాధృచ్ఛికంగా వచ్చినవే తప్ప వాటికోసం వెంపర్లాడలేదని అన్నారు.ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, సాంస్కృతిక సలహాదారు కెవి రమణాచారి, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం,నన్నపనేని రాజకుమారి, యద్దనపూడి సులోచనారాణి పాల్గొన్నారు.

రైస్ మిల్లుపై ఎస్ఓటి పోలీసుల దాడులు

రీసైక్లింగ్ చేస్తున్న రేషన్ బియ్యం, వాహనాలు స్వాధీనం

మన తెలంగాణ/కీసర (మేడ్చల్ జిల్లా) : రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తున్న రైస్ మిల్లుపై ఎస్ఓటి పోలీసులు దాడులు నిర్వహించారు. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో ఆదివారం అహ్మద్ గూడలోని శ్రీదత్తసాయి రైస్ మిల్లుపై ఎస్ఓటి పోలీసులు దాడులు చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన వంద క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి, ముగ్గురు నిర్వాహకులతోపాటు రీసైక్లింగ్ చేసిన రేషన్ బియ్యాన్ని రవాణా చేసేందుకు ఉంచిన లారీ, రెండు టాటా ఎసి వాహనాలు అదుపులోకి తీసుకొని కీసర పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలోనూ పౌర సరఫరాలశాఖ అధికారులు శ్రీదత్తసాయి రైస్ మిల్లుపై దాడులు నిర్వహించి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కుక్కల దాడిలో 35 గొర్రెల మృతి



మన తెలంగాణ/మద్దూరు : పిచ్చి కుక్కల దాడిలో 35 గొర్రెలు మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా వద్దూరు మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారు జామున జరిగింది. ఈ గ్రామానికి చెందిన అల్ల నర్సయ్య అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి 35 గొర్రెలను చంపినట్లు తెలిపారు. కాపరి నర్సయ్య కన్నీరు పర్యంతమై మాట్లాడుతూ జీవనోపాధి కోసం జీవాలను పెంచుతున్నానని, కుక్కలు దాడి చేయడంతో దాదాపు రూ. 1.50 లక్షల విలువ గల 35 గొర్రెలు మృతి చెందడంతో తన కుటుంబం రోడ్డున పడిందని విలపించాడు. చనిపోయిన జీవాలకు నష్ట పరి హారాన్ని చెలించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గొర్ల మేకల పెంపకం దార్ల సంఘం సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఆలేటి యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

మన తెలంగాణ/యాలాల: విద్యుత్ షాక్‌తో ఓ యువ రైతు మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా, యాలాల మండలం గోరేపల్లిలో ఆదివారం చోటుచేసుకున్నది. యాలాల ఎఎస్ఐ ఎం ఎ గఫార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి 8.30 గంటలకు తన పొలంలోని వేరుశెనగ పంటకు నీరు పెట్టేందుకు ఇంటి నుంచి కుర్వ మల్లేశం (30) వెళ్లాడు. మల్లేశం అన్న పొలానికి వెళ్లి చూడగా పొలంలో ఉన్న విద్యుత్ పోల్ దగ్గర శవమై పడి ఉన్న తన తమ్ముడిని చూసి గ్రామంలోని ఇరుగు పొరుగు వారికి చెప్పాడు. భార్య మాడమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎ ఎస్ఐ గఫార్ తెలిపారు. మృతుడికి భార్య, సౌమ్య(6), శ్రీహరి(3) ఇద్దరు పిల్లలున్నారు,

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



మన తెలంగాణ/కాటారం : అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జయశంకర్ జిల్లా కాటారం మండలంలో చోటు చేసు కుంది. చింతకాని గ్రామపంచాయతీ పరిధిలోని ఇబ్రహీంపల్లి గ్రామానికి చెందిన చల్లా బాపు(45) అనే వ్యక్తి శనివారం రాత్రి పురుగుల మందు సేవించగా కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజిఎం హాస్పిటల్‌కు తరలిం చారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలి పారు. బాపు 10 ఎకరాలు కౌలుకు తీసుకొని 6ఎకరాలలో పత్తి, 4 ఎకరాలలో వరిపంట వేశాడు. పంట దిగుబడి రాక అప్పుల బాధ ఎక్కువ కావడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని బార్య చల్లా స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

మన తెలంగాణ / శంషాబాద్ : విదేశాల నుంచి అక్రమంగా 300గ్రాముల బంగారాన్ని తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని బంగారం స్వాధినం చేసుకున్న సంఘటన ఆదివారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్టులో చోటుచేసుకుంది. ఇంటెలిజెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి జెడ్డా నుంచి ఎయిర్ ఇండియా విమానంలో అక్రమంగా బంగారాన్ని తరలిస్తునట్లు సమాచారం అందిందన్నారు. దీంతో ఆ వ్యక్తి విమానశ్రాయానికి చేరుకోగానే అతన్ని అదుపులోకి తీసుకొని విచారించారు. అతని లోదుస్తుల్లో నాలుగు బంగారు చేతిగాజులను గుర్తించినట్లు తెలిపారు. అతన్ని అదుపులోకి తీసుకొని బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ బంగారం విలువ సుమారు రూ.9.33 లక్షలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

ప్రజల్లో భేద భావాలొద్దు

విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి గుమ్మళ్ల సత్యం



మన తెలంగాణ/రామాయంపేట : సమాజంలో అసమానతలు లేకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి గుమ్మళ్ల సత్యం పేర్కొన్నారు. రామాయంపేటలోని స్వామి వివేకానంద ఆవాస విద్యాయలము 12వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా గుమ్మళ్ల సత్యం, పేట మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, టిఆర్ఎస్ నాయకుడు దేవేందర్‌రెడ్డి, డాక్టర్ సునీల్ మంగళం, వివేకానంద ఆవాస విద్యాలయ వ్యవస్థాపకులు పెద్దిరెడ్డి క్రిష్ణారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ మన హిందూ ధర్మం ఎంతో శ్రేష్ఠమైందని, హిందూ ధర్మం వల్లే శాంతి చేకూరుతుందన్నారు. హిందూ ధర్మం రక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు రాంచరణ్‌యాదవ్, టపస్ రాష్ట్ర అధనపు కార్యదర్శి నవాత్ సురేశ్, పడకంటి సంగమేశ్వర్, కైరం కొండ తిరుపతి, ఏలూరి పండరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' వేగమేది?



- హైదరాబాద్ జిల్లాలో 10వేల లోపు మాత్రమే ఇళ్ల నిర్మాణాలు
- నగరంలో అద్దె ఇళ్లలోనే 4.50 లక్షల కుటుంబాలు
- నగరవాసులకు నిరాశే మిగలనుందా?

మన తెలంగాణ /హైదరాబాద్ సిటీ బ్యూరో : డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం కలలుకంటున్న నగర వాసులకు నిరాశే మిగులనుంది. గ్రేటర్ పరిధిలో 1.29 లక్షల డబుల్ బెడ్ ఇళ్ల నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో హైదరాబాద్ జిల్లాలో కేవలం 10 వేల లోపు మాత్రమే ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. జిల్లాలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములతో పాటు యుఎల్‌సి భూములు ఆక్రమణదారులు యథేచ్ఛగా అనుభవిస్తుంటే అధికారులు మాత్రం డబుల్ బెడ్ రూం ఇళ్లకు స్థలాలే దొరకడం లేదని చేతులెత్తేస్తున్నారు. మరో వైపు పక్కా జిల్లాలైన మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో లక్షా పై చిలుకు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లో మాత్రం సొంతింటి కల నెరవేరనుందని మురిసి పోయిన పేదలకు నిరాశే మిగలనుంది.

40 లక్షల జనాభా –10, 49,686 కుటుంబాలు

హైదరాబాద్ జిల్లా సగటు విస్తీర్ణం 200 చ.కి మీటర్లు కాగా 39,79,372 మంది జనాభా ఉన్నారు. ఇందులో 4,39,097 మంది ఎస్‌సిలు, 80,025 మంది ఎస్‌టిలు, 14,10,626 మంది బిసిలు, 18, 45,620 మంది మైనార్టీలు, 2,04,004 మంది ఇతర వర్గాలకు చెందినవారు ఉన్నారు. కుటుంబాల పరంగా హైదరాబాద్ జిల్లాలో 10,49,686 కుటుంబాలు ఉండగా, సకల జనుల సర్వే లెక్కల ప్రకారం ఇందులో దాదాపు కుటుంబాలు 4.50 లక్షలపై చిలుకు కుటుంబాలు అద్దె ఇళ్లలో బతుకులను వెళ్లదీస్తున్నారు. అంతేకాకుండా తెలంగాణ ఏర్పడ్డ నాటికే ఇళ్ల కోసం 2లక్షల దరఖాస్తులు కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉండగా, గడిచినా 4 ఏళ్లలో మరో రెండు లక్షల దరఖాస్తులు (జిహెచ్‌ఎంసి ఎన్నికల సమయంలో స్వీకరించారు.) వచ్చాయి. దీంతో సుమారు 4 లక్షల దరఖాస్తులు కలెక్టరేట్‌లో మూటల రూపంలో పేరుకుపోయాయి. మరోవైపు ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి వందలాది మంది ఇళ్ల దరఖాస్తులతో వస్తున్నారు. అయితే అధికారులు మాత్రం ఇంకా ఇళ్ల దరఖాస్తులు మార్గదర్శకాలు రాలేవని, బస్తీల్లో సభలు ఏర్పాటు చేసి అక్కడే దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని తిప్పి పంపుతున్నారు. అయితే వచ్చిన 4లక్షల దరఖాస్తుల్లో కనీసం 3 లక్షల వరకు అర్హులైన వారు ఉండే అవకాశం ఉందని అధికారులే పేర్కొంటున్నారు. దీంతో జిల్లాలో కనీసం 3 లక్షల ఇళ్ల అవసరం కాగా, డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధిచి జిల్లా అధికారులు మాత్రం ప్రభుత్వ స్థలాలు కొరత పేరుతో ఎక్కువగా మురికివాడలపై మాత్రమే దృష్టి సారించారు. దీంతో వారిని ఒప్పించి మెప్పించేందుకు పుణ్యకాలం కాస్తా గడిచిపోగా, గడిచినా 4 ఏళ్ల కాలంలో జిల్లాలో కేవలం 10 వేల లోపు ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే పునాది రాళ్లు పడ్డాయి. ఇందులో కూడా 80 శాతం ఇళ్లు మురికివాడలోనే నిర్మిస్తుండడంతో గజం భూమి కూడా లేని వారికి అసలు ఇళ్లు ఇస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో డబుల్ బెడ్ రూం ఇళ్ల రూపంలో తమ సొంతింటి కల నెరవేరనుందని కలలు కన్న నగర పేదలకు అధికారుల పుణ్యామా అని చివరికి నిరాశే మిగలనుంది.

అభివృద్ధికి గీటురాయి ఉద్యమ ఆకాంక్షలే

టిజెఎసి చైర్మన్ కోదండరాం



మన తెలంగాణ / నల్లగొండ ప్రతినిధి: తెలంగాణలోఅభివృద్ధి ఉద్యమ ఆకాంక్షలకు గీటురాయిగా సాగాలని టిజేఏసి చైర్మన్ కోదండరాం అన్నారు. ఆదివారం నల్లగొండలో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో జరిగిన నాలుగేండ్ల తెలంగాణలో నల్లగొండ అనే సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అభివృద్ధి అనేది రాజకీయ అంశమేనని ఆర్థిక అంశం కాదన్నారు. ఉద్యమ సమయంలో ప్రజలు ఒకరకమైన అభివృద్ధిని కోరుకుంటే పాలకులు మరో రకంగా చూస్తున్నారని అన్నారు. అధికారం ప్రజలందరికీ ప్రయోజనం చేకూర్చాలని నలుగురి జాగీరుగా మారకూడదన్నారు. అందుకే ప్రజలందరికి ప్రయోజనం దక్కేందుకు ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలు అవలంభించే దిశగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. నల్లగొండలో రోజురోజుకు ఆత్మహత్యలు చేసుకునే రైతుల సంఖ్య పెరుగుతూ వస్తుందన్నారు. అవినీతి, అధికారం కలిసి వనరులను కొల్లగొడుతున్నాయన్నారు.తెలంగాణవిద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు పందుల సైదులు అధ్యక్షత వహించగా నాయకులు కన్నెగంటి రవి, టివివి అధ్యక్షులు రవీందర్‌రావు, చేతివృత్తి రంగ నిపుణులు తడక యాదగిరి, ధర్మార్జున్ పాల్గొన్నారు.

కోదండరాంకు త్రుటిలో తప్పిన ప్రమాదం





కోదండరాం ఆదివారం రోడ్డు ప్రమాదం నుండి సురక్షితంగా బయటపడ్డారు. ఆయన ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు చిట్యాల మండలం పిట్లంపల్లి క్రాసింగ్ వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కోదండరాంతో పాటు కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు సురక్షితంగా బయటపడ్డారు. ద్విచక్రవాహనంపై వచ్చిన చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం వారిని ఆసుపత్రికి తరలించారు.



వసతి గృహంలో మంత్రి రామన్న తనిఖీ

మనతెలంగాణ/బోధన్ (నిజామాబాద్ జిల్లా) : బోధన్ పట్టణంలోని రాకాసిపేటలో గల సమీకృత బాలికల వసతి గృహాన్ని ఆదివారం ఉదయం అటవీ, బిసి సంక్షేమ శాఖ మంత్రి జోగురామన్న తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో వార్డెన్ సరస్వతి అందుబాటులో లేకపోవడంతో పాటు విద్యార్థినులు వారి సమస్యలను మంత్రి దృష్టికి తేవడంతో అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థినులకు ఉదయం వేళలలో స్నానానికి వేడి నీటిని అందించకపోవడంతో పాటు తాగునీటి వసతి సైతం కల్పించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లైబ్రరీ సైతం ఏర్పాటు చేయాలని విద్యార్థినులు మంత్రి దృష్టికి తేవడంతో అధికారుల పనితీరు మార్చుకుని సౌకర్యాలు మెరుగు పరచాలన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో అమలుకు నోచుకోవడంలేదని ఆయన పేర్కొన్నారు. విద్య కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ అనేక సదుపాయాలను కల్పిస్తున్నారని, రెషిడెన్షియల్ తరహాలో వసతి గృహలలో చదివే విద్యార్తులకు అన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. మంత్రి తనిఖీ సమయంలో వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో ఆరా తీశారు. ఆదివారం సైతం అందుబాటులో ఉండకపోతే ఎలా అంటూ జిల్లా అధికారి విమలాదేవిపై అసహనం వ్యక్తం చేశారు. అధికారుల పనితీరు మంత్రి తనిఖీలో ఇలా ఉంటే మామూలు సమయాల్లో ఎలా ఉంటుందో ఊహించడని జిల్లా అధికారులను ప్రశ్నించారు. పేద విద్యార్థుల శ్రేయస్సు కోసం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేసి నాణ్యమైన విద్యను అందిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

మహావీర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

ఏడున్నర కిలోల కణితిని తొలగించిన వైద్యులు



మన తెలంగాణ/నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణంలో గల మహావీర్ ఆసుపత్రిలో వైద్యులు ఏడున్నర కిలోల కణితిని తొలగించి అరుదైన శస్త్ర చికిత్సలు చేశారు. కనగల్ మండలం రేగట్టె గ్రామానికి చెందిన వెంకటమ్మ గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతుంది. ఆదివారం మహావీర్ ఆసుపత్రికి విచ్చేసిన వెంకటమ్మను ప్రముఖ సర్జన్ డాక్టర్ శేఖర్ పరీక్షించి మహిళ కడుపులో కణతి ఉన్నట్లుగా నిర్ధారించారు. అనంతరం ఆపరేషన్ చేసి మహిళ కడుపులో గల ఏడున్నర కిలోల కంతిని తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జనరల్ ఫిజీషియన్ అమరేందర్, మహావీర్ ఆసుపత్రి ఎండి.దేవేందర్, సిబ్బంది మాదగోని సతీష్‌గౌడ్, పార్వతమ్మ, తదితరులు ఉన్నారు.


వాటా డబ్బులు ఇవ్వలేదని మహిళ హత్య

నిందితుడిని రిమాండ్‌కు పంపిన పోలీసులు



మన తెలంగాణ/జహీరాబాద్ : జహీరాబాద్ పోలీసులు వివాహిత మహిళ హత్య కేసును చేధించారు. మండలంలోని దిడ్గి గ్రామంలో ఈ నెల 7వ తేదీన గ్రామానికి చెందిన పుణ్యవతి (47)ను గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి హతమార్చిన విషయం పాఠకులకు విధితమే. హతురాలి కూతురు మ్యాతరి జయశీల ఫిర్యాదు మేరకు జహీరాబాద్ రూరల్ పోలీసులు కేసును నమోదు చేసి విచారించగా గ్రామానికి చెందిన వ్యక్తే పుణ్యవతిని హతమార్చినట్లు వెల్లడైంది. ఆదివారం జహీరాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన కేసు వివరాలను జహీరాబాద్ టౌన్ సిఐ సదా నాగరాజు, ఎస్ఐతో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. హతురాలు పుణ్యవతి తన వ్యవసాయ భూమిలో అదే గ్రామానికి చెందిన యండి రజాక్ (35)తో కలిసి ఆలుగడ్డ పంటను సాగుచేశారు. ఇరువురు కలిసి సాగుచేసిన ఆలుగడ్డ పంట అమ్మగా రూ.50వేల ఆదాయం వచ్చింది. ఆయితే రజాక్ తనకు రావాల్సిన రూ.25వేలను ఇవ్వాలని పుణ్యవతిని అడిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ నెల 7న డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య మాట మాట పెరిగడంతో రజాక్ తన వద్ద గల గొడ్డలితో పుణ్యవతిని హతమార్చి వెళ్లిపోయాడు. 9న పుణ్యవతిని గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చారని కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించిన పోలీసులు ఆదివారం దిడ్గి గ్రామ కూడలిలో గల టీ కొట్టులో యండి రజాక్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తానే పుణ్యవతిని హతమార్చానని ఒప్పుకున్నాడు. రజాక్‌ను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వివరించారు. కేసును చేధించడంలో చురుకుగా వ్యవహించిన సిబ్బంది వెంకటేశం, అమర్‌నాథ్‌రెడ్డి, సురేందర్,శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, సామేల్‌లకు రివార్డు కోసం సిఫార్సు చేయనున్నట్లు పేర్కొన్నారు.

బక్కచిక్కిన భద్రాచల గోదావరి



- పిల్ల కాలువలా మారిన నది
- వేసవికి ముందే అడుగంటిపోతున్న వైనం
- పొంచి ఉన్న మంచినీటి సమస్య

మన తెలంగాణ/భద్రాచలం : నిండు కుండలా గలగల పారే గోదావరి ఫిబ్రవరి నెల రెండో వారంలోనే పిల్ల కాలువను తలపించేలా మారింది. జన జీవనానికి అవసరమైన మంచినీటిని సైతం అందించే స్థితి లేకుండా పోతోంది. ఇప్పుడే ఈ విధంగా నీరు అడుగంటుతుంటే రానున్న వేసవి కాలం పరిస్థితి ఏ విధంగా ఉంటుందో తలుచుకుంటేనే దడ పుడుతోంది.

ఇసుక తిన్నెలే దర్శనం : భద్రాచలం వద్ద గోదావరి నది అంటే ఉగ్రరూపంలో ఉండటమే అందరికీ తెలుసు. రాముని పాదాల చెంత చప్పుడు చేసుకుంటూ ముందుకు సాగిపోతుంది. కాని ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వేసవి కాలానికి ఇంకా సుమారు 15 రోజుల వ్యవధి ఉంది. కానీ ఇప్పుడే నదిలో నీరు ఎండిపోయి ఇసుక తిన్నెలు దర్శనమిస్తున్నాయి.


నదీ పరివాహక ప్రాంతాలైన వాజేడు నుండి మొదలు పెట్టి భద్రాచలం మీదుగా కూనవరం ఉన్న సుమారు 100కు పైగా గ్రామాలు గోదావరి నీటినే సేవిస్తుంటారు. ఇప్పటికే నదిలో నీళ్లు ఉడుగంటి నీటియద్దడి ప్రారంభమైంది. అదే మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో ఇసుక తిన్నెలు తప్ప నీటి నిల్వలు ఉండే పరిస్థితి లేదు. ఎగువ ప్రాంతాల్లో సైతం ఇదే తంతు కొనసాగుతోంది. ప్రస్తుత స్థితిగతులను మననంలోనికి తీసుకుంటే రానున్న వేసవికాలంలో నీటి యద్దడి తీవ్రతరమయ్యే పరిస్థితి ఉందని పలువురు అంటున్నారు. డివిజన్ వ్యాప్తంగా సుమారు లక్షకు పైగా ఉన్న జనాభాకు రానున్న ఎండా కాలంలో రోజుకు 5 లక్షలకు పైగా తాగునీరు అవసరం ఉంది. నది తీరు ఇలానే ఉంటే సరిపడా తాగునీరు అందతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. నీటి ఎద్దడి నివారణ కోసం ప్రభుత్వంచేపట్టిన మిషన భగీరథ పథకం ఇంకా కొనసాగుతూనే ఉన్న తురణంలో ఈ వేసవి కూడా శుద్ధ జలంతో గొంతుకలు తడిచేలా లేవని పెద్దలు అభివర్ణిస్తున్నారు.

సంగీత దర్శకుడిగా కొత్త అవతారం!

మంచు మనోజ్ కేవలం నటుడే కాదు... అతనిలో వేరే కళలు కూడా చాలా ఉన్నాయి. అతను ఫైట్లు కంపోజ్ చేస్తాడు, డ్యాన్సులు కంపోజ్ చేస్తాడు. పాటలు రాస్తాడు... పాడతాడు. ఇప్పుడు మనోజ్‌లోని మరో కళ బయటకు వచ్చింది. అతను ఇప్పుడు సంగీత దర్శకుడిగా మారాడు. మనోజ్ సంగీతాన్ని అందించింది హాలీవుడ్ సినిమాకు కావడం విశేషం. ఆ సినిమా పేరు బాస్మతి బ్లూస్. మనోజ్ అక్కయ్య మంచు లక్ష్మి ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర పోషించింది. ఇందులో ఆమె పాత్ర పేరు సీత. ఆస్కార్ విన్నింగ్ నటి బ్రీ లార్సన్ ఈ చిత్రంలో కథానాయికగా నటించింది. ఈ చిత్రం ఇటీవల హాలీవుడ్‌లో విడుదలైంది కూడా. అయితే ఈ చిత్రానికి తన స్నేహితుడైన సంగీత దర్శకుడు అచ్చు రాజమణితో కలిసి మనోజ్ సంగీతాన్ని అందించాడట. మనోజ్ నటించిన చాలా సినిమాలకు అచ్చు సంగీతాన్ని సమకూర్చాడు. దీంతో ఆ సినిమాల సమయంలో అచ్చుతో మనోజ్ సంగీత చర్చల్లో పాల్గొనేవాడు. ఆ అనుభవంతోనే ఇప్పుడు అతనితో కలిసి 'బాస్మతి బ్లూస్'కు సంగీతాన్ని సమకూర్చాడట. మరి మనోజ్ మ్యూజికల్ టాలెంట్‌కు హాలీవుడ్‌లో ఏమాత్రం పేరొస్తుందో చూడాలి.



భారీ క్లైమాక్స్ చిత్రీకరణలో...


అల్లు అర్జున్

అల్లుఅర్జున్, అను ఇమ్మానుయేల్ జంటగా వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కుతున్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ బ్యానర్‌లో శిరీష శ్రీధర్ నిర్మాతగా, బన్నీ వాసు సహ నిర్మాతగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రంలో అర్జున్, శరత్ కుమార్‌లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సోమవారం నుంచి హైదరాబాద్‌లో భారీ షూటింగ్‌కు ప్లాన్ చేశారు ఫిల్మ్‌మేకర్స్. ఇందులో భాగంగా క్లైమాక్స్‌ను కూడా తెరకెక్కించనున్నారు. ఈ చిత్రంలోని రెండో పాట లవర్ ఆల్సో... ఫైటర్ ఆల్సో అనే పాటను ప్రేమికుల దినోత్సవం కానుకగా ఈనెల 14న విడుదల చేయనున్నారు. ఈమధ్యే రిలీజ్ చేసిన సైనిక పాటతో తనలోని దేశభక్తిని చాటుకున్న అల్లు అర్జున్... ఇప్పుడు లవర్ ఆల్సో అంటూ ప్రేమను పంచబోతున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి ఈ చిత్రాన్ని ఏప్రిల్ 27న విడుదల చేస్తున్నారు. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్‌శేఖర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ ''అల్లు అర్జున్, అను ఇమ్మానుయేల్ జంటగా వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయమవుతున్న 'నా పేరు సూర్యనా ఇల్లు ఇండియా' చిత్రాన్ని గ్రాండియర్‌గా నిర్మిస్తున్నాం. సోమవారం నుంచి హైదరాబాద్‌లో క్లైమాక్స్‌ను చిత్రీకరించబోతున్నాం. ఈ క్లైమాక్స్‌ను భారీ స్థాయిలో చిత్రీకరించేందుకు ప్లాన్ చేశాం. లవర్ ఆల్సో... ఫైటర్ ఆల్సో పాటను ఈనెల 14న వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేస్తున్నాం. ఈ పాటకు ప్రముఖ గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా విశాల్, శేఖర్ సంగీతమందించారు. శేఖర్ ఈ పాటను పాడారు. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి ఈ చిత్రాన్ని ఏప్రిల్ 27న విడుదల చేస్తున్నాం''అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః రాజీవ్ రవి, ఎడిటర్ః కోటగిరి వెంకటేశ్వరరావు , ఫైట్స్ః రామ్ లక్ష్మ ణ్.

ఛల్ మోహన్ రంగ


నితిన్, మేఘా ఆకాష్

నితిన్, మేఘా ఆకాష్ జంటగా శ్రేష్ట్ మూవీస్, పవన్‌కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. త్రివిక్రమ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి కృష్ణచైతన్య దర్శకుడు. శ్రీమతి నిఖితారెడ్డి సమర్పణలో ఎస్.సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది నితిన్‌కు 25వ చిత్రం కావటం విశేషం. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను పవన్‌కళ్యాణ్ తన ట్విట్టర్‌లో విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నితిన్ మాట్లాడుతూ తన అభిమాన కథానాయకుడు పవన్‌కళ్యాణ్ ఈ చిత్రం ప్రచార చిత్రాలను ట్విట్టర్ ద్వారా విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. నిర్మాత సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ''ఈ చిత్రం టీజర్‌ను ప్రేమికుల రోజైన ఈనెల 14న, చిత్రాన్ని ఏప్రిల్ 5న విడుదల చేయనున్నాము. సినిమాలో మిగిలిన ఒక్క గీతాన్ని ఈనెల 14 నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరించనున్నాము. హైదరాబాద్, ఊటీ, అమెరికాలలో ఇప్పటివరకు షూటింగ్ జరుపుకుంది ఈ చిత్రం''అని చెప్పారు. దర్శకుడు కృష్ణచైతన్య మాట్లాడుతూ ''ప్రేమతో కూడిన కుటుంబ కథా చిత్రమిది. చాలా సరదాగా సాగుతుంది''అని అన్నారు. డా.కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రా శ్రీను, మధునందన్, ప్రగతి, సత్య, పమ్మి సాయి, రాజశ్రీ నాయర్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరాః ఎం.నటరాజ సుబ్రమణ్యన్, సంగీతంః తమన్, కూర్పుః ఎస్.ఆర్.శేఖర్, నృత్యాలుః శేఖర్ వి.జె, పోరాటాలుః స్టంట్ సిల్వ, రవివర్మ.

అలా నటించడం తప్పు కాదు


సమంత

'పెళ్లయిన తర్వాత నాలో ఎలాంటి మార్పు రాలేదు. అంతా ఎప్పటిలాగే ఉంది''అని అంటోంది సమంత. గత ఏడాది నాగచైతన్యను వివాహమాడిన ఈ అందాల తార ప్రస్తుతం తెలుగు, తమిళ్‌లో సినిమాలు చేస్తూ బిజీగా ఉంటోంది. ''కథకు గ్లామర్ అవసరమైతే అలా నటించడం తప్పు కాదని నా అభిప్రాయం. అయితే అనవసరంగా గ్లామర్ గుప్పించడం నాకిష్టం ఉండదు. చాలా మంది హీరోయిన్లు పెళ్లి చేసుకుంటే కెరీర్ ముగిసిపోతుందని భయపడతారు. కానీ పెళ్లయిన తర్వాత కూడా హీరోయిన్‌గా సినిమాలు చేసుకుంటూ హ్యాపీగా ఉన్నాను. ఇక 'సంసార జీవితం ఎలా సాగుతోంది' అని చాలా మంది అడుగుతున్నారు. భార్యభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకొని జీవిస్తే నటనా రంగంలో కొనసాగడం కష్టం కాదు. వివాహానంతరం నా భర్త నాగచైతన్య, ఆయన కుటుంబ సభ్యులు కానీ నన్ను నటించవద్దని చెప్పలేదు. హీరోయిన్‌గా కొనసాగడాన్ని నేను ఎంతో ఇష్టపడతాను. ఇక నాగచైతన్యకు మీకూ మధ్య గొడవలు వస్తుంటాయా అని కొందరు అడుగుతుంటారు. మా మధ్య గొడవలు వస్తుంటాయి. గొడవ తర్వాత చైతూ దిగిరారు. నేనే మాట్లాడుతాను. నిజం చెప్పాలంటే... చైతూ గొడవ పడరు. నేనే గొడవ చేస్తా''అని సమంత పేర్కొంది. ఇక వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ కాస్త తీరిక దొరికిందని... సమయాన్ని వృథా చేసుకోకుండా ఆస్వాదిస్తున్నానని బికినీ వేసుకున్న ఓ ఫొటోతో సోషల్‌మీడియాలో దర్శనమిచ్చింది. తమిళనాడులోని తెన్‌కాశీలో బికినీ వేసుకొని సేదతీరుతున్న ఫొటోనే పోస్ట్ చేసింది. అయితే ఈ బికినీ ఫొటోపై నెటిజన్లు మండిపడ్డారు. పెళ్లయిన తర్వాత ఇలాంటి ఫొటోలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. బాలీవుడ్ నటిలా ప్రవర్తించకు... నీకు పెళ్లయిందని కొందరు నెటిజన్లు గుర్తుచేశారు. దీనికి సమంత దిమ్మతిరిగే సమాధానమిచ్చింది. ''నా రూల్స్ నేను రాసుకుంటా... మీరు నా నియమాలు రాయడం కాదు... మీ రూల్స్ రాసుకోండి''అని పేర్కొంది.


వెంకీ అట్లూరి

వరుణ్‌తేజ్, రాశిఖన్నా హీరోహీరోయిన్లుగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి పతాకంపై రూపొందిన చిత్రం 'తొలిప్రేమ'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం తాజాగా విడుదలై విజయపథంలో పయనిస్తోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరితో ఇంటర్వ్యూ విశేషాలు...

ఆయన ఫోన్ చేసి మెచ్చుకున్నారు

అద్భుతమైన స్పందన...

మేము ఊహించినదానికంటే సినిమాకు అద్భుతమైన స్పందన వస్తోంది. ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూస్తే ఆనందమేస్తోంది. సినిమాలోని ఎమోషనల్ సీన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

వరుణ్ మాటిచ్చాడు...

నేను కథ రాసుకునేటప్పుడు వరుణ్‌తేజ్ 'ముకుంద' ఇంకా రిలీజ్ కాలేదు. కేవలం ట్రైలర్ మాత్రమే వచ్చింది. దాన్ని చూసి ఇలాంటి హీరో నా కథలో ఉంటే బాగుంటుందేమోనని అనిపించింది. కానీ వరుణ్ లవ్ స్టోరీలు చేస్తాడో లేదోననే సందేహం కలిగింది. అయితే 'కంచె' చూసిన తర్వాత నమ్మకమొచ్చి వెళ్లి అతనికి కథ చెప్పాను. ఈ కథ వినగానే సినిమా చేస్తానని వరుణ్ మాటిచ్చాడు.

ఇంకా ముందుగానే...

'ఫిదా' సమయంలో వరుణ్‌కు కాలు విరిగింది. అప్పుడు ఐదు నెలల పాటు అతని సినిమా షూటింగ్‌లు వాయిదాపడ్డాయి. అలా జరుగకుండా ఉంటే 'తొలిప్రేమ' ఇంకా ముందుగానే మొదలయ్యేది. ఆ ఖాళీ సమయంలో నేను, వరుణ్ కూర్చొని స్టోరీ గురించి చర్చించుకునేవాళ్లం. ఇక రెండు క్యారెక్టర్‌లను పెట్టి వాళ్ల ప్రేమ ప్రయాణం చూపించాలనుకొని ఈ కథ రాశాను.

కథ నచ్చి చేస్తామన్నారు...

ముందుగా ఈ కథను దిల్‌రాజుకు చెప్పాను. కానీ ఆయనకు వరుసగా ప్రాజెక్టులు ఉండటం వలన ఈ కథను బివిఎస్ఎన్ ప్రసాద్‌కు చెప్పాను. ఆయన కొడుకు బాపినీడు నాకు మంచి ఫ్రెండ్. ఇక ఈ కథ వినగానే నచ్చి వాళ్లు ఈ సినిమా చేస్తామన్నారు.

అందుకే రాశీని తీసుకున్నాం...

వరుణ్, నిర్మాతలు కలిసి రాశిఖన్నాను హీరోయిన్‌గా ఎంపికచేశారు. నేనైతే కొత్త వాళ్లయితే బాగుంటుందని అనుకున్నాను. కానీ ప్రేక్షకులకు బాగా తెలిసిన నటి అయితే బాగుంటుందని రాశిఖన్నాకు స్క్రీన్ టెస్ట్ చేశాం. అందులో ఆమె నిజంగానే చాలా అందంగా కనిపించింది. అందుకే ఆమెను హీరోయిన్‌గా ఖరారు చేశాం.

మొదటి సిట్టింగ్‌లోనే...

మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఇంతకుముందు చేసినవన్నీ మాస్ సినిమాలే. నేను ఈ కథ చెప్పగానే వెంటనే ఆయన ఈ సినిమా చేస్తానన్నారు. ఆయన ప్రతి ట్యూన్ మొదటి సిట్టింగ్‌లోనే ఓకే అయిపోయేది. ఇక 'నిన్నిలా...' సాంగ్ ట్యూన్ అయితే 14 ఏళ్ల క్రితం కంపోజ్ చేసుకున్న ట్యూన్. అదే ఇప్పుడు పెద్ద హిట్టయింది.

దర్శకత్వంపై ఆసక్తితో...

మొదటి నుండి నాకు సినిమాల్లోకి రావాలని ఉండేది. కానీ ఎలా రావాలనే ఆలోచన లేదు. 'స్నేహ గీతం' చిత్రానికి డైలాగ్స్ రాశాక రచయితగా మంచి పేరు వచ్చింది. అప్పటి నుంచి నటన మీద ఆసక్తి తగ్గిపోతూ వచ్చింది. చివరికి నటనకంటే దర్శకత్వంపై ఆసక్తి పెరగడంతో దర్శకుడిగా మారాను.

మంచి విజయం...

నటుడిగా నేను జ్ఞాపకం, స్నేహగీతం చిత్రాలు చేశాను. రచయితగా స్నేహగీతం, ఇట్స్ మై లవ్ స్టోరీ, కేరింత సినిమాలకు పనిచేశాను. ఇప్పుడు 'తొలిప్రేమ' చిత్రం దర్శకుడిగా మంచి విజయాన్ని అందించింది.

ఆయనతో మరో సినిమా...

ఈ చిత్ర విజయంతో దర్శకుడిగా నాకు మంచి ప్రశంసలు వస్తున్నాయి. కె.రాఘవేంద్రరావు నాకు ఫోన్ చేసి మెచ్చుకున్నారు. ఆర్.నారాయణమూర్తి కూడా ఫోన్ చేసి అభినందించారు. ఇలా అందరూ సినిమాకు కనెక్ట్ కావడం సంతోషంగా అనిపించింది. బివిఎస్ఎన్ ప్రసాద్‌తో మరో సినిమా కూడా చేయబోతున్నాను. త్వరలో దిల్‌రాజుతో కూడా ఒక సినిమా చేస్తాను.

నాజూకు అందాలతో మురిపిస్తోంది


మెహరీన్

అందాల తార మెహరీన్ కౌర్ గత ఏడాది అంతా వరుసగా సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చి వారిని ఎంతగానో అలరించింది. 2017లో మహానుభావుడు చిత్రంతో మొదలైన ఈ ముద్దుగుమ్మ ప్రయాణం 'జవాన్' దాకా సాగింది. గత ఏడాది బిజీబిజీగా గడిపిన ఈ బ్యూటీ ప్రస్తుతం కొంచెం ఫ్రీ అయ్యిందట. దీంతో ఇప్పుడు తన ఫిజిక్‌పై ప్రత్యేక దృష్టిపెట్టింది. జిమ్‌లో ప్రతిరోజూ వ్యాయామాలు చేస్తూ తన ఫిజిక్‌ను అందంగా మలచుకుంటోందట. అందమైన తన శరీరాకృతితో ఎప్పటికప్పుడు ఫొటో షూట్స్ చేయించుకుంటోంది ఈ భామ. ఈ ఫొటోలను సోషల్ మీడియాలో అభిమానుల ముందుకు తీసుకువస్తూ వారిని మురిపిస్తోంది. తాజాగా ఈ భామ తన కొత్త ఫొటోను రిలీజ్ చేసి అందరినీ ఆకట్టుకుంది. లేత గులాబీ రంగు ఫ్రాక్‌లో క్లీవేజ్ అందాలతో బంగారు మేని ఛాయతో చూపుతిప్పుకోకుండా చేసింది మెహరీన్. ప్రస్తుతం ఈ అందాల సుందరి గోపీచంద్‌తో 'పంతం' సినిమాలో నటిస్తోంది.

అన్నింటినీ సమానంగా స్వీకరించాల్సిందే


తమన్నా

'విమర్శల వల్ల నా తప్పులను నేను తెలుసుకొని సరైన నిర్ణయాలు తీసుకుంటూ విజయపథంలో పయనిస్తున్నాను. సినిమాలపై నాకున్న ప్యాషనే నన్ను నేను తెలుసుకునేలా చేసింది''అని అంటోంది తమన్నా. ఈ ఏడాది తమిళంలో 'స్కెచ్' చిత్రంతో ఈ భామ అందరినీ అలరించింది. తెలుగులోనూ ఇదే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రస్తుతం అర డజను సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్న తమన్నా మాట్లాడుతూ ''కథానాయికగా నా ప్రయాణం బాలీవుడ్ మూవీ 'చాంద్ సా రోషన్ చెహ్రా' చిత్రంతో ప్రారంభమైంది. అప్పటినుంచి నిరంతరం ఎంతో కష్టపడుతూ నేడు ఉన్నత స్థాయికి చేరుకోగలిగాను. కెరీర్‌లో పలు విమర్శలను ఎదుర్కొన్నాను. విమర్శల వల్ల నా తప్పులను తెలుసుకోగలిగాను. దీంతో పాత్రల ఎంపికలో సరైన నిర్ణయం తీసుకుంటూ విజయాలను అందుకుంటున్నాను''అని చెప్పింది. తమన్నా ప్రస్తుతం నా నువ్వే, క్వీన్, ఏబిసి, ఖామోషి, కన్నె కలై మానెతో పాటు కునాల్ కోహ్లి చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. ఇక తమన్నాకు ఈమధ్య ఓ చేదు అనుభవం ఎదురైంది. ఓ షోరూమ్ ఓపెనింగ్‌కు వెళ్లిన ఆమెపై ఓ ఆకతాయి చెప్పు విసరడంతో అది ఆమెకు కొంచెం దూరంలో పడింది. దీనిపై తమన్నా స్పందిస్తూ ''ఈ చేదు అనుభవాన్ని నా జీవితంలో ఎప్పటికీ మరచిపోలేను. మేం నటులం. మా మీద ప్రేమతో వేసే పువ్వులను, ద్వేషంతో విసిరే రాళ్లను సమానంగా స్వీకరించాల్సిందే''అని పేర్కొంది.

నటనా ప్రతిభకు ప్రశంసలు


రాశిఖన్నా

యంగ్ బ్యూటీ రాశిఖన్నా ఈ ఏడాది ఇప్పటికే రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. టచ్ చేసి చూడు, తొలిప్రేమ చిత్రాలతో అందరినీ పలకరించింది. అయితే 'టచ్ చేసి చూడు' రాశిఖన్నాను నిరాశపరచగా 'తొలిప్రేమ' మాత్రం మంచి విజయాన్ని అందించి సంతోషపరిచింది. 'తొలిప్రేమ'లో వర్ష క్యారెక్టర్‌లో ఈ భామ చక్కగా నటించి ఆకట్టుకుంది. తన గ్లామర్, నటనతో రాశిఖన్నా ప్రేక్షకుల మనసు దోచుకుంది. ఇక ఈ సినిమాలో హీరోతో సమానంగా ఆమె క్యారెక్టర్‌ను డిజైన్ చేశాడు దర్శకుడు వెంకీ అట్లూరి. అందుకు తగ్గట్టుగానే ఈ అమ్మడు కూడా మంచి నటనా ప్రతిభను చూపించందంటూ ప్రశంసలు వస్తున్నాయి. దీంతో రాశి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఇక మెగా కాంపౌండ్‌లో ఈ భామ నటించిన రెండో సినిమా ఇది. తొలి సినిమాను సాయిధరమ్‌తేజ్‌తో కలిసి 'సుప్రీమ్'లో నటించింది. ఆ సినిమాతో సూపర్‌హిట్‌ను అందుకుంది. తాజాగా వరుణ్‌తేజ్‌తో నటించిన 'తొలిప్రేమ' కూడా సూపర్ హిట్ టాక్ సంపాదించడంతో ఈ ఏడాది తెలుగులో 'భాగమతి'తో ఘన విజయాన్ని అందుకున్న అనుష్క తర్వాత స్థానం రాశిఖన్నాదేనని చెప్పక తప్పదు. ఇక 'తొలిప్రేమ'లో వరుణ్‌తేజ్, రాశిఖన్నాల మధ్య కెమిస్ట్రీ చాలా బాగుందని అందరూ అంటున్నారు. గత చిత్రాలతో పోల్చితే నటనాపరంగా ఈ సినిమాలో రాశిఖన్నాలో మంచి పరిణతి కనిపించిందని ప్రశంసిస్తున్నారు. బరువైన, బలమైన పాత్ర ఈ సినిమా ద్వారా తనకు దక్కిందంటూ ఈ భామ సంతోషంగా చెప్పింది.



అంతర్జాతీయ ఎక్స్ఛేంజీల్లో భారత్ సూచీల ట్రేడింగ్ రద్దు

ముంబై: ఇన్వెస్టర్ల పెట్టుబడులు విదేశీ మార్కెట్లకు తరలిపోకుండా దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు అనూహ్య నిర్ణయం తీసుకున్నాయి. ఇతర దేశాల ఎక్స్ఛేంజీలలో భారత్ సూచీల ట్రేడింగ్ లైసెన్స్‌ను నిలిపివేసినట్టు దేశీయ ఎక్స్ఛేంజ్‌లు ప్రకటించాయి. ఇకపై అంతర్జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో తమ సూచీల ట్రేడింగ్‌ను నిలిపివేస్తున్నామని మూడు ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీలు తెలిపాయి. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆదేశాల మేరకు ఎన్ఎస్ఇ, బిఎస్ఇ, మెట్రోపాలిటన్ స్టాక్ ఎక్స్ఛేంజిఆఫ్ ఇండియా (ఎంఎస్ఇఐ)లు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సింగపూర్ స్టాక్ ఎక్స్ఛేంజి(ఎస్‌జిఎక్స్) తదితర ఎక్స్ఛేంజిల ధోరణులతో దేశ మార్కెట్ల నుంచి లిక్విడిటీ విదేశీ మార్కెట్లకు తరలిపోయే అవకాశం ఉందనే ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో విదేశీ ఎక్స్ఛేంజీలు, ట్రేడింగ్ ప్లాట్‌ఫాంల డెరివేటివ్స్ ట్రేడింగ్‌కి సంబంధించి సూచీలు, స్టాక్స్ ధరల వివరాలను అందించేందుకు కుదుర్చుకున్న లైసెన్సింగ్ ఒప్పందాలను తక్షణమే రద్దు చేసుకుంటున్నట్లు మూడు ఎక్స్ఛేంజీలు సంయుక్త ప్రకటనలో తెలిపాయి. ఎస్‌జిఎక్స్ తాజాగా నిఫ్టీ 50లో భాగమైన కంపెనీల స్టాక్స్ ఫ్యూచర్స్‌లో ట్రేడింగ్ ప్రారంభించింది. గతేడాది నిఫ్టీ ఫ్యూచర్‌లో సింగపూర్ 46.3 శాతం మార్కెట్ వాటా(రూ.51 ట్రిలియన్ డాలర్లు) కల్గి ఉంది.

ప్రపంచంలో 12వ సంపన్న నగరం ముంబై

మొత్తం సంపద రూ.950 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా టాప్–15 సంపన్న నగరాల్లో ముంబై 12వ స్థానాన్ని దక్కించుకుంది. దేశీయ ఆర్థిక రాజధాని ముంబై మొత్తం సంపద విలువ 950 బిలియన్ డాలర్లు(85,000 కోట్ల డాలర్లు) అని నివేదిక వెల్లడించింది. న్యూ వరల్డ్ వెల్త్ నివేదిక ప్రకారం, మొదటి స్థానంలో న్యూయార్క్ నగరం ఉండగా, ఆస్తుల విలువ 3 ట్రిలియన్లుగా ఉంది. అయితే ముంబై తర్వాత 14వ స్థానంలో ఫ్రాంక్‌ఫర్ట్.. ఆస్తుల విలువ 912 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ నగరాల్లో వ్యక్తుల ప్రైవేటు ఆస్తులు మొత్తం సంపదగా పరిగణలోకి తీసుకున్నారు. వాటిలో వారి ఆస్తులు.. నగదు, ఈక్విటీలు, వ్యాపార ప్రయోజనాలు, ఇతరత్రా ఉన్నాయి. ప్రభుత్వ నిధులను ఈ గణాంకాల్లో తీసుకోలేదు. బిలియనీర్ జనాభా కల్గిన టాప్ 10 నగరాల్లో కూడా ముంబై ఉంది. ఈ నగరంలో 28 మంది బిలియనీర్లు ఉండగా, ఒక్కొక్కరికి సుమారు ఒక బిలియన్ డాలర్ల(100 కోట్ల) విలువైన ఆస్తులు ఉన్నాయి. భారత్ ఆర్థిక రాజధానిగా ఉన్న ముంబైలో 950 బిలియన్ డాలర్ల సంపద ఉండగా.. 12వ అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ బిఎస్ఇ(బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్)ను కలిగి ఉంది. న్యూయార్క్ తర్వాత రెండో స్థానంలో లండన్ నగరం ఆస్తులు 2.7 ట్రిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఆ తర్వాత స్థానాల్లో ఉన్న టోక్యో 2.5 ట్రిలియన్ డాలర్లు, సాన్‌ఫ్రాన్సిస్కో 2.3 ట్రిలియన్ డాలర్లు సంపద కల్గి ఉన్నాయి. ఇక బీజింగ్ విషయానికొస్తే 2.2 ట్రిలియన్ల డాలర్లు, షాంఘై 2 ట్రిలియన్ డాలర్లు, లాస్ ఏంజిల్స్ 1.4 ట్రిలియన్ డాలర్లు, హాంకాంగ్ 1.3 ట్రిలియన్ డాలర్లు, సిడ్నీ 1 ట్రిలియన్ డాలర్లు, సింగపూర్ 1 ట్రిలియన్ డాలర్లు, చికాగో 988 బిలియన్ డాలర్లు సంపదను కల్గి ఉన్నాయి. టాప్ 15 నగరాల జాబితాలో సాన్ ఫ్రాన్సిస్కో, బీజింగ్, షాంఘై, ముంబై, సిడ్నీలు గత పదేళ్లలో అత్యంత వేగంగా సంపదను పెంచుకున్నాయని నివేదిక వివరించింది.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	28790	30791.44	0.45%
ముంబై	29590	31647.06	0%
ఢిల్లీ	29100	31122.99	0.17%
కోల్‌కతా	29670.99	31733.68	0%
కేరళ	27800	29732.62	0%
బెంగళూరు	28200	30160.43	0%
హైదరాబాద్	28790	30791.44	0.17%
గల్ఫ్	1400.16	1497.50	0.47%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	42600.00	42400.00	0.47
ముంబై	42600.00	42400.00	0.47
ఢిల్లీ	42600.00	42400.00	0.47
కోల్‌కతా	42600.00	42400.00	0.47
హైదరాబాద్	42600.00	42400.00	0.47



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	345	విశాఖపట్నం	340
వరంగల్	347	చిత్తూరు	373
విజయవాడ	335	చెన్నై	380
గోదావరి	335	బెంగళూరు	365

'బేర్' పట్టు బిగిస్తోంది!

ఇన్వెస్టర్లూ... జాగ్రత్త

- ఈక్విటీలపై అంతర్జాతీయ అమ్మకాల ఒత్తిడి
- ఈ వారం కూడా అప్రమత్తంగా ఉండాలి
- హెచ్చరిస్తున్న ఆర్థిక నిపుణులు



న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత రోజు నుంచి దేశీయ స్టాక్ మార్కెట్లు ఆందోళనలో వున్నాయి. లాంగ్ టర్మ్ గెయిన్ పన్నుతో పాటు అంతర్జాతీయంగా అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజీల భారీ పతనం దేశీయంగా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫిబ్రవరి 1 నుంచి చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్(బిఎస్ఇ) 1900 పాయింట్లు పతనం కాగా.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎన్ఎస్ఇ) నిఫ్టీ 50 దాదాపు 500 పాయింట్లు పడిపోయింది. సెక్యూరిటీ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్ అజయ్ త్యాగీ చెప్పిన ప్రకారం, అంతర్జాతీయ అంశాల వల్ల దేశీయ మార్కెట్ల ఒడిదుడుకులు మరికొంత కాలం కొనసాగవచ్చని అన్నారు. అయితే ఈ అమ్మకాల ఒత్తిడితో ఆందోళన చెందొద్దని, భారత్ తగిన రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను కలిగి ఉందని అభయమిచ్చారు.

మరోవైపు అంతర్జాతీయ స్టాక్‌మార్కెట్లలో ఒడిదుడుకులు, స్థూల ఆర్థిక గణాంకాలు ఈవారం కూడా దేశీయ ఈక్విటీ మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే కంపెనీల క్యూ3 ఫలితాలు, క్రూడ్ ఆయిల్ ధరల హెచ్చుతగ్గులు, విదేశీ నిధుల ప్రవాహం, డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలు కూడా మార్కెట్‌ను శాసిస్తాయని, ఈ అంశాలను కూడా గమనించాలని వారు సూచిస్తున్నారు. 'ఈ వారం ఇన్వెస్టర్లు.. క్యూ3 ఫలితాలు, స్థూల డేటా, అంతర్జాతీయ అంశాలపై దృష్టి పెట్టాలి' అని డేల్టా గ్లోబల్ పాట్నర్స్ వ్యవస్థాపకుడు దేవేంద్ర నెవ్గి అన్నారు. గ్లోబల్ మార్కెట్లు ఇప్పటికీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని, వీటి ప్రభావం భారత్ మార్కెట్లను తాకనుందని తెలిపారు. ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) నికర అమ్మకందారులు, దేశీయ ఇన్వెస్టర్ల నుంచి మద్దతు ఉన్నా.. అంతర్జాతీయంగా ఒడిదుడుకుల పరిస్థితులు మార్కెట్లను వెనక్కి లాగుతాయని ఆయన సూచిస్తున్నారు. గత కొద్ది వారాలుగా గ్లోబల్ మార్కెట్లను చూస్తే భారీగా అమ్మకాలు వెల్లువెత్తగా.. దీంతో భారత్ మార్కెట్లు కూడా రెడ్ మార్క్‌లో పడిపోయాయి. కాగా స్థూల ఆర్థిక గణాంకాలూ, విదేశీ మార్కెట్లలో నెలకొనే పరిస్థితులు వంటి అంశాలే దేశీయ మార్కెట్లను ప్రభావితం చేయనున్నాయి. ఫెడరల్ రిజర్వ్ సహా పలు దేశాల కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్ల పెంపు బాటను అనుసరించనున్న అంచనాలతో అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లు పతనమవుతున్నాయి. అమెరికా మార్కెట్లు గత రెండేళ్లలో ఎప్పుడూ లేనివిధంగా గతవారం 5 శాతం కుప్పకూలాయి. దీంతో బేర్ దశలోకి ప్రవేశించినట్లు పలువురు నిపుణులు పేర్కొంటున్నారు.

ద్రవ్యోల్బణం ఎలా ఉండనుంది?



సోమవారం(12న) దేశీయ ద్రవ్యోల్బణం గణాంకాలు వెలువడనున్నాయి. జనవరి నెలకు గాను సిపిఐ(వినియోగ ధరల సూచీ) ఆధారిత ద్రవ్యోల్బణం గణాంకాలను ప్రభుత్వం విడుదల చేయనుంది. ఇదే రోజు డిసెంబర్ నెలలో పారిశ్రామికోత్పత్తి ప్రగతి(ఐఐపి) వివరాలను కూడా వెల్లడించనుంది. 2017 డిసెంబర్‌లో సిపిఐ 5.21 శాతం పెరిగింది. ఇక నవంబర్‌లో ఐఐపి 8.4 శాతం పురోగమించింది. అలాగే ఈనెల 14వ తేదీనాడు జనవరికి టోకు ధరల సూచీ(డబ్ల్యూపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం గణాంకాలను ప్రభుత్వం విడుదల చేయనుంది. 2017 డిసెంబర్‌లో డబ్ల్యూపిఐ 3.58 శాతం పెరగ్గా.. ఇప్పుడు ఎలా ఉండనుందో వేచిచూడాలి. సిపిఐ, ఐఐపి, డబ్ల్యుపిఐ గణాంకాలు తదుపరి ఆర్‌బిఐ పరపతి సమీక్షలపై ప్రభావం చూపనున్నాయి. గత పాలసీ సమీక్షల్లో యథాతథ రేట్లనే ఆర్‌బిఐ కొనసాగించింది. అయితే వచ్చే సమీక్షల్లో మాత్రం వడ్డీ రేట్ల తగ్గింపు పెంపు ఉండొచ్చనే సంకేతాలను ఇచ్చింది. దీంతో ఇన్వెస్టర్లు ధరల తీరును నిశితంగా గమనించనున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఈ వారం పలు బ్లూచిప్స్ క్యూ3 (అక్టోబర్ డిసెంబర్) పనితీరును వెల్లడించనున్నాయి. అమరరాజా, కేశోరామ్, కోల్ ఇండియా ఫలితాలు ప్రకటించాయి.

ఈ నెల 12న బ్రిటానియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, గెయిల్ ఫలితాలు ఉంటాయి. 13న ఎన్‌బిసిసి, ఎన్ఎండిసి, ఇక 14వ తేదీనాడు గ్రాసిమ్, గోద్రెజ్ ఇండస్ట్రీస్, జెట్ ఎయిర్‌వేస్, నెస్లే, సన్ ఫార్మా, టాటా పవర్ పనితీరును వెల్లడించనున్నాయి.

నిఫ్టీ 10,300 దిగువకు పడిపోనుందా?

అత్యధిక వాల్యుయేషన్, అంతర్జాతీయ పరిణామాలు వెరసి సూచీలు కరెక్షన్ బాటపట్టాయి. జనవరి 29నాడు నిఫ్టీ జీవితకాల గరిష్టస్థాయి 11,171 పాయింట్ల స్థాయిని చేరగా.. పలు అంశాలను పరిగణలోనికి తీసుకుంటే ఈస్థాయి అత్యంత కీలకమైన టెక్నికల్ అంశమని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ టెక్నికల్ రీసెర్చ్ అనలిస్ట్ నాగరాజ్ షెట్టి తెలిపారు. ఈ స్థాయినే టాప్‌గా భావిస్తే వచ్చే వారంలో నిఫ్టీ 10,276 పాయింట్ల స్థాయికి పడిపోతుందని భావించవచ్చని విశ్లేషిస్తున్నారు. నిఫ్టీకి 10,400 పాయింట్ల వద్ద సపోర్ట్ ఉన్నప్పటికీ.. ఇక్కడ నిలబడడం కష్టంగానే కనబడుతుందన్న ఆయన చార్టులు పతనాన్నే సూచిస్తున్నాయని పేర్కొన్నారు. ట్రేడర్లు స్టాప్‌లాస్‌లు నిర్వహిస్తు ట్రేడింగ్ చేయడం ఉత్తమమైన నిర్ణయంగా సూచించారు. మరీ ముఖ్యంగా మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్‌లలో పతనం ఎక్కువగా ఉంటుందని సూచించారు. ఇది కేవలం హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ టెక్నికల్ రీసెర్చ్ అనలిస్ట్ నాగరాజ్ షెట్టి అభిప్రాయం మాత్రమే. ఇన్వెస్టర్లు ఏదైనా నిర్ణయం తీసుకోవాడనికి ముందు సలహాదారులనుతమ సొంత అధ్యయనం తరువాత మాత్రమే తుది నిర్ణయం తీసుకోవడం మంచిది.

పిఎస్‌బిల మొండి బకాయిలు రద్దు

రూ.81,683 కోట్లు

☞ 2016–17లో భారీగా పెరిగిన నిరర్థక ఆస్తులు ☞ అత్యధికంగా ఎస్‌బిఐ రూ.20 వేల కోట్ల రుణాలు రద్దు



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ బ్యాంక్‌లు పెద్ద మొత్తంలో మొండి బకాయిలను రద్దు చేశాయి. 2016–17లో దేశీయ అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బిఐ రూ.20,339 కోట్ల మొండి బకాయిలను రద్దు చేసింది. రుణాలను రద్దు చేసిన ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) వాటానే అధికంగా ఉంది. అయితే 2016–17లో అన్ని ప్రభుత్వ బ్యాంకులు మొత్తం రూ.81,683 కోట్ల మొండి బకాయిలను రద్దు చేశాయి. ఎస్‌బిఐలో అనుబంధ బ్యాంకులు విలీనం చేయకముందు గణాంకాలు కావడం గమనార్హం.. 2012–13లో పిఎస్‌యు బ్యాంకులు రద్దు చేసిన మొత్తం రూ 27,231 కోట్లుగా ఉందని ప్రభుత్వ గణాంకాలు తెలిపాయి. అయితే ఈ మొత్తం ఐదేళ్లలోనే మూడు రెట్లు పెరిగింది. ఎస్‌బిఐతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్ 201617లో రూ 9205 కోట్లను, బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ 7346 కోట్లు, కెనరా బ్యాంక్ రూ 5,545 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ 4,348 కోట్ల మేర మొండి బాకీలను రద్దు చేశాయి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరు నెలల్లో బ్యాంకులు రద్దు చేసిన రుణాల మొత్తం రూ 53,625 కోట్లకు పెరిగింది. ఆర్‌బిఐ అంచనాల ప్రకారం, మొత్తం 21 బ్యాంకులకు గాను 9 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తుల(ఎన్‌పిఎ) విలువ 15 శాతానికి పెరగడం ఆందోళన రేకెత్తిస్తోంది. 14 పిఎస్‌బిల స్థూల నిరర్థక ఆస్తులు 12 శాతానికి పైగా పెరిగాయి. ప్రభుత్వ బ్యాంకుల్లో మొండి బకాయిలు పేరుకుపోయిన కారణంగా ఆర్థిక రంగం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోంది. దీంతో ప్రభుత్వరంగ బ్యాంకులకు రానున్న రెండేళ్లలో రూ 2.11 లక్షల కోట్ల మూలధనం సమీకరించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. బాండ్ల ద్వారా ఈ నిధులను సేకరించనున్నట్టు వెల్లడించింది.

లెక్కింపు కొనసాగుతోంది..

15 నెలల కావొస్తున్నా పూర్తికాని ఆర్‌బిఐ పాతనోట్ల ప్రక్రియ

న్యూఢిల్లీ: డీమానిటైజేషన్(నోట్ల రద్దు) చేపట్టి ఇప్పటికి 15 నెలలు కావొస్తోంది. అయినప్పటికీ ఇంకా పాత రూ.500, రూ.1000 నోట్లు నాణ్యత, వాటి లెక్కింపు కొనసాగుతూనే ఉంది. ఈ పనులను వేగంతం చేశామని సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. రద్దయిన నోట్లు మొత్తం ఎన్ని వచ్చాయో తెలియజేయాల్సిందిగా ఆర్‌టిఐ(సమాచార హక్కు చట్టం) ద్వారా ఓ పిటిషన్‌దారుడు కోరగా ఆర్‌బిఐ ఈవిధంగా స్పందించింది. బ్యాంకుల నుంచి వచ్చిన రద్దయిన నోట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతూనే ఉందని ఆర్‌బిఐ వెల్లడించింది. 2017 జూన్ 30 వరకు రూ.15.28 ట్రిలియన్ రద్దయిన నోట్లు వచ్చాయి. ఎప్పటి లోగా నోట్ల లెక్కింపు పూర్తవుతుందనే ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు ఆర్‌బిఐ నిరాకరించింది. మొత్తం 59 సివిపిఎస్(అధునాతన కరెన్సీ పరిశీలన ప్రక్రియ) యంత్రాలతో నోట్లు లెక్కిస్తున్నట్లు ఆర్‌బిఐ పేర్కొంది. ఏ ప్రాంతాల్లో నోట్ల లెక్కింపు జరుగుందనే విషయాన్ని మాత్రం చెప్పేందుకు విముఖత వ్యక్తం చేసింది. ఎనిమిది సివిపిఎస్ యంత్రాలతో బ్యాంకుల్లో నోట్ల లెక్కింపు జరుగుతుండగా, ఏడు సివిపిఎస్ యంత్రాలతో ఆర్‌బిఐ రీజనల్ కార్యాలయాల్లో నోట్ల లెక్కింపు జరుగుతోంది. 2016, నవంబర్ 8న రూ.500, రూ.1000 నోట్లను మోడీ సర్కారు రద్దు చేసింది. 2016–17 వార్షిక నివేదిక ప్రకారం రూ.15.28లక్షల కోట్ల రద్దయిన నోట్లు తిరిగి బ్యాంకులకు వచ్చి చేరాయి. నోట్ల రద్దు చేసే సమయానికి 1,716.5 కోట్ల రూ.500 నోట్లు, అలాగే 685.8 కోట్ల వెయ్యి నోట్లు చెలామణీలో ఉన్నాయి. వీటి మొత్తం విలువ రూ.15.44 లక్షల కోట్లుగా ఉంది



ఆటో ఎక్స్‌పో–2018



ఆదివారం నాడు గ్రేటర్ నోయిడాలోని ఆటో ఎక్స్‌పోలో నిర్వహించిన హోండా సేఫ్టీ ఇండియా కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్



ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించిన వినూత్న బైక్



రెనాల్ట్ సరికొత్త ఎలక్ట్రిక్ వాహనం జోయ్ ఇ–స్పోర్ట్



హుందయ్ కు చెందిన సరికొత్త ఐ20 కారు

రజనీ రంగు కాషాయమైతే కలిసి పనిచేయడం కుదరదు : కమల్



కేంబ్రిడ్జ్ : రాజకీయాల్లోకి వస్తునట్లు ప్రకటించిన తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ ఒకవేళ కాషాయ రాజకీయాలు చేస్తే ఆయనతో రాజకీయ భాగస్వామిగా ఉండబోనని మరో నటుడు కమల్ హాసన్ స్పష్టం చేశారు. తాను రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు ఇటీవల కమల్ ప్రకటించిన విషయం తెలిసిందే. కమల్ అమెరికాలోని హార్వార్డ్ యూనివర్శిటీలో ప్రసంగించారు. ఈ సందర్భంగా రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశం గురించి ప్రస్తావించారు. ఇద్దరి అభిప్రాయాలు, ఆలోచనలు ఒక్కటే అయితే ఆయనతో భాగస్వామ్య పక్షంగా కొనసాగుతారా అన్న ప్రశ్నను కమల్ త్రోసిపుచ్చలేదు. అయితే రజనీ కాషాయ రాజకీయాలు చేయకూడదని, అలా చేస్తే ఆయనతో కలిసి పనిచేయడం సాధ్యం కాదన్నారు. 'రజనీ రాజకీయ రంగు కాషాయం(భాజపా) కాదని భావిస్తున్నా. అదే జరిగితే ఆయనతో కలిసి పనిచేయడం జరగదు. మేమిద్దరం మంచి స్నేహితులమే కానీ, రాజకీయాలు వేరు. ప్రస్తుతానికి దీనిపై స్పష్టత లేదు.' అని అన్నారు. అవసరమైతే ఇతరులతో కలిసి పనిచేస్తారా? అన్న ప్రశ్నకు సమాధాన మిస్తూ.. అలాంటి పరిస్థితి ఉండదని చెప్పారు. ఒకవేళ తన పార్టీకి సరైన మెజార్టీ రాకపోతే అది ప్రజలు ఇచ్చిన తీర్పుగా భావించి, ప్రతిపక్షంలో కూర్చుంటానని అన్నారు.

యుఎఇతో భారత్ ఒప్పందాలు

- విదేశీ చమురుక్షేత్రాల్లో మనకు 10% వాటా
- అరబ్ దేశాల్లో మోడీ పర్యటన



అబుధాబి: అబూధాబి యువరాజు మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ప్రధాని నరేంద్ర మోడీ విస్తృత స్థాయి చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య ఈ సందర్భంగా ఐదు ఒప్పందాలు కుదిరాయి. విదేశీ చమురుక్షేత్రంలో భారతీయ చమురు కంపెనీలకు 10 శాతం వాటాపై కూడా చారిత్రక ఒప్పందం కుదిరింది. మూడు దేశాల పర్యటనలో భాగంగా మోడీ జోర్డాన్ నుంచి అబుధాబి చేరకున్నారు. ఆయనకు మహ్మద్ బిన్ జాయెద్, ఇతర రాచరిక కుటుంబ సభ్యులు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. రాజభవనానికి మొదటిసారి విదేశీ నాయకుడిని అబుధాబి యువరాజు ఆహ్వానించడం ఇదే నని చెప్పాలి. ఆధునిక దేశంగా యుఎఇని మలచడంలో భారతీయ కార్మికులు పోషించిన పాత్రను కూడా యువరాజు జాయెద్ కొనియాడారు. ప్రతినిధుల బృందం స్థాయి చర్చలు జరగడానికి ముందు ప్రధాని మోడీ యువరాజు జాయెద్‌తో మాటామంతీ జరిపారు అని విదేశీ వ్యవహారాల ప్రతినిధి రవీశ్ కుమార్ చెప్పారు. సంబంధాలను మెరుగుపరుచుకోడానికి ఇరు దేశ నాయకులు చర్చించారని కూడా కుమార్ తెలిపారు. వారి చర్చల అనంతరం విద్యుత్ , రైల్వే, శ్రామిక, ఆర్థిక సేవల రంగాలకు సంబంధించిన ఐదు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. అబుధాబి నేషనల్ ఆయిల్ కంపెనీ(ఎడిఎన్‌ఒసి)తో భారతీయ కన్సార్టియం(ఒవిఎల్, బిపిఆర్ ఎల్, ఐఒసిఎల్) అవగాహన పత్రంపై సంతకాలు చేసుకుంది. దీని ప్రకారం అబుధాబి ఆఫ్‌షోర్ లోయర్ జకుమ్ కన్సెషన్‌లో భారతీయ కన్సార్టియంకు 10 శాతం పార్టిసిపేటింగ్ ఇంటరెస్ట్ వాటా లభించనున్నది. ఈ కన్సెషన్ 2018 నుంచి 2057 వరకు ఉండనున్నది. ఇందులో 60 శాతం వాటా ఎడిఎన్‌ఒసికి, 30 శాతం వాటాలు ఇతర అంతర్జాతీయ చమురు కంపెనీలకు దక్కనుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే మౌలికవసతుల కల్పనకు కూడా ఇరు దేశాలు ఒప్పందాన్ని చేసుకున్నాయి. ఆర్థిక రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోడానికి వీలుగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, అబుధాబి సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ అవగాహన పత్రంపై సంతకాలు చేశాయి. ప్రధాని మోడీని స్వాగతిస్తూ అబుధాబిలోని అనేక భవనాలపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. మోడీ యుఎఇ సైనికుల స్మృతి ప్రదేశమైన వహత్ అల్ కరమను ఆదివారం సందర్శించి అమరవీరులకు అంజలి ఘటించారు. ప్రధాని మోడీ యుఎఇ నుంచి ఒమన్ చేరుకున్నారు. అక్కడ ఆయనకు ఘనస్వాగతం లభించింది.

మందిరానికి మోడీ శంకుస్థాపన

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యుఎఇ)కు చెందిన అబుధాబిలో తొలి హిందూ ఆలయ నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేశారు. ఈ మందిరం మానవత్వం, సామరస్యం ప్రేరకం కావడమేకాక భారత గుర్తింపు మాధ్యమం కూడా కానున్నదని మోడీ అన్నారు. 55 వేల చదరపు మీటర్ల స్థలంలో ఈ ఆలయాన్ని నిర్మించబోతున్నారు. భారతీయ ఆలయ శిల్పులు కుడ్యాలు చెక్కారు. వాటిని యుఎఇలో అనుసంధానం చేస్తారు. 2020 నాటికి ఈ ఆలయ నిర్మాణం పూర్తి కానుంది. బోచసాన్వాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ(బిఎపిఎస్) ఆధ్వర్యంలో ఈ ఆలయ నిర్మాణ ప్రాజెక్టు కొనసాగనున్నది. ఈ ఆలయంలోకి అన్ని మతాలవారు ప్రవేశించవచ్చు. ఈ ఆలయం ఢిల్లీలో ఉన్న బిఎపిఎస్ మందిరంను పోలి ఉండనుంది. ఆలయ శంకుస్థాపన అనంతరం దుబాయ్ ఒపెరా హౌస్‌లో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా భారతీయులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోడీ మాట్లాడుతూ 'ఆలయ నిర్మాణానికి అంగీకరించిన దుబాయ్ యువరాజుకు 125 కోట్ల భారతీయుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. దుబాయ్ పాలకులకు భారత సాంస్కృతిక చరిత్రపై గౌరవం ఉంది. ఇప్పుడు మన తరఫున తప్పు జరగకుండా చూడడం మన బాధ్యత' అన్నారు.

మధ్యప్రదేశ్‌లో టీచర్లకూ డ్రెస్‌కోడ్

భోపాల్ : ప్రభుత్వ టీచర్లకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం డ్రెస్ కోడ్ తప్పనిసరి చేసింది. ఉపాధ్యాయినులు జేగురు రంగు జాకెట్, ఉపాధ్యాయులు నేవీ బ్లూకలర్ జాకెట్‌ను ధరించాలని ఆదేశించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ డ్రెస్‌కోడ్‌ను విద్యా శాఖ ప్రకటించింది. వ్యక్తిత్వ వైరుధ్యాలను నిరోధించి, ఏకరూపత తేవడానికే ఈ ఆదేశాలిచ్చినట్లు పేర్కొంది. వస్త్ర ధారణకు చాలా ప్రాధాన్యం ఉందని తెలిపింది. ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఈ విధంగా వస్త్రాలను ధరించడం మాత్రమే కాకుండా, తమ జాకెట్లపై 'రాష్ట్ర నిర్మాత' (జాతి నిర్మాత) అని రాసిన ట్యాగ్ ధరించాలని విద్యా శాఖ పేర్కొంది. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో టీచర్ల పాత్ర కీలకమైనదని తెలిపింది.

సులువుగా ప్రశ్నపత్రాలు : యోగి

లక్నో : విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా సులువుగా జవాబులు రాసేలా ప్రశ్నపత్రాలను రూపొందించాలని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సూచించారు. ఈ మేరకు విద్యాశాఖాధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సిఎం ఆదేశాలపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ బోర్డు పరీక్షలకు 66 లక్షల మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, నాలుగు రోజుల్లో 10 లక్షల మందికి పైగా గైర్హాజరయ్యారు. 2017లో ఐదు లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఈ విధంగా విద్యార్థులు పరీక్షలంటే భయపడుతుండటంతో యోగి స్పందించారు. పరీక్షల విధానాన్ని సులభతరం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్నలు కఠినంగా ఉంటే విద్యార్థులు సిద్ధం కావడానికే జంకుతారని, అలాంటి పద్ధతి వారిని స్కూల్‌కు రప్పించడానికి తోడ్పడదని అన్నారు.

హెల్మెట్ ఉంటేనే బైక్ పూజ



పరదీప్ : ద్విచక్ర వాహనదారుల రక్షణార్థం ఒడిశాలోని ఓ దేవాలయం వినూత్న చర్యను అవలంబిస్తుంది. జగత్‌సింగ్‌పూర్ జిల్లాలో ఉన్న వెయ్యేళ్లనాటి పురాతన దేవాలయంలో హెల్మెట్ ఉంటేనే ద్విచక్ర వాహనాలకు పూజారులు పూజలు చేస్తున్నారు. హెల్మెట్ లేని వారి వాహనాలకు పూజలు చేసేందుకు నిరాకరిస్తున్నారు. పోలీసుల ఆదేశాలకు మాత 'మా సరళ' దేవాలయంలో నెల రోజుల నుంచి 'నో హెల్మెట్– నో పూజ' విధానాన్ని ఆలయ నిర్వాహకులు అమలు చేస్తున్నారు. ఒకవేళ ద్విచక్ర వాహనదారులు భద్రతా చర్యలు పాటించకుంటే పూజలు చేసేందుకు నిరాకరిస్తున్నట్లు ఆలయ పూజారులు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదానికి గురైనప్పుడు సాధ్యమైనంత వరకు మరణాలను తగ్గించే వ్యూహంలో భాగంగా 'నో హెల్మెట్– నో పూజ' విధానాన్ని అమలు చేయాలని జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాలయాల నిర్వాహకులతో ఇటీవల పోలీసులు చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో పోలీసుల ఆదేశాలకు కట్టుబడి పూజారులు హెల్మెట్ ఉంటేనే వాహనాలకు పూజ చేస్తున్నట్లు జగత్‌సింగ్‌పూర్ ఎస్‌పి జై నారాయణ పంకజ్ తెలిపారు. మా సరళ దేవాలయానికి తమ వాహనాలకు పూజలు చేయించుకునేందుకు అనేక మంది వాహనదారులు వస్తుంటారని ఆయ న చెప్పారు. నూతన ద్విచక్ర వాహనాలతో నిత్యం ఈ ఆలయం కిక్కిరిసిపోతుందని, దీంతో నో హెల్మెట్ – నో పూజ విధానాన్ని అక్కడ అమలు చేయాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. తమ నిర్ణయానికి పూజారులు సహకరిస్తుండడం ఎంతో ఆనందం కలిగిస్తుందన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికమవుతుండడంతో వాటిని అరికట్టేందుకు జిల్లా పోలీసులు వినూత్న ఆలోచనలు చేస్తున్నారు.

మద్దతు ధరకు లక్ష కోట్లు అవసరం



పశ్చిమగోదావరి : రైతులకు మద్దతు ధర అందించాలని సిపిఎం అగ్రనేత ప్రకాశ్‌కారత్ పాలక వర్గాలను డిమాండ్ చేశారు. రైతులకు మద్దతు ధర అందించేందుకు లక్ష కోట్లు అవసరమని ఆయన పేర్కొన్నారు. భీమవరంలో రెండో రోజు సిపిఎం రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు బడ్జెట్ కాదని ఆయన తెలిపారు. రెండు వేల కోట్లు మాత్రమే బడ్జెట్ కేటాయించారని, అటువంటప్పుడు అది రైతు బడ్జెట్ ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. సాగుకు పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల్లో రైతులు కూరుకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకునేందుకు పాలకవర్గాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆయన కోరారు.

మావోయిస్టు దంపతులు అరెస్టు

తిరువల్లూర్ : తమిళనాడులో మావోయిస్టు దంపతులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్, విప్లవ సాహిత్యం, ప్రభుత్వ వ్యతిరేక ప్రచారానికి ఉపయోగించే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అత్యాధునిక ఆయుధాలను ఉపయోగించడం, అడవుల్లో ఉండి పోరాటం చేయడంపై కర్ణాటకలో వీరు శిక్షణ పొందినట్లు పోలీసులు పేర్కొన్నారు. మావోయిస్టు నేత డి. దశరథన్ 2003 నుంచి, ఆయన భార్య షెన్‌బగవల్లి అలియాస్ కనిమొళి దశాబ్ద కాలంగా అజ్ఞాతంలో ఉన్న వీరిని శనివారం అరెస్టు చేసినట్లు వారు చెప్పారు. మావోయిస్టుల ఉద్యమానికి అవసరమయ్యేందుకు నియామకాలు జరపడానికి వీరు ప్రయత్నిస్తున్నారన్నారు. అదే విధంగా వీరికి ఆశ్రయమిచ్చిన దశరథన్ సోదరుడు వెట్రి వీరపాండియన్‌ను కూడా అరెస్టు చేశామన్నారు. నిఘా వర్గాల పక్కా సమాచార మేరకు పోలీసు బృందం వీర పాండియన్‌ను వెంబడించింది.

శ్రీవారిని దర్శించుకున్న హరీశ్‌రావు

తిరుమల : తిరుమల శ్రీవారిని తెలంగాణ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదివారం ఉదయం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆయన శ్రీవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు, స్వామివారి తీర్థ ప్రసాదాలు, స్వామివారి శేష వస్త్రాలు అందించారు.



నవ్వడానికి ఎవరి అనుమతి అవసరం లేదు : రేణుకా చౌదరి



పనాజీ : జిఎస్‌టి అంశంపై తాను నవ్వలేదని, అయినా తాను నవ్వడానికి ఎవరి అనుమతి అవసరం లేదని కాంగ్రెస్ ఎంపి రేణుకా చౌదరి అన్నారు. తాను నవ్విన ఘటనపై ప్రధానమంత్రి మోడీ చేసిన వ్యాఖ్యలు మహిళల పట్ల అతని వైఖరిని తెలియజేస్తున్నాయని విమర్శించారు. తన నవ్వుపై మోడీ విమర్శలు చేసిన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా మహిళల నుంచి తనకు విశేషమైన మద్దతు లభిస్తోందని చెప్పారు. 'ఐదుసార్లు ఎంపి అయిన తనపై ప్రధాన మంత్రి ఓ ప్రతికూల పాత్ర పేరుతో విమర్శ చేశారు. ఇప్పుడు మహిళల్లో మార్పు వచ్చిందన్న విషయాన్ని ఆయన మరిచారు. తాము ఎలా మాట్లాడాలో తెలుసుకోవాలి. మహిళల పట్ల ఆయన వైఖరికి ఇది నిదర్శనం' అని ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. మనం సక్రమంగా ఉంటే అది అంతటా ప్రతిబింబిస్తుందని అన్నారు.

హైకోర్టుల్లో 400 జడ్జి పోస్టులు ఖాళీ



న్యూఢిల్లీ : దేశంలోని 24 హైకోర్టుల్లో ఈనెల 1 నాటికి దాదాపు 400 ఖాళీలు ఏర్పడినట్టు న్యాయ మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడించాయి. అయితే, శనివారం కర్ణాటక హైకోర్టుకు ఐదుగురు న్యాయమూర్తుల నియామకం జరిగింది. ఈనెల 1 నాటికి మొత్తం 1079 న్యాయమూర్తుల పోస్టులకు గాను 403 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత మాసంలో ఈ సంఖ్య 397గా ఉంది. 'ప్రభుత్వం కర్ణాటక హైకోర్టుకు ఐదుగురు అదనపు న్యాయమూర్తులను నియమిస్తూ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. మరిన్ని నియామకాలకు వివిధ స్థాయిల్లో క్లియరెన్స్ జరుగనుంది' అని న్యాయ మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు తెలిపారు. అయితే, నియామకాలకు ప్రభుత్వం, న్యాయశాఖ నుంచి ఇంకా అనుమతులు రావాల్సివుందని మరో అధికారి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు అగ్రశ్రేణి న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు కొలీజియం హైకోర్టుల్లో నియామకాలను చేపడుతుంది. అలాగే, సుప్రీంకోర్టులో నియామకాలను ఐదుగురు సీనియర్ జడ్జిలతో కూడిన కొలీజియం చేస్తుంది. ఇదే మాదిరిగా హైకోర్టుల్లో ఉండే కమిటీలు (హెచ్‌సి కొలీజియం) అభ్యర్థులను ఎంపిక చేసి, వారి పేర్లు, సర్వీసు రికార్డులను న్యాయ మంత్రిత్వశాఖలకు పంపుతాయి. ఇంటెలిజెన్స్ బ్యూరో వీటిని పరిశీలించిన అనంతరం న్యాయ మంత్రిత్వశాఖ ఈ పేర్లను ముగ్గురు సభ్యుల ఎస్‌సి కొలీజియంతో కూడిన ప్రధాన న్యాయమూర్తి పరిశీలన నిమిత్తం పంపుతుంది.

ముస్లిం పర్సనల్ లాబోర్డు నుంచి నద్వీకి ఉద్వాసన



న్యూఢిల్లీ: అయోధ్య నుంచి బాబ్రీ మసీదును మరో ప్రదేశానికి మార్చమన్నందుకు కార్యనిర్వాహక సభ్యుడు సల్మాన్ నద్వీని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు(ఎఐఎంపిఎల్‌బి) బహిష్కరించింది. సంస్థ వైఖరికి భిన్నంగా నద్వీ వ్యవహరించినందుకు వేటు వేసింది. అయోధ్యలో మసీదు నిర్మాణం విషయంలో తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని ఎఐఎంపిఎల్‌బి ఆదివారం పునరుద్ఘాటించింది. 'మసీదును దానం చేయడం, అమ్మడం, మరో ప్రదేశానికి మార్చడం కుదరదన్న ఎఐఎంపిఎల్‌బి పాత నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని కమిటీ ప్రకటించింది. ఆ వైఖరికి వ్యతిరేకంగా వ్యవహరించినందుకే నద్వీని బహిష్కరించాం' అని ఎఐఎంపిఎల్‌బి సభ్యుడు ఖాసిం ఇల్యాస్ చెప్పారు. హైదరాబాదులో శనివారం జరిగిన ఎఐఎంపిఎల్‌బి 26వ ప్లీనరీలో 'అయోధ్య వివాదాస్పద ప్రదేశం నుంచి మసీదును వేరే ప్రదేశానికి మార్చాలి, అయోధ్య వివాద పరిష్కారానికి అక్కడ ఓ విశ్వవిద్యాలయం కట్టడాన్ని పరిశీలించాలి' అని నద్వీ సూచించారు. హన్‌బ్లీ ఇస్లామీయ ధార్మిక పాఠశాలలో మౌలాన నద్వీ ప్రసంగిస్తూ 'మసీదును వేరే ప్రదేశానికి మార్చాలి. దీనికి ముస్లింలు కూడా అంగీకరిస్తారు' అని అన్నారు. ఆ వీడియో క్లిప్పింగ్ కాస్తా వైరల్‌గా వ్యాప్తి చెందింది. అయోధ్య అంశంపై అనేక అర్జీలను సుప్రీంకోర్టు విచారణ చేస్తున్నప్పుడు ఈ ప్రకటనను నద్వీ గురువారం చేశారు. సుప్రీంకోర్టు అయోధ్య కేసును కేవలం భూవివాదంగా మాత్రమే విచారిస్తానని పేర్కొంది.

గెలిస్తే స్మార్ట్‌ఫోన్

త్రిపురలో బిజెపి మెనిఫెస్టో విడుదల



అగర్తలా: త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకు బిజెపి పార్టీ మెనిఫెస్టోను ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విడుదల చేశారు. అందులో రాష్ట్రంలో బిజెపికి అధికారం కట్టబెడితే ప్రత్యేక ఆర్థిక మండళ్ల(సెజ్‌లు) రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామని, యువతకు ఉచితంగా స్మార్ట్‌ఫోన్లు ఇస్తామని ప్రకటించారు. 60 సభ్యులుండే త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 18న జరగనుంది. బిజెపి 51 స్థానాలకు పోటీపడుతుండగా, దాని మిత్రపక్షం ఇండీజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపిఎఫ్‌టి) తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను నిలబెడుతున్నది. 'విజన్ డాక్యుమెంట్ త్రిపుర 2018' పేరిట బిజెపి తన మెనిఫెస్టోను విడుదల చేసింది. ఆహార శుద్ధి, వెదు రు, ఐటి, జౌళి వంటి రంగాలకు ప్రత్యేక ఆర్థిక మండళ్లను ఏర్పాటు చేస్తానని పేర్కొం ది. ప్రతి ఇంట్లో మహిళలు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసే వరకు ఉచిత విద్యను అందిస్తానని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 7వ వేతన కమిషన్ సిఫార్సుల మేరకు జీతాలు ఇస్తామని, యువతకు ఉచితంగా స్మార్ట్‌ఫోన్లు ఇస్తామ ని ప్రకటించింది. ప్రతి నియోజకవర్గానికి ఒక డిగ్రీ కళాశాల ఉండేలా చూస్తామని కూడా జైట్లీ చెప్పారు. తగినన్ని మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు కూడా నెలకొల్పుతామన్నారు. ఈశాన్య ప్రాంతానికంతటికీ త్రిపురను రవాణా కేంద్రం (ట్రాన్స్‌పోర్టు హబ్)గా మారుస్తామన్నారు. అగర్తలా విమానాశ్రయానికి త్రిపుర చివరి రాజు బీర్ బిక్రమ్ కిశోర్ మాణిక్య పేరు పెడతామన్నారు. రోజ్ వ్యాలీ కుంభకోణం దర్యాప్తు జరిపి దోషులను జైలులో పెడతామన్నారు.

ఐదేళ్లు శిక్ష పడితే పోటీకి అనర్హులు

న్యూఢిల్లీ : వివిధ కేసుల్లో నిందితులుగా కోర్టు నిర్ధారించి కనీసం ఐదేళ్ల జైలు శిక్ష పడిన వారిని ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా ప్రకటించేలా చట్టాన్ని సవరించాలని కేంద్రానికి ప్రతిపాదించినట్టు భారత ఎన్నికల సంఘం (ఇసి) సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఈ మేరకు ఇసి అఫిడవిట్‌ను సమర్పించింది. తాము రాజకీయాలను నేరరహితంగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దీనికోసం ప్రతిపాదనలు చేశామని పేర్కొంది. అయితే, రాజకీయాలను నేరరహితంగా చేసేందుకు అవసరమైన చర్యల కోసం చట్టాలను సవరించాల్సిన అవసరం ఉందని, అప్పుడే అది ఎన్నికల సంఘానికి సాధ్యమవుతుందని వివరించింది. ఎన్నికలకు ఆరు మాసాలకు ముందు నేరారోపణలపై కోర్టు కనీసం ఐదేళ్ల శిక్ష విధించిన వారిని ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా చేయాలని కోరింది. అయితే, ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టనుంది.

సైనిక స్థావరాల్లో భద్రతకు నిధులు

న్యూఢిల్లీ : దేశ సరిహద్దుల్లో మాటిమాటికి ఉద్రిక్తతలు నెలకొంటున్న విషయం తెలిసిందే. జమ్ముకశ్మీర్‌తో పాటు దేశంలోని అన్ని సైనిక స్థావరాల్లో భద్రతను పెంచేందుకు రక్షణ శాఖ రూ.1487 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత పనులను పది నెలల్లో పూర్తి చేయాలని ఆమె తన ఆదేశాల్లో పేర్కొన్నారు. 2016లో పఠాన్‌కోట్ వైమానిక దళ స్థావరంపై ఉగ్రవాదులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సైనిక స్థావరాల భద్రతపై సమీక్ష కోసం లెఫ్టినెంట్ జనరల్ ఫిలిప్ కంపోస్ నాయకత్వంలో ఓ కమిటీని కేంద్రం నియమించింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకే రక్షణ శాఖ సైనికస్థావరాల్లో భద్రత పెంచాలని నిర్ణయం తీసుకుంది.



రాజస్థాన్‌లో భారీగా బంగారం నిల్వలు

11.48టన్నుల పసిడి!



జైపూర్ : రాజస్థాన్‌లో భారీ మొత్తంలో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు తేలింది. భూ ఉపరితలానికి 300 అడుగుల లోతులోనే అవి ఉన్నట్టు భూభౌతిక శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ మేరకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జిఎస్ఐ) డైరెక్టర్ జనరల్ ఎన్.కుటుంబరావు తెలిపారు. పసిడి నిల్వలు 11.48 కోట్ల టన్నుల మేర ఉండవచ్చని, వీటిలో అధికభాగం బన్‌స్వారా, ఉదయ్‌పుర్ నగరాల్లో కేంద్రీకృతమై ఉన్నట్లు చెప్పారు. రాగి, బంగారం వెలికితీత పనులు చేపట్టామన్నారు. సికర్ జిల్లాలోని నీమ్ కా థానా ప్రాంతంలోనూ ఈ పనులు జరుగుతున్నాయని చెప్పారు. జైపుర్‌లో సీసం, జింక్ నిక్షేపాలు కూడా ఉన్నట్లు తెలుస్తోందన్నారు. రాజ్‌పురాదరీబా గనుల్లో 35 కోట్ల టన్నుల సీసం, జింక్ నిల్వలు ఉంటాయని అంచనావేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రాజస్థాన్ పరిధిలోని భూమిలో 8 కోట్ల టన్నుల రాగి నిల్వలను కనుగొన్నారు.

మందుపాతర పేలి జవాను మృతి

మన తెలంగాణ/భద్రాచలం : తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని తోగ్గూడెం తిప్పాపురం మధ్య ఆదివారం ఉదయం మావోయిస్టులు మందుపాతర పేల్చారు. ఈ ఘటనలో సచిన్ హేమ్లా(36) అనే జవాన్ చనిపోయాడు. మరో ముగ్గురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. దీంతో ఈ ప్రాంతంలో పోలీసులు మావోయిస్టుల కోసం కూంబింగ్ నిర్వహిస్తున్నారు.

ఎదురెదురుగా రెండు విమానాలు



ముంబయి : గగనతలంలో పెద్ద ప్రమాదం తృటిలో తప్పిపోయింది. సుమారు 27వేల అడుగుల ఎత్తు లో రెండు విమానాలు ఎదురెదురుగా వచ్చాయి. దీంతో వెంటనే విమాన పైలట్లు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన బుధవారం జరుగగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. దీంతో విమానాల ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఎఎఐబి) విచారణ ప్రారంభించింది. 152 మంది ప్రయాణికులతో ఢిల్లీ నుంచి వస్తున్న విస్తారా, 109 మంది ప్రయాణికులతో భోపాల్ నుంచి వస్తున్న ఎయిరిండియా విమానాలు ముంబై గగనతలంలో బుధవారం నాడు ఎదురెదురుగా అతి సమీపంలోకి వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన ఆటోమేటిక్ వార్నింగ్ సిస్టమ్ పైలెట్లను హెచ్చరించింది. దీంతో ప్రమాదం తప్పిపోయింది. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు విస్తారా విమాన పైలట్లను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) తొలగించింది. ఈ రెండు విమానాలు సెకన్ల వ్యవధిలోనే రెండు విమానాలు ఎదురెదురుగా వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన విమాన పైలట్లు ప్రమాదం జరగకుండా చాకచక్యంగా వ్యవహరించారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఎటిసి) సమాచారం ప్రకారం విస్తారా 29వేల అడుగుల ఎత్తులో ప్రయాణించాల్సి ఉంది. కాని నిబంధనలకు విరుద్ధంగా విస్తారా పైలట్లు వ్యవహరించినందుకు గాను డిజిసిఎ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎదురెదురుగా వచ్చిన సమయంలో విమానాల మధ్య దూరం కేవలం 100 అడుగులు మాత్రమే.



చైనా-పాక్ కారిడార్‌కు పొంచివున్న ముప్పు!

బీజింగ్ : చైనాపాకిస్తాన్ ఎకనమిక్ కారిడార్ (సిపిఇసి) నిర్మాణంలో పెద్ద అవరోధం ఎదురుకానుంది. చైనాలోని జిన్‌జియాంగ్ నుంచి పాక్‌లోని గ్వదార్ పోర్టు గుండా వెళ్తున్న ఈ ప్రాజెక్టుపై నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గ్వదార్ వద్ద దీనికి పెను ముప్పు పొంచి ఉన్నట్లు వారు చెబుతున్నారు.'చైనీస్ యూనివర్సిటీ ఆఫ్ హంగ్ కాంగ్'కు చెందిన సీనియర్ శాస్త్రవేత్త యాంగ్ హంగ్‌ఫెంగ్ ఈ తీర ప్రాంతంపై మూడు దశాబ్దాలుగా పరిశోధనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్వదార్ చాలా ప్రమాదకరమైన ప్రాంతం అని ఆయన చెబుతున్నారు. మక్రాన్ ట్రెంచ్‌కు సమీపంలో ఉన్న గ్వదార్ పోర్టు గతంలో పెను భూకంపంతో సర్వనాశనం అయ్యింది. 1945లో రిక్టర్ స్కేల్‌పై 8.1 తీవ్రతతో పెను భూకంపం ఇక్కడ సంభవించింది. సునామీ ధాటికి ఇరాన్, పాక్, ఒమన్, ఇండియా తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. ఈ ప్రకృతి విలయంలో 4 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు ఆ ప్రాంతం గుండానే చైనా మెగా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. ఇందుకోసం 40 ఏళ్లపాటు చైనా ఈ ప్రాంతాన్ని లీజుకు తీసుకుంది. అంతేకాదు ఇక్కడ ఓ నేవల్ బేస్‌ను నెలకొల్పాలన్న ఆలోచనలో డ్రాగన్ కంట్రీ ఉండగా భారత్ దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇక ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆసియా, ఆఫ్రికా, యూరప్ దేశాలకు రవాణా సదుపాయాలు, ఆర్థికాభివృద్ధి సాధించాలన్నది చైనా లక్ష్యం.

16 మంది ఉగ్రవాదులు హతం

కైరో: ఈజిప్టులో ఆదివారం ఉగ్రవాద స్థావరాలపై సైన్యం జరిపిన దాడిలో 16 మంది ఉగ్రవాదులు హతమయ్యారు.ఉత్తర సినాయ్ ప్రాంతంలోని సరిహద్దు జిల్లాల్లో భద్రతను కట్టుదిట్టం చేసిన సైన్యం, గత కొద్ది రోజులుగా ఉగ్రవాద స్థావరాలపై దాడులు నిర్వహిస్తోంది. ఈ దాడిలో 66 ఉగ్ర స్థావరాలు, ఆయుధ కేంద్రాలు,11వాహనాలు,మిలిటెంట్లు వినియోగిస్తున్న లైసెన్స్‌లేని 31ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయని సైన్యం తెలిపింది. 30మంది అనుమానిత ఉగ్రవాదులను అరెస్ట్ చేశామని తెలిపింది.'ఆపరేషన్ సినాయ్ 2018'కొనసాగేటప్పుడు అప్రమత్తంగా ఉన్నట్లు గత శుక్రవారం పోలీసులు,సైన్యం ప్రకటించాయి.2013లో అప్పటి ఇస్లామిస్ట్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ మోర్సిని సైన్యం బలవంతంగా పదవీ నుంచి తొలిగించింది.దీంతో పోలీసులు, సైన్యాన్నిలక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారు. అప్పటి నుంచి ఉగ్రవాదులు జరిపిన వందలాది మంది పోలీసులు,సైనికులు మృతి చెందారు.

బస్సు బోల్తా, 19 మంది మృతి




హంగ్‌కాంగ్ : దక్షిణ చైనాలోని హంగ్‌కాంగ్ సబ్ అర్బన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శనివారం సాయంత్రం డబుల్ డెక్కర్ బసు అదుపు తప్పి బోల్తా పడటంతో 19 మంది మృతి చెందారు. డజన్ల మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో నలుగురు మహిళలు ఉన్నారని అధికారులు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రయాణికులతో నిండిన డబుల్ డెక్కర్ బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు స్థానిక మీడియాలో ప్రచురి తమ య్యాయి. సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అయ్యాయి. బస్సు పక్కకు ఒరిగి కనిపిస్తుండగా, క్షతగాత్రులకు అత్యవసర సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్న దృశ్యాలు కనిపించాయి. బస్సు ఉపరితలాన్ని తెరిచి క్షతగాత్రులను వెలికి తీశారు. బస్సును నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

పాక్ మానవ హక్కుల నేత అస్మా జహంగీర్ కన్నుమూత



లాహోర్ : పాకిస్థాన్‌కు చెందిన సుప్రసిద్ధ మానవ హక్కుల న్యాయవాది, సంఘ సేవకురాలు అస్మాజహంగీర్ లాహోర్‌లో కన్నుమూశారు. ఆమె వయస్సు 66 సంవత్సరాలు. ఆదివారం అస్మా జహంగీర్ గుండెపోటుతో మృతి చెందినట్లు ఆమె కుమార్తె మునిజే జహంగీర్ తెలిపారు. ఉదయం గుండెపోటు రావడంతో ఆమెను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అక్కడే తుది శ్వాస విడిచారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తె మునిజే జహంగీర్ టివి యాంకర్‌గా పనిచేస్తోంది. అస్మా జహంగీర్ పాక్ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా పని చేశా రు. 1983లో జియాఉల్ హక్ అధ్యక్షుడుగా సుదీర్ఘకాలం మిలటరీ పాలన కొనసాగినప్పుడు ప్రజాస్వామ్య పునరుద్ధరించాలని ఆందోళన చేపట్టి జైలు శిక్ష అనుభవించారు. పాక్‌లోఅదృశ్యమైన వ్యక్తుల అంశాన్ని ఆమె తరచుగా లేవనెత్తేవారు. ఆస్మా మృతికి న్యాయవాదులు, హక్కుల కార్యకర్తలు, రాజకీయ నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

మోడీ ఆస్కార్‌ను మించిన నటుడు




మన తెలంగాణ/న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌పై సమాధానం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యా ఖ్యలకు కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు కెవిపి కౌంటర్ ఇచ్చారు. మోడీ ఆస్కార్‌కి మించిన నటుడని వ్యాఖ్యానించారు. ఆది వారం ఆయన ఢిల్లీలోని తన నివాసంలో విలేకరుల తో మాట్లాడుతూ.. కనీస అవగాహన లేకుం డా మోడీ లోక్‌సభలో లేకుం డా కాంగ్రెస్‌ని ఉద్దేశించి అబద్దాలు మాట్లాడారని అన్నారు. ఎపికి చెందిన మాజీ సీఎంలను కాంగ్రెస్ పార్టీ అవమానించిందనే విషయంలో ఎంతమాత్రం నిజం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య మీద మోడీ అపారమైన జాలి, కరుణ చూపించినందుకు ధన్యవాదాలు అని అన్నారు. అంజయ్యని కాంగ్రెస్ చాలా అవమానించిందని మోడీ చెబుతున్నారని, అంజయ్య మామూ లు కూలీగా, సామాన్యుడిగా బ్రతికేవారని అన్నారు. అంజయ్య 1957 నుంచి చనిపోయేంత వరకు కాం గ్రెస్‌లోనే ఉన్నారని చెప్పారు. ఆయనకి కుల బలం లేదని, కానీ ప్రజా బలం ఉందని వ్యాఖ్యానించారు. అంజయ్య చనిపోయాక కూడా ఆయనను కాంగ్రెస్ పార్టీ గౌరవించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంజయ్యకి ఇన్ని చేసినా, కాంగ్రెస్ పార్టీ అంజయ్యని అవమానిం చారని మోడీ మాట్లాడ టం విడ్డూరంగా ఉందన్నారు.

మాకు దక్కాల్సినవే అడుగుతున్నాం

బిజెపి లెక్కలను తిప్పికొట్టిన టిడిపి నేతలు

విభజన హామీలు నెరవేర్చండి



అమరావతి : విభజనతో నష్టపోయిన రాష్ట్రానికి దక్కాల్సిన ప్రయోజనాలను నెరవేర్చాలని మాత్రమే తాము కేంద్రాన్ని అడుతున్నామని తెలుగుదేశం పార్టీ పేర్కొంది. ఈ నాలుగేళ్లలో రాష్ట్రానికి కేంద్రం ప్రభుత్వం ఏవేమి ఇచ్చిందో తెలుపుతూ ఆంధ్రప్రదేశ్ బిజెపి అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు శనివారం 27పేజీల ప్రెస్‌నోట్ విడుదల చేశారు.దీనిపై తెలుగుదేశం పార్టీ మండిపడింది. టిడిపి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కళా వెంకట్రావు, ఎంపీలు గల్లా జయదేవ్, రామ్మోహన్‌నాయుడు ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి చర్చించారు. అనంతరం నేతలు మీడియాతో మాట్లాడుతూ.. బిజెపి చెబుతున్నవి కేవలం లెక్కలు మాత్రమేనని స్పష్టం చేశారు. 'అసంబద్ధ విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదే. ప్రత్యేక ప్యాకేజీలో పేర్కొనవన్నీ కేంద్రం నెరవేర్చాలి. రాష్ట్ర ప్రయోజనాల కోసం కావాల్సిన కేటాయింపులు కేంద్ర బడ్జెట్‌లో లేవు. బడ్జెట్‌లో కేటాయింపులపై మిత్రపక్షంగా మేం అసంతృప్తిగా ఉన్నాం. రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం.'

లంకేయులు రాజపక్షమే!

స్థానిక ఎన్నికల్లో ఘన విజయం దిశగా ఎస్‌ఎల్‌పిపి





కొలంబో: శ్రీలంక మాజీ అధ్యక్షుడు రాజపక్షకు చెందిన శ్రీలంక పీపుల్స్ పార్టీ(ఎస్ఎల్‌పిపి) స్థానిక ఎన్నికల్లో ఘన విజయం దిశగా దూసుకెళుతోంది. 45 శాతం మెజారిటీ ఓట్లను ఆర్జించిందని మీడియా రిపోర్టుల ద్వారా తెలుస్తోంది. మొత్తం 341 స్థానిక మండళ్లలో 340 మండళ్లకు జరిగే ఎన్నికల్లో 1 కోటి 50 లక్షల మంది ఓటర్లు పాల్గొన్నారరు. శ్రీలంక అధికార కూటమి శనివారం మొదటి సారి ఎన్నికల పరీక్షను ఎదుర్కొంది. ఫలితాల ప్రకారం శ్రీలంక పీపుల్స్ పార్టీ 909 స్థానాలతో 703117 ఓట్లు, యునైటెడ్ నేషనల్ పార్టీ(యుఎన్‌పి) 459 స్థానాలతో 469986 ఓట్లు గెలుచుకున్నాయని అక్కడి దినపత్రిక 'డెయిలీ మిర్రర్' పేర్కొంది. దీంతో ఎస్ఎల్‌పిపి 45 శాతం మెజారిటీ ఓట్లతో స్థానిక ప్రభుత్వ ఎన్నికల్లో ఘన విజయం దిశగా దూసుకుపోతోందని సమాచారం. ఆదివారం ఉదయంకల్లా 81 మండళ్ల ఎన్నిక ఫలితాలు ప్రకటించారు. రాజపక్షకు చెందిన ఎస్ఎల్‌పిపి అనూహ్యంగా 51 మండళ్లలో గెలిచి మెరుగైన తీరును కనబరిచింది. శ్రీలంక ప్రస్తుత అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేనకు చెందిన శ్రీలంక ఫ్రీడమ్ పార్టీ(ఎస్ఎల్‌పిపి), ప్రధాని రనిల్ విక్రమసింఘెకు చెందిన యునైటెడ్ నేషనల్ పార్టీ(యుఎన్‌పి) వెనుకబడ్డాయి.యుఎన్‌పి 81కౌన్సిళ్లలో 10 మాత్రమే గెలుచుకోగా, శ్రీలంక ఉత్తరాదిన తమిళ్ నేషనల్ కూటమి కూడా 10 మండళ్లు గెలుచుకుంది. 2015 శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిపాలైన రాజపక్ష పార్టీ ఇప్పుడు స్థానిక ప్రభుత్వ ఎన్నికల్లో మెరుగైన తీరు కనబరచడంతో మళ్లీ రాజకీయాల్లో ముఖ్యపాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజపక్షకు శ్రీలంక బౌద్ధుల మద్దతు మెండుగా ఉంది.30 ఏళ్లపాటు వేర్పాటు యుద్ధం కొనసాగించిన ఎల్‌టిటిఇని తుదముట్టించినందుకు ఆయనని వారు ఓ హీరోలా చూస్తారు. ఏదిఏమైనప్పటికీ ఓటర్లకు రాజపక్ష కృతజ్ఞతలు తెలిపి విజయ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. మైనారిటీ తమిళులు, ముస్లింలు ఓటేయడం వల్లే, వారి మద్దతు ఉండడం వల్లే సిరిసేన అధికారంలో ఉన్నారు.స్థానిక ఎన్నికల్లో రాజపక్ష గెలుపు శ్రీలంకలో ప్రభుత్వాన్ని మార్చేందుకు దారితీయొచ్చని కూడా విశ్లేషకులు భావిస్తున్నారు. రాజపక్షను ఓడించడంలో ప్రధాన మద్దతుదారుగా ఉండిన విక్రమసింఘేతో సిరిసేనకు ఇటీవల కాలంలో పొసగడం లేదు. రాజపక్ష ప్రభుత్వం కన్నా విక్రమసింఘే యుఎన్‌పి మరింత అవినీతికరమైనదని సిరిసేనవర్గం దాడికి దిగి ప్రధాన పక్షంగా తయారయింది. మాజీ అధ్యక్షుడు రాజపక్ష వర్గం చేతిలో ఓడిపోతామన్న భయంతోనే సిరిసేనకు చెందిన శ్రీలంక ఫ్రీడం పార్టీ ఎన్నికలను వాయిదా వేస్తోందన్న ఆరోపణ ఉంది. 2015 ఎన్నికల సంస్కరణల తర్వాత దేశవ్యాప్తంగా330 స్థానిక ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసింది. ఎన్నికలను మరో ఏడాది వాయిదా వేసేందుకు, ఒకే రోజున మొత్తం తొమ్మిది ప్రాంతీయ మండళ్ల ఎన్నికలు జరిపేందుకు రాజ్యాంగ సవరణను ప్రతిపాదించింది. అయితే సుప్రీంకోర్టు ఆ ప్రతిపాదిత 20వ రాజ్యాంగ సవరణ ప్రతిపాదనపై సెప్టెంబర్‌లో తీర్పు చెప్పింది. ఒకే రోజున మండళ్ల ఎన్నికలు జరపాలంటే పార్లమెంటులో మూడింట రెండో వంతు మెజారిటీ, దేశవ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణ(రిఫరెండం) నిర్వహించాలని పేర్కొం ది. అంతేకాక ప్రతి మండలిలో మహిళలకు 25 శాతం మహిళల ప్రాతినిధ్యాన్ని ఇవ్వాలని ఆదేశించింది.

విద్యుత్ ఛార్జీలపై నేడు ఇఆర్‌సి విచారణ



మన తెలంగాణ/హైదరాబాద్: విద్యుత్ చార్జీల ఖరారుపై సోమవారం నాడు విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణ నిర్వహించనుంది. నగరంలోని ఫ్యాప్సీ భవన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ఈ విచారణలో రైతులు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాలు, నిపుణులు తమ అభ్యంతరాలు, సలహాలు, సూచనలు కమిషన్‌కు తెలుపుతారు. 2018–19లో విద్యుత్ సంస్థల వార్షిక అవసరాలకు రూ.35,714 కోట్లు కావాలని డిస్కంలు అంచనా వేశాయి.ఇందులో విద్యుత్ కొనుగోళ్లకే రూ.27,903 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. యూనిట్ విద్యుత్‌పై సగటున రూ.6.42 వెచ్చిస్తున్నామని డిస్కంలు చెప్పాయి. 2018–19 అవసరాలకు గాను 67,573 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ముందస్తుగా సమకూర్చుకున్నారు. అయితే రాష్ట్ర అవసరాలు 64,291 మిలియన్ యూనిట్లు మాత్రమే. అవసరాలకు మించి 3,282 మిలియన్ యూనిట్లను ముందస్తు కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నారు. విద్యుత్ కొనుగోళ్లు పెరగడంతో అదనంగా రూ.1,210 కోట్ల భారం డిస్కంలపై పడింది. 24 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా ప్రారంభం కావడంతో అదనంగా 5,088 మిలియన్ యూనిట్లు సమకూర్చుకున్నారు. ఇందుకు రూ.2550 వెచ్చిస్తున్నారు. ఉదయ్ పథకంలో చేరడం వల్ల డిస్కంలకు తాత్కాలికంగా ఉపశమనం కలిగినా, పెరిగిన భారం సర్దుబాటుపై అధికారులు మదనపడుతున్నారు. మరో వైపు ఎత్తిపోతల పథకాల విద్యుత్ చార్జీలను యూనిట్‌కు రూ. 1.52 తగ్గించి రూ.4.88 వసూలు చేయాలని ప్రతిపాదించారు. అదనంగా డిమాండ్ చార్జీలను ఇరిగేషన్ శాఖ చెల్లించాలని తాజాగా ప్రతిపాదించింది. దీంతో తగ్గించిన ఫలితం ఉండదని ఇరిగేషన్ శాఖ అభ్యంతరం చెప్పింది. ఆదాయ, వ్యయాల మధ్య అంతరం రూ. 9,700 కోట్లకు పైగా ఉంది. ప్రభుత్వ సబ్సిడీ రూ.5,400 కోట్ల వరకు ఇస్తామని ముఖ్యమంత్రి గతంలో హామీనిచ్చారు. అవసరమైతే అదనంగా మరో రూ.500 కోట్లు ఇస్తామని భరోసానిచ్చారు. అయినా రూ.3,800 కోట్ల లోటు ఉంటుంది. ఈ లోటును ఏ విధంగా సర్దుబాటు చేస్తారనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. చార్జీలు పెంచవద్దన్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి తీసుకోవడంతో అదనపు భారాన్ని ఏ విధంగా సర్దుబాటు చేస్తారో చూడాలి. పారిశ్రామిక విద్యుత్ చార్జీలు ఇప్పటికే అధికంగా ఉన్నందున వాటి జోలికి వెళ్లే అవకాశం లేదు. గృహ వినియోగంపైనా భారం ఉండకపోవచ్చని తెలిసింది. మధ్యలో ఉన్న వాణిజ్య కేటగిరీలో కొంత మేర పరోక్ష చార్జీలు వసూలు చేసే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో విద్యుత్ ఉద్యోగుల అలసత్వం, అవినీతిపై నిలదీయాలని రైతు సంఘాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి.

కీసరలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- పాల్గొన్న మంత్రి మహేందర్‌రెడ్డి
- అర్ధరాత్రి స్వామి వారి కళ్యాణోత్సవం



మన తెలంగాణ/కీసర(మేడ్చల్ జిల్లా) :కీసరగుట్టలో శ్రీరామలింగేశ్వర స్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక టీటీడీ వేద పాఠశాల ఆగమశాస్త్ర పండితులు గణపతిశర్మ పర్యవేక్షణలో వేద పండితులు పుణ్యాహవాచనం ద్వారా సర్వ దేవతలను ఆహ్వానిస్తూ ఆరు రోజుల పాటు జరిగే శ్రీరామలింగేశ్వర స్వామి వారి రుద్రయాగ సహిత మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆరు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి రోజు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. వేలాదిగా కీసరగుట్టకు తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ యంవి రెడ్డి, ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రారంభ పూజలో పాల్గొన్నారు. పండితులు ఆలయ మహామండపంలో వారిచే బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచకంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి10 గం టలకు జరగనున్న శ్రీ భవానీ శివదుర్గా సమేత రామలింగేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశా రు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

భక్తులకు భారీ ఏర్పాట్లు : మంత్రి మహేందర్‌రెడ్డి

కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామి వారిని దర్శించుకునేలా ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు.మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఏటా ఆనవాయితీగా నిర్వహించే జాతర క్రీడోత్సవాలను ఆదివారం ఆయన జిల్లా కలెక్టర్ యంవి రెడ్డి, ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డిలతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ,బ్రహ్మోత్సవాలలో ఐదు నుంచి ఆరు లక్షల మంది భక్తులు పాల్గొంటారనే అంచనాతో వసతులు కల్పించినట్లు చెప్పారు. ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో కీసరగుట్టతో పాటు ప్ర ముఖ శైవ క్షేత్రాలకు 1500 బస్సులు నడుపుతున్నామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ కె.ధర్మారెడ్డి, ఉత్సవాల కన్వీనర్, డీపీఓ సురేష్ మోహన్, డీఆర్‌డీఓ కౌటిల్య, జిల్లా క్రీడల అధికారి ఉపేందర్‌రెడ్డి, కీసర ఆర్‌డీఓ హన్మంత్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ టి.రమేష్ శర్మ, ఇఓ లక్ష్మీ నర్సింహ్మామూ ర్తి,వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి సందర్భంగా

నిఘా నీడన ఆలయాలు


- బాంబ్ స్క్వాడ్‌తో ముందస్తు తనిఖీలు
- భారీ పోలీసు బందోబస్తు

మన తెలంగాణ/హైదరాబాద్ :మహాశివరాత్రి పండుగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా రాష్ట్రవ్యాప్తంగా శివాలయాల దగ్గర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా బాంబ్ స్క్వాడ్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. దేవాలయాల వద్ద నిఘాను పెంచారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నట్లు డిజిపి మహేందర్‌రెడ్డి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి దేవాలయంలో ప్రవేశ ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్‌లను ఏర్పాటు చేస్తున్నామని, ఆయా జిల్లాల ఎస్‌పిలు, కమిషనర్లతో బందోబస్తుపై ఇప్పటికే సమీక్ష నిర్వహించినట్లు డిజిపి తెలిపారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళవారం భక్తులు దేవాలయాలను సందర్శిస్తారని, విపరీతమైన రద్దీ ఉండవచ్చని అంచనా వేశామని, దీనికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. వేములవాడ, కాళేశ్వరం, చెరువుగట్టు, యాదగిరిగుట్ట, శలేశ్వరం, ఉమామహేశ్వరం, ఆలంపూర్, కీసర, రామప్ప తదితర దేవాలయాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక పోలీసులతో పాటు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, స్పెషల్ పోలీసులను బందోబస్తులో వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో ఉన్న అన్ని శివాలయాల దగ్గర, జాతీయ, రాష్ట్ర రహదారులపై ఒక రోజు ముందు నుంచే పోలీసు గస్తీని పెంచుతున్నట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలను, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచామని, రాత్రిపూట భక్తులు ప్రయాణించే వాహనాల రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేశామని, రహదారులపై వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమైన కూడళ్ల వద్ద లైటింగ్ ఏర్పాట్లను కూడా చేశారు. ఇక దేవాలయాల వద్ద సిసికెమెరాలను కూడా ఏర్పాటు చేసిన పోలీసులు అనుమానిత వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు డిజిపి వివరించారు.

చంద్రబాబును కలిసిన ఎంపి గల్లా జయదేవ్

అమరావతి: పార్లమెంటులో తీవ్ర స్వరాన్ని వినిపించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో విజయం సాధించిన ఎంపిలు గల్లాజయదేవ్, రామ్మోహన్ నాయుడు ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఎంపీలతో పాటు పార్టీ అధ్యక్షులు కళా వెంకట్రావు, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్ర, సిఎంఒ అధికారులు అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ తదితరులు ఈ భేటికి హాజరయ్యారు. ఢిల్లీలో మారిన తాజా రాజకీయాల నేపథ్యంలో ఈ భేటి ప్రాధాన్యం సంతరించుకుంది. ఆంధ్రప్రదేశ్ విభజనకు సంబంధించిన నిరసన గళాన్ని పార్లమెంటులో సమర్థవంతంగా వినిపించిన తీరుపై ఎంపీలు జయదేవ్, రామ్మోహన్ నాయుడును ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు.

ఎవరో ఒకరు అబద్ధం ఆడుతున్నారు



హైదరాబాద్: టిడిపి, బిజెపి కలయిక వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మేలు జరుగుతుందని భావించినట్లు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చెప్పారు. అంతకుముందు జరిగిన అవకతవకలేమైనా ఉంటే అటు ప్రధానిగా నరేంద్రమోడీ ఇటు అనుభవమున్న ముఖ్యమంత్రిగాచంద్రబాబు నాయు డు ఉంటే చాలా మేలు జరుగుతుందని భావించి 2014లో మద్దతు ప్రకటించినట్లు చెప్పుకొచ్చారు. ప్రశాసన్‌నగర్‌లోని జనసేన కార్యాలయంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌తో సమావేశం అనంతరం పవన్ మీడియాతో మాట్లాడుతూ.. చాలా సార్లు కొన్ని ప్రత్యేక పరిస్థితులు వచ్చినప్పటికీ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రాష్ట్రానికి ప్రతీ చిన్నదానికి గొడవ చేసి ఇబ్బంది పెట్టడం ఎందుకని కొంత సంయమనం పాటించానని వెల్లడించారు.ప్రజల మాదిరిగానే తనకూ కొంత గందరగోళం ఉందని, ప్రత్యేక హోదా, హామీలు నెరవేర్చకపోవడం వల్లఅందిరిలాగే తనకూ అసంతృప్తి ఉందని తెలిపారు. అందరికంటే తాను బాధ్యతగా భావిస్తున్నానని.. తనను ఎవరూ రాజకీయాల్లోకి రావాలని చెప్పలేదని తనకు స్వతహాగా అనిపించి ప్రజలకోసం వచ్చానన్నారు. కానీ, వచ్చాక జరుగుతున్న పరిస్థితులను చూసి రెండు మూడు సభలను పెట్టానని చాలా విషయాలపై ప్రశ్నించానని, తనకు స్పష్టమైన సమాచారం రాలేదన్నారు. పోలవరంపై శ్వేతపత్రం కోసం ప్రశ్నిస్తే వెబ్‌సైట్‌లో పెట్టామని చూసుకోవాలన్నారని అయితే, అదెక్కడా కనపడలేదని చెప్పారు. గతంలో తాను ఏవైతే మాట్లాడానో.. ఈ మధ్య కాలంలో వాటిపైనే రాష్ట్రప్రభుత్వం గొడవలు చేయడం చూసి ఇప్పటిదాకా కాలయాపన ఎందుకు చేశారా? అని బాధేసిందన్నారు.రెండు పార్టీలు న్యాయం చేయలేని పక్షంలో తనవంతు బాధ్యతగా వారిని ప్రశ్నించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. అన్ని రాష్ట్రాల కంటే ఎపి ఎక్కువే ఇచ్చామని కేంద్రంలోని బిజెపి చెబుతోందని.. మరోవైపు రాష్ట్రానికి రావాల్సినవేవి సక్రమంగా రావడంలేదని అంతా అస్తవ్యస్తంగా ఉందని రాష్ట్రం చెబుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో తనవంతు బాధ్యతగా ఏదో ఒకటి చేయాలనుకున్నప్పుడు రాజకీయాలకు సంబంధం లేకుం డా అస్త్రసన్యాసం చేసిన ఉండవల్లి అరుణ్‌కుమార్‌గారు గుర్తుకొచ్చారన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌తో అనుబం ధం ఉన్నప్పటికీ రాష్ట్ర విభజన సమయంలో ఆ పార్టీతో విభేదించి రాజకీయాల నుంచి వైదొలిగారని.. ఆయనైతే సమస్యను తటస్థంగా చూడగలుగుతారని.. ప్రజల సమస్యలను అర్థవంతంగా చెప్పగలరని భావించానన్నారు. అందుకే ఉండవల్లి, జెపి ఆధ్వర్యంలో నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రం ఎంతైతే నిధులు ఇచ్చిందంటున్నారో దాని వివరాలను రాష్ట్ర ప్రభు త్వం ఇవ్వాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. మరోవైపు బిజెపి సైతం కేం ద్రం ఇచ్చిందని చెబుతుందన్న వివరాలు ఇవ్వాలని చెప్పా రు. వాటిని కమిటీకీ అందజేస్తానని చెప్పా రు. కచ్చితంగా ఇద్దరిలో ఒకరు మాత్రం అబద్ధం ఆడుతున్నారని చెప్పారు. అదేవరో తేల్చాలని అన్నారు. వివరాలన్నీ తీసుకుని కమిటీ తేలుస్తుందని చెప్పారు. తాము అడుగుతున్న వివరాలను అందజేయాలని ప్రెస్‌మీట్ ద్వారా కోరుతున్నానన్నారు.

రైతులకు ట్రాక్టర్ల పంపిణీ

విజయవాడ: విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శ్రీనివాస్ (నాని) సహకారంతో ఆదివారం కేశినేని భవన్ వద్ద ఎన్‌టిఆర్ రైతు రథం పథకం కింద మొదటి విడతగా పార్లమెంటు పరిధిలోని 25 మంది రైతులకు ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీ కార్యాలయం ప్రతినిధి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ పరిధిలో 265 గ్రామాల ప్రజలకు ఐచర్ ట్రాక్టర్ కంపెనీ సబ్సిడీపై ఎన్‌టిఆర్ రైతు రథం పథకం కింద ఇస్తుందని తెలిపారు. ఐచర్ ట్రాక్టర్ కంపెనీ చైర్మన్‌తో మాట్లాడి ఎంపీలు, శాసన సభ్యులకు మంజూరు చేస్తున్న ట్రాక్టర్లు సరిపోని కారణంగా సబ్సిడీపై రైతులకు అవసరమగు ట్రాక్టర్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఐచర్ 380, 480 ట్రాక్టర్‌తో కలిపి రూ.1.3 లక్షల సబ్సిడీతో రైతులకు అందిస్తోందని పేర్కొన్నారు.

టీమిండియాను ఓడించడం తేలిక కాదు: కెప్లర్ వెస్సెల్స్

జోహెన్నస్‌బర్గ్: ప్రస్తుత పరిస్థితుల్లో టీమిండియాను ఓడించడం ఏ జట్టుకైన అంత తేలిక కాదని దక్షిణాఫ్రికా మాజీ దిగ్గజం కెప్లర్ వెస్సెల్స్ అభిప్రాయపడ్డాడు. విరాట్ కోహ్లి సారథ్యంలో భారత జట్టు ఎంతో బలోపేతంగా మారిందన్నాడు. ముఖ్యంగా వన్డేల్లో భారత్ బలమైన శక్తిగా ఎదిగిందన్నాడు. రానున్న ప్రపంచకప్‌లో భారత్‌ను ఓడించాలంటే ఇతర జట్లు తీవ్రంగా శ్రమించాల్సి వస్తుందని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన బ్యాట్స్‌మెన్, బౌలర్లకు భారత్‌లో కొదవలేదన్నాడు. అంతేగాక యువ ఆటగాళ్లు ఎందరో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపాడు. గతంలో ఆస్ట్రేలియా, విండీస్‌ల లాగా భారత్ కూడా అంతర్జాతీయ క్రికెట్‌ను శాసించే రోజులు వస్తాయని చెప్పడంలో సందేహం లేదన్నాడు. అయితే ఇదంత కెప్టెన్ వల్లే సాధ్యమయిందన్నాడు. జట్టును అతను ముందుండి నడిపిస్తున్న తీరు తనను ఎంతో ఆనందానికి గురి చేస్తుందన్నాడు. దక్షిణాఫ్రికా వంటి బలమైన జట్టును వరుసగా మూడు వన్డేల్లో ఓడించడం అంత తేలిక కాదన్నాడు. అయితే భారత్ ఇది ఆచరణలో చేసి చూపించిందన్నాడు. రానున్న రోజుల్లో భారత్ జైత్రయాత్ర కొనసాగిస్తుందనే నమ్మకం తనకుందని వెస్సెల్స్ పేర్కొన్నాడు.





అమెరికాకు స్వర్ణం

• **వింటర్ ఒలింపిక్స్**



ప్యాంగ్‌చాంగ్: దక్షిణ కొరియాలో జరుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో అమెరికా తొలి స్వర్ణం సాధించింది. పురుషుల స్నోబోర్డ్ విభాగంలో అమెరికా స్టార్, 17 ఏళ్ల రెడ్ గెరాడ్ పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. ఈ పోటీల్లో అమెరికాకు ఇదే మొదటి స్వర్ణం కావడం విశేషం. ఆదివారం జరిగిన పోటీల్లో గెరాడ్ అసాధారణ పోరాట పటిమతో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాడు. అతనికి కెనడా అథ్లెట్ల నుంచి గట్టి పోటీ ఎదురైంది. కీలక సమయంలో స్కోరింగ్‌ను పెంచుకున్న గెరాడ్ పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. హోరాహోరీగా సాగిన పోరులో గెరాడ్ 43.33, 46.40 స్కోరు సాధించి తన ఆధిక్యాన్ని 87.16కు పెంచుకున్నాడు. ప్రత్యర్థులు మాక్స్ పారట్, మార్క్ మెక్ మోరిస్‌లు రజత, కాంస్య పతకాలతో సంతృప్తి పొందారు. ప్రతికూల వాతావరణంలోనూ గెరాడ్ అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ప్రత్యర్థి ఆటగాళ్ల పోటీని తట్టుకుంటూ ముందుకు సాగి ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాడు.

హాకీలో విజయం..



మరోవైపు మహిళా ఐస్ హాకీలో కూడా అమెరికా జట్టు విజయం సాధించింది. ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో అమెరికా ఉమెన్స్ జట్టు 3–1 తేడా తో ఫిన్‌లాండ్‌ను ఓడించింది. ప్రారంభం నుంచే అమెరికా దూ కుడైన ఆటను కనబరిచింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ ఘన విజయాన్ని దక్కించుకుంది.


నార్వే క్లీన్‌స్వీప్



పురుషుల స్కియథ్లాన్‌లో నార్వే క్లీన్ స్వీప్ సాధించింది. ఈ క్రీడాంశంలో నార్వే మూడు పతకాలు గెలుచుకొని తన సత్తాను చాటింది. పురుషుల స్కియథ్లాన్‌లో సిమెన్ క్రుగర్ స్వర్ణ పతకం సాధించాడు. ఈ విభాగంలో మిగిలిన పతకాలు కూడా నార్వే ఖాతాలోకే వెళ్లాయి. క్లిష్టమైన పరిస్థితులను సైతం తట్టుకొని క్రుగర్ రేసును పూర్తి చేసి స్వర్ణం దక్కించుకున్నాడు. జోహెన్నస్ కలెబో కూడా అద్భుత ప్రతిభతో పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఇదిలావుండగా పురుషుల 5వేల మీటర్ల స్పీడ్ స్కేటింగ్‌లో నెదర్లాండ్ ఆటగాడు స్వెన్ క్రమర్ పసిడి పతకం గెలుచుకున్నాడు. వింటర్ ఒలింపిక్స్‌లో క్రమర్‌కు ఇది వరుసగా మూడో స్వర్ణం కావడం విశేషం. ప్రారంభం నుంచే పూర్తి ఆధిపత్యం చెలాయించిన క్రమర్ ప్రత్యర్థులకు అందనంత వేగంగా లక్ష్యాన్ని చేరుకుని తన ఖాతాలో పసిడి పతకాన్ని జమచేసుకున్నాడు.

ఫెదరర్ @ 1

పారిస్: స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానాన్ని దక్కించుకున్నాడు. రోటర్‌డామ్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు చేకుకోవడం ద్వారా స్విస్ స్టార్ ఫెదరర్ తన కెరీర్‌లో మరోసారి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ప్రతిష్టాత్మకమైన ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో టైటిల్ సాధించిన ఫెదరర్ తాజాగా తన ఖాతాలో నంబర్‌వన్ ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. అతని చిరకాల ప్రత్యర్థి రఫెల్ నాదల్ గాయం వల్ల కొన్ని పోటీలకు దూరం కావడంతో ఫెదరర్‌కు నంబర్‌వన్ ర్యాంక్ దక్కింది. ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత స్విస్ దిగ్గజం ఫెదరర్ మరోసారి పురుషుల సింగిల్స్‌లో తిరిగి నంబర్‌వన్ ర్యాంక్‌ను సాధించాడు. ఇంత సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సాధించిన తొలి ఆటగాడిగా కూడా ఫెదరర్ రికార్డు సృష్టించాడు. అంతేగాక 36 ఏళ్ల వయసులో ఈ ర్యాంక్‌ను సాధించడం ద్వారా తనలో చేవ తగ్గలేదని మరోసారి నిరూపించాడు. పురుషుల టెన్నిస్‌లో ఎదురులేని శక్తిగా కొనసాగుతున్న ఫెదరర్ ఇప్పటికే తన ఖాతాలో 20 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ జమ చేసుకున్నాడు. మరోవైపు నాదల్, ముర్రే, జొకోవిచ్‌లు గాయాలతో సతమతమవుతు ఆటకు దూరంగా ఉంటుండంతో ఫెదరర్‌కు ఎదురే లేకుండా పోయింది. ప్రపంచ టెన్నిస్‌లోనే అత్యుత్తమ ఆటగాళ్లుగా పేరు తెచ్చుకున్న నాదల్, జొకోవిచ్, ముర్రేలు ఇప్పటికిప్పుడూ గాయాల నుంచి కోలుకునే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో మరి కొంత కాలం పాటు ఫెదరర్ నంబర్‌వన్ ర్యాంక్‌కు పెద్దగా పోటీ ఎదురు కాక పోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.





ఏదీ కలిసి రాలేదు

• **టీమిండియా సారథి కోహ్లి**

జోహెన్నస్‌బర్గ్: నాలుగో వన్డేలో తమకు ఏదీ కలిసి రాలేదని, అందువల్లే ఓటమి తప్పలేదని భారత కెప్టెన్ విరాట్ కోహ్లి అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో అన్ని పరిణామాలు తమకు వ్యతిరేకంగా జరిగాయన్నాడు. ముందుగా తాము బ్యాటింగ్ చేస్తున్న సమయంలో ప్రతికూల వాతావరణంతో ఆట ఆగి పోయిందన్నాడు. ఆట అలాగే కొనసాగి ఉంటే తమ స్కోరు కనీసం 330 పరుగుల వరకు చేరేదన్నాడు. అయితే మ్యాచ్ ఆగిపోవడంతో ఆటగాళ్ల లయ తప్పిందన్నాడు. మరోవైపు ఈ మ్యాచ్‌లో వర్షం తమ అవకాశాలను దెబ్బతీసిందని చెప్పాడు. కీలక సమయంలో వర్షం రావడం, ఓవర్లను కుదించడం ప్రత్యర్థి జట్టుకు కలిసి వచ్చిందన్నాడు. మ్యాచ్ పూర్తి ఓవర్ల పాటు కొనసాగి ఉంటే ఫలితం మరో విధంగా ఉండేదన్నాడు. లక్ష్యం తగ్గడంతో సౌతాఫ్రికా బ్యాట్స్‌మన్‌పై ఒత్తిడి తగ్గిందన్నాడు. దీంతో అంతకు ముందు వరకు ఉన్న భారీ లక్ష్యం భారం వారిపై లేకుండా పోయిందన్నాడు. దీంతో సౌతాఫ్రికా ఆటగాళ్లు స్వేచ్ఛగా బ్యాట్‌ను ఝులిపించ గలిగారన్నాడు. డివిలియర్స్ ఆడింది కొంత సేపే అయినా అప్పటికే బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడంలో సఫలమయ్యాడన్నాడు. అతను చాహల్‌ను లక్ష్యంగా చేసుకుని సాగించిన పోరాటం మ్యాచ్ గతిని మార్చిందనడంలో సందేహం లేదన్నాడు. దీనికి తోడు డేవిడ్ మిల్లర్ రెండు సార్లు ఔటయ్యే ప్రమాదం నుంచి బయట పడడం కూడా సౌతాఫ్రికాకు కలిసి వచ్చిందన్నాడు. అతను క్లీన్ బౌల్డ్ అయినా నోబాల్ వల్ల బతికి పోయాడన్నాడు. అంతేగాక ఫ్రీహిట్ వల్ల క్యాచ్ ఔటైనా మళ్లీ బ్యాటింగ్ చేసే అవకాశం దక్కిందన్నాడు. ఈ పరిణామం తమ నుంచి మ్యాచ్‌ను దూరం చేసిందన్నాడు. మరోవైపు భారత బౌలర్లు గాడి తప్పిన బంతులతో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ కోలుకునేలా చేశారన్నాడు. దీంతోపాటు చెత్త ఫీల్డింగ్ కూడా తమ ఓటమికి మరో కారణమన్నాడు. వర్షం వల్ల మైదానం తడిగా మారడంతో ఫీల్డింగ్ చేసేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయన్నాడు. ఆటగాళ్లు మైదానంలో సులువుగా కదలలేక పోయారన్నాడు.

సౌతాఫ్రికాకు జరిమానా

భారత్‌పై అద్భుత విజయంతో ఆనందంలో ఉన్న దక్షిణాఫ్రికా జట్టుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) షాక్ ఇచ్చింది. భారత్‌తో జరిగిన నాలుగో వన్డేలో స్లో ఓవర్ రేట్ కారణంగా సౌతాఫ్రికా జట్టుకు జరిమానా విధిస్తూ ఐసిసి నిర్ణయం తీసుకుంది. సౌతాఫ్రికా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన మార్‌క్రామ్‌కు మ్యాచ్ ఫీజులో 20 శాతం కోతను ఐసిసి విధించింది. అంతేగాక జట్టు సభ్యులు ఒక్కొక్కరికి పది శాతం జరిమానా చెల్లించేలా నిర్ణయం తీసుకుంది. కాగా, వచ్చే ఏడాది కాలంలో మార్‌క్రామ్ కెప్టెన్‌గా వ్యవహరించి జట్టు స్లో ఓవర్ రేట్‌కు కారణమైతే అతనిపై ఓ మ్యాచ్ నిషేధం విధిస్తామని ఐసిసి ప్రకటించింది. కాగా, భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రతికూల వాతావరణం వల్ల సౌతాఫ్రికా బౌలర్లు వేగంగా బౌలింగ్ చేయలేక పోయారు. దీని ప్రభావంతో నిర్ణీత సమయంలో ఓవర్ల కోటా పూర్తి కాలేదు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఐసిసి నిబంధనల ప్రకారం సౌతాఫ్రికా జట్టుపై జరిమానా విధించింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఐదు వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించిన విషయం విదితమే.

ఆశ్చర్యం కలిగించింది: క్లాసెన్

ఈ మ్యాచ్‌లో భారత కెప్టెన్ కోహ్లి అనుసరించిన వ్యూహం తనను ఆశ్చర్యానికి గురి చేసిందని దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ క్లాసెన్ అన్నాడు. విధ్వంసక ఇన్నింగ్స్‌తో దక్షిణాఫ్రికాకు చిరస్మరణీయ విజయాన్ని అందించి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచిన తర్వాత క్లాసెన్ ఈ విధంగా స్పందించాడు. ఈ మ్యాచ్‌లో తన బ్యాటింగ్ ఎంతో బాగుందన్నాడు. డెత్ ఓవర్లలో అద్భుతంగా రాణించే బుమ్రా, భువనేశ్వర్‌లను కాదని కోహ్లి స్పిన్నర్లు చాహల్, కుల్దీప్‌లతో బౌలింగ్ చేయించడం తనను ఆశ్చర్య పరిచిందన్నాడు. బుమ్రా, భువీల బౌలింగ్‌ను ఎదుర్కొవడం కాస్త క్లిష్టమేనన్నాడు. అయితే తొలి మూడు మ్యాచుల్లో రాణించడంతో కోహ్లి ఈసారి కూడా స్పిన్నర్లనే నమ్ముకుని ఉండవచ్చన్నాడు. ఈ మ్యాచ్‌లో అద్భుతంగా రాణించడం ఆనందం కలిగించిందన్నాడు. రానున్న మ్యాచుల్లో మరింత ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేసేందుకు ఈ ఇన్నింగ్స్ దోహదం చేస్తుందనడంలో సందేహం లేదన్నాడు.

అతనే దూరం చేశాడు...



ఈ మ్యాచ్‌లో క్లాసన్ బ్యాటింగ్‌ను ఎంత పొగిడిన తక్కువేనని కోహ్లి అన్నాడు. అతను కొట్టిన కొన్ని షాట్లు మ్యాచ్‌కే హైలైట్‌గా మారాయన్నాడు. అతని బ్యాటింగ్ తనను ఎంతో ఆకట్టుకుందన్నాడు. చాహల్, కుల్దీప్‌ల బంతులను అతను సిక్స్‌లు, ఫోర్లుగా మలిచిన తీరు చూడముచ్చటగా ఉందన్నాడు. మిల్లర్ కూడా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. అద్భుత బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను తమ నుంచి లాగేసుకున్నాడన్నాడు. అసాధారణ పోరాట పటిమను కనబరిచిన సౌతాఫ్రికానే ఈ మ్యాచ్‌లో విజయం సాధించేందుకు అర్హులని కోహ్లి పేర్కొన్నాడు. కాగా, రానున్న రెండు వన్డేల్లో విజయమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నాడు. ఇందులో గెలుస్తామనే నమ్మకం తనకుందన్నాడు. ఈ ఓటమిని ఇంతటితో వదిలేసి రానున్న మ్యాచ్‌లకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవుతామని కోహ్లి స్పష్టం చేశాడు.

సఫారీలు గాడిలో పడ్డారు..

జోహెన్నస్‌బర్గ్: వరుస ఓటములతో డీలా పడ్డ దక్షిణాఫ్రికాకు శనివారం భారత్‌పై లభించిన విషయం ఆత్మవిశ్వాసం రెట్టింపు చేసిందనే చెప్పాలి. హ్యాట్రిక్ పరాజయాలతో దిక్కుతోచని స్థితిలో కొట్టు మిట్టాడుతున్న సఫారీలకు నాలుగో వన్డేలో గెలుపు ఊరటనిచ్చింది. ఈ మ్యాచ్‌లో క్లాసెన్ రూపంలో కొత్త అస్త్రం వారికి దక్కాడు. ఈ మ్యాచ్‌లో కార్లసన్ ఆకాశమే హద్దుగా చెలరేగి పోయిన విషయం తెలిసిందే. డేవిడ్ మిల్లర్ కూడా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. ఇక, డివిలియర్స్ ఆడింది కొద్ది సేపే అయినా తాను ఎంత ప్రమాదకర బ్యాట్స్‌మెనో భారత బౌలర్లకు రుచి చూపించాడు. చివర్లో ఫెలుక్‌వాయో కూడా ప్రకంపనలు సృష్టించాడు. వరుస ఫోర్లు, సిక్సర్లతో భారత బౌలింగ్‌ను ఊచకోత కోశాడు. ఈ మ్యాచ్‌లో అన్ని పరిణామాలు ఆతిథ్య దక్షిణాఫ్రికాకు అనుకూలంగా మారాయి. తొలి మూడు వన్డేల్లో సఫారీ బ్యాటింగ్ లైనప్‌కు చెక్ పెట్టిన స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చాహల్‌లు ఈసారి తేలి పోయారు. వీరిద్దరిని లక్ష్యంగా చేసుకొని సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్ చేసిన పోరాటం అమోఘం. కుల్దీప్, చాహల్‌ల బౌలింగ్‌ను చీల్చి చెండాడి ఓ ఆట ఆడుకున్నారు సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్. ముఖ్యంగా డివిలియర్స్, మిల్లర్, కార్లసన్, చివర్లో ఫెలుక్‌వాయో ఈ మ్యాచ్‌లో చెలరేగి తీరు భారత బౌలర్ల గుండేల్లో గుబులు రేకెత్తిస్తోంది. ముఖ్యంగా స్పిన్ ద్వయం చాహల్, కుల్దీప్‌లకు ఇది మింగుడు పడని పరిణామమే. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన వీరిద్దరిపై సఫారీ ఆటగాళ్లు అనూహ్యంగా విరుచుకుపడ్డారు.



ముఖ్యంగా వికెట్ కీపర్ కార్లసన్ రివర్స్ షాట్స్‌తో వీరిని ఓ ఆట ఆడుకున్నాడు. వన్డే క్రికెట్ చరిత్రలోనే చిరకాలం గుర్తుండి పోయే భారీ సిక్సర్లను క్లాసెన్ ఈ మ్యాచ్‌లో కొట్టాడు. అతని బ్యాటింగ్ చూస్తుంటే భవిష్యత్తులో బౌలర్లకు కష్టాలు తప్పక పోవచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. క్లిష్టమైన బంతులను సైతం అసాధారణ రీతిలో బౌండరీలకు తరలించడం ఒక్క క్లాసెన్‌కే సాధ్యమైందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అతని బ్యాటింగ్ చూసి భారత అభిమానులు సైతం ఆనందంతో మైమరచి పోయారు. ముందుకొచ్చి అతను కొట్టిన సిక్స్‌లు మ్యాచ్‌కే హైలైట్‌గా మారాయి. మిగిలిన రెండు వన్డేల్లో భారత బౌలర్లకు గట్టి సవాలు ఎదురు కావడం ఖాయంగా కనిపిస్తోంది. డివిలియర్స్ రాకతో బలోపేతంగా మారిన దక్షిణాఫ్రికాకు తాజాగా మిల్లర్, క్లాసెన్, ఫెలుక్‌వాయోలు ఫాంలోకి రావడం కలిసి వచ్చే పరిణామమే. మరోవైపు ఇప్పటివరకు ఎదురులేని శక్తిగా జోరును కొనసాగించిన భారత బౌలర్లకు మిగిలిన రెండు వన్డేలు చావోరేవోగా మారాయి. రానున్న మ్యాచ్‌లు భారత బౌలర్లకు, దక్షిణాఫ్రికా మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్‌లకు పోరుగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఇందులో ఎవరు పైచేయి సాధిస్తే వారికే విజయం దక్కుతుందని చెప్పక తప్పదు.

సౌరాష్ట్ర జయకేతనం

• **విజయ్ హజారే ట్రోఫీ**

మన తెలంగాణ/ హైదరాబాద్: విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా ఆదివారం జింఖానా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో సౌరాష్ట్ర నాలుగు వికెట్ల తేడాతో జార్ఖండ్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన జార్ఖండ్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 329 పరుగులు చేసింది. ఓపెనర్‌గా దిగిన కెప్టెన్ ఇషాన్ కిషన్ ఏడు సిక్సర్లు, మరో ఐదు ఫోర్లతో 93 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ విరాట్ సింగ్ 44 పరుగులు చేశాడు. ఇద్దరు కలిసి తొలి వికెట్‌కు 145 పరుగులు జోడించారు. మరోవైపు వన్‌డౌన్‌లో వచ్చిన సుమీత్ కుమార్ వేగంగా 64 పరుగులు సాధించాడు. దీంతో జార్ఖండ్ స్కోరు 329కి చేరింది. తర్వత బ్యాటింగ్‌కు దిగిన సౌరాష్ట్ర 48.2 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. రవీంద్ర జడేజా అజేయ శతకంతో సౌరాష్ట్రను గెలిపించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన జడేజా ఏడు ఫోర్లు, 4 సిక్సర్లతో 113 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరోవైపు కెప్టెన్ చటేశ్వర్ పుజారా 44, చిరాగ్ జానీ (59), అర్పిత్ వస్వదా (36) తనవంతు పాత్ర పోషించారు.

విదర్భకు షాక్...

ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఛత్తీడ్‌గఢ్ 45 పరుగుల తేడాతో విదర్భను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఛత్తీస్‌గఢ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 284 పరుగులు సాధించింది. కెప్టెన్ అమణ్‌దీప్ (65), వికెట్ కీపర్ మనోజ్ సింగ్ (41) పరుగులు జట్టును ఆదుకున్నారు. చివర్లో విశాల్ ఐదు సిక్సర్లు, మరో నాలుగు ఫోర్లతో వేగంగా 61 పరుగులు చేయడంతో ఛత్తీస్‌గఢ్ భారీ స్కోరును సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన విదర్భ 46.1 ఓవర్లలో 239 పరుగులకే కుప్పకూలింది. అక్షయ్ (60), కెప్టెన్ ఫైజ్ ఫజల్ (53) అర్ధ సెంచరీలు కొట్టినా జట్టును గెలిపించలేక పోయారు. మరోవైపు ఎఓసి సెంటర్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన మరో మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ ఐదు వికెట్ల తేడాతో సర్వీసెస్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన సర్వీసెస్ 6వికెట్ల నష్టానికి 296 పరుగులు చేసింది. ఓపెనర్ హర్ప్రాల్ వర్మ (125) సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన జమ్మూ 49 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్లు శుభం ఖజురియా (102), అహ్మద్ (92) బ్యాటింగ్‌తో జట్టును గెలిపించారు.



ఆంధ్రా విజయం

చెన్నైలో జరిగిన మరో మ్యాచ్‌లో తెలుగు రాష్ట్రం ఆంధ్రా జట్టు 29 పరుగుల తేడాతో తమిళనాడు జట్టును ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆంధ్రా నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 276 పరుగులు చేసింది. ఓపెనర్ శ్రీకర్ భరత్ (82), సుమంత్ 62 (నాటౌట్), రికీ భుయ్ (52) జట్టుకు అండగా నిలిచారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు 247 పరుగులకే కుప్పకూలింది. ఆంధ్రా బౌలర్లు వరుస క్రమంలో వికెట్లు తీస్తూ తమిళనాడు ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.